బాలుడిని తన్నిన 'మానవ' రోబో



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శనివారం 6 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 151 | పేజీలు:12 | వెల రూ.5

వీగన్ ఆహారాల గుర్తింపునకు వేగన్ 9

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

# నీ పేరు కేసీఆర్ అయితే చర్చకు రా..



## మీ పదేండ్ల పాలన.. ఇందిరమ్మ ఇండ్లపై చర్చిద్దాం

- ఉధండాపూర్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి
- పొర్లు దండాలు పెట్టినా బీఆర్ఎస్ నేతలు చేసిన పాపాలు పోవు
- ఈ ఊరికొస్తే తొండలు విడిచి కొడతారని వారికి హెచ్చరిక



**హైదరాబాద్, జూన్ 5 (మనం బ్యూరో) :** కేసీఆర్ ఓ మేకవన్నె పులి అనీ, ఆ విషయం తెలియక పాలమూరు ప్రజలు రెండు సార్లు ఆయనను ఓటేసి గెలిపించారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నేతలు పాదయాత్రలు కాదు కదా...పొర్లు దండాలు పెట్టినా వారు చేసిన పాపాలు పోవని పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రాజెక్టుల పరిశీలన అనంతరం రెండో రోజైన శుక్రవారం ఉధండాపూర్‌లో నిర్వహించిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ కేసీఆర్ ఐదేళ్లు పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నా ఐదుసార్లు కూడా పాలమూరుకు రాలేదన్నారు. తాను కూడా పాలమూరు జిల్లాలోని మిడ్చిల్ నుంచే మొదటి సారిగా జెడ్పీటీసీగా గెలిచాననీ, నాటి జడ్పీటీసీనే నేడు సీఎంగా జిల్లా ...మిగతా 2లో

### రద్దయిన వెయ్యి రూపాయల నోటు కేసీఆర్

- బీఆర్ఎస్ పార్టీకి గతమే తప్ప భవిష్యత్తు లేదు
- పదేండ్ల పాలనలో పాలమూరు ప్రాజెక్టులను పట్టించుకోనే లేదు
- పాలమూరు-రంగారెడ్డి పనులతో కేసీఆర్ ఇంట్లో కనకవర్షం కురిసింది
- మేం పనులు చేపడుతుంటే రాజకీయం చేస్తున్నరు
- భూ సేకరణ చేయకుండానే ప్రాజెక్టులు ఎట్ల పూర్తయితై?
- కరివెన రిజర్వాయర్ వద్ద ప్రెస్ మీట్‌లో సీఎం రేవంత్ రెడ్డి 2

### ఖరీదైన ప్రభుత్వ భూముల్లో

# ఇందిరమ్మ ఇండ్లు

- ఆ స్థలాల్లో మహిళలకు వాటా కల్పిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, జూన్ 05, (మనం బ్యూరో) :** నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని క్యూర్ పరిధిలో పేదలు నివాసముంటున్న ప్రాంతాల్లో అల్పాదాయ, మధ్య తరగతి ప్రజలకు లక్ష ఇండ్లు నిర్మించబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాల్లో లక్ష ఇండ్లను



నిర్మించి వాటిని పేదింటి ఆడబిడ్డలకు ఇవ్వబోతున్నామని ప్రకటించారు. క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై శుక్రవారం సచివాలయంలో తన కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి క్యూర్ పరిధిలో లక్ష ఇండ్లకు ఇతర ప్రాంతాల్లో కలుపుకుని మొత్తం 3.50 లక్షల ఇండ్లకు ఇప్పటికే పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేయడం జరిగిందనీ, దీనిని దృష్టిలో పెట్టుకుని అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పేద కుటుంబాల మహిళలకు సొంతింటిపై హక్కు కల్పించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక భద్రతను మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. సొంత ఇల్లు మహిళా సాధికారుతకు కుటుంబ స్థిరత్వానికి, భవిష్యత్ తరాల అభివృద్ధికి బలమైన పునాది అవుతుందన్నారు. పేదల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వారికి సౌకర్యవంతంగా ఉండేలా ఇండ్ల డిజైన్లను రూపొందించాలనీ, ఇంటి నిర్మాణం కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండేలా ప్లాన్ చేయాలని అధికారులను ఆదేశించారు.

### 'న్యాక్'కు జాతీయ అవార్డు 2

అత్యుత్తమ నైపుణ్యాభివృద్ధి సేవలందించి గుర్తింపు పొందినందుకు మంత్రి కోమటి రెడ్డి అభినందలు




### బదిలీల ప్రక్రియ

# పారదర్శకంగా నిర్వహించాలె



- మంత్రి దామోదర ఆదేశాలు

#### యథాతథంగా ఓపీ వైద్య సేవలు

**హైదరాబాద్, జూన్ 5, (మనం బ్యూరో) :** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో శనివారం నుంచి ఓపీ వైద్య సేవలు యథావిధిగా కొనసాగనున్నాయి. వైద్య, ఆరోగ్య శాఖలో సాధారణ బదిలీలు జీవో 38కు విరుద్ధంగా జరుగుతున్నాయని ఆరోపిస్తూ ప్రభుత్వ వైద్యుల సంఘాల పిలుపు మేరకు శుక్రవారం ఓపీ వైద్య సేవలను నిలిపివేశారు. ఈమేరకు ఆయా సంఘాల ప్రతినిధులు మంత్రి దామోదర రాజనర్సింహ్మాను కలిసి జీవో నం.38 ప్రకారం గుర్తింపు పొందిన అసోయేషన్లలో ఎన్నికైన నాయకులకు బదిలీల నుంచి మినహాయింపు కల్పించాలని కోరారు. 2024లో అమలు చేసిన విధంగానే ప్రస్తుతం ...మిగతా 2లో

### రూ.30 వేల కోట్ల విలువైన భూమికి


# హైడ్రా రక్షణ కవచం

- పుప్పాలగూడలో 198 ఎకరాల ప్రభుత్వ భూమికి కంచె వేసిన సంస్థ

**హైదరాబాద్,జూన్ 5(మనం న్యూస్) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైడ్రా ఒక భారీ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా వివాదాల్లో నలుగుతూ, కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కుకునే ప్రమాదంలో ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని రక్షించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ-ఖాజాగూడ సరిహద్దుల్లో ఉన్న 198 ఎకరాల ప్రభుత్వ భూమిని శుక్రవారం హైడ్రా తన



ఆధీనంలోకి తీసుకుంది. సుమారు రూ.30,000 కోట్ల విలువ చేసే ఈ భూమిలో 250 కోట్ల సంవత్సరాల నాటి అరుదైన చారిత్రక రాతి గుట్టలు కూడా ఉండటం విశేషం. ఈ ఆపరేషన్‌తో అమూల్యమైన ప్రకృతి, చారిత్రక సంపదకు హైడ్రా రక్షణ కవచం ఏర్పాటు చేసింది.గతంలో రాష్ట్ర ప్రభుత్వం ...మిగతా 2లో



### చిన్న ఫిర్యాదుతో.. బయటపడ్డ పెద్ద స్కాం

రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ రూ.15.15 లక్షల కోట్ల తప్పుడు లెక్కలు


109 పేజీలతో సెబీ మధ్యంతర ఉత్తర్వులు 2



### 'గండిపేట' కేసులో బ్రహ్మానాయుడి అరెస్ట్

గత కొద్ది రోజులుగా పరారీలో ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే

తమిళనాడు కాంచీపురంలో అరెస్ట్ చేసిన పోలీసులు 2



### గాదె ఇన్నయ్యకు మధ్యంతర బెయిల్ 3

### థ్రెడ్ పోచంపల్లి ఎగ్జిబిషన్

# నేతన్నల ప్రతిభకు గ్లోబల్ గుర్తింపు

- జీఐ ట్యాగ్‌తో తెలంగాణ ఖ్యాతిని చాటుతున్న చేనేత కళ
- నేతన్నల కృషితో ప్రపంచ పటంలో తెలంగాణకు ప్రత్యేక స్థానం
- చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్, జూన్ 5 :** థ్రెడ్ పోచంపల్లి చేనేత కళా వైభవాన్ని ప్రపంచానికి మరింత చేరువ చేసే లక్ష్యంతో హైదరాబాద్ లోని హైటెక్స్‌లో6, 7, 8 తేదీలలో నిర్వహిస్తున్న థ్రెడ్ పోచంపల్లి హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్‌లో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టెక్స్టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సహకారంతో ఈ ఎగ్జిబిషన్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. చేనేత కార్మికుల అపూర్వ నైపుణ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు వారికి మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎగ్జిబిషన్లో ఏర్పాటు చేసిన చేనేత స్టాల్సును సందర్శించిన మంత్రి, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంత్, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, హ్యాండ్లూమ్స్ శాఖ అధికారులు, చేనేత సహకార సంఘాలు, మాస్టర్ వీవర్లు, టై అండ్ డై సంఘాలు, చేనేత సోదరులు, అలాగే ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతన్నలందరికీ అభినందనలు తెలిపారు.

యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 12 వేల మంది చేనేత కార్మికులు, ...మిగతా 2లో

# విపత్తుల నివారణకు సంసిద్ధంగా ఉండాలె

- వర్షాకాల సన్నద్ధతపై సందీప్‌కుమార్ సమీక్ష

**హైదరాబాద్,జూన్ 5(మనం న్యూస్) :** వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలపై అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం ఖైరతాబాద్ విద్యుత్ సౌధలో నిర్వహించిన సమావేశంలో వివిధ శాఖల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా విపత్తు నివారణ కోసం ప్రభుత్వం తరపున తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, ఒకవేళ విపత్తు సంభవించినచో సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వివిధ శాఖల మధ్య ఉండవల్సిన సమన్వయం పైన సమీక్ష నిర్వహించి తగు సూచనలు చేశారు.

ఇందుకు అవసరమయ్యే ఆర్థిక సదుపాయాలు కల్పించుటకు ...మిగతా 2లో

# అప్పుడు నేను అక్కడే ఉన్న

- సుప్రీం లీడర్‌పై అమెరికా దాడిలో తాను కూడా గాయపడినట్టు వెల్లడించిన ఇరాన్ మంత్రి అబ్బాస్ అరాగ్చీ



**టెహ్రాన్, జూన్ 5 :** ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇరాన్ పై అమెరికా జరిపిన దాడిలో నాటి సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే, ఆ దాడి సమయంలో తాను సుప్రీం లీడర్ కార్యాలయంలోనే ఉన్నట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి వెల్లడించారు. లెబనాన్ కేంద్రంగా పనిచేసే ఓ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన.. దాడి అనంతరం ఖమేనీ ...మిగతా 2లో

# ఎస్‌యూ-57ను కలిసి డెవలప్ చేద్దాం



### ఐదో తరం యుద్ధ విమానాల ప్రాజెక్టులో భారత్‌కు భాగస్వామ్యాన్ని ఆఫర్ చేసిన పుతిన్

**మాస్కో, జూన్ 5 :** మన వైమానిక దళాన్ని బలోపేతం చేసే దిశగా ఐదోతరం యుద్ధ విమానాన్ని సమకూర్చుకునేందుకు మన రక్షణ శాఖ ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ నుంచి దీనికి సంబంధించిన ఒక ఊహించని ఆఫర్ వచ్చింది. అధునాతన స్టెల్త్ సామర్థ్యాలు కలిగిన సుఖోయ్ ఎస్ యూ -57 యుద్ధ విమానాలను భారత్ తో కలిసి సంయుక్తంగా అభివృద్ధి, ఉత్పత్తి చేయడానికి, అలాగే కీలక సాంకేతికతలను పంచుకోవడానికి రష్యా సుముఖంగా ఉందని వెల్లడించారు. సెయింట్ పీటర్స్ బర్గ్ లో అంతర్జాతీయ వార్తాసంస్థల అధినేతలతో మాట్లాడిన సందర్భంగా అధ్యక్షుడు వ్లాడిమిర్ పుతిన్ ఈ ప్రతిపాదన చేశారు.

రక్షణరంగంలో తమ రెండు దేశాల మధ్య ఎలాంటి పరిమితులు ఉండవని చెప్పిన పుతిన్.. పరోక్షంగా పాశ్చాత్య ...మిగతా 2లో

### మోడీ మంచి మిత్రుడే,

# కానీ భారతే..

### ఇండో-యూఎస్ సంబంధాలపై ట్రంప్ వ్యాఖ్యలు

**వాషింగ్టన్, జూన్ 5 :** ప్రధాని నరేంద్ర మోడీ ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసిస్తూనే.. భారత్ పై విమర్శలు చేశారు. అమెరికాపై అధిక సుంకాలు



విధించి.. భారత్ ఏళ్ల తరబడి లబ్ధి పొందిందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఇవి చర్చనీయాంశంగా మారాయి. శ్వేత సౌధంలో జరిగిన విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ. భారత్- అమెరికా మధ్య ఉన్న బలమైన వ్యక్తిగత సంబంధాల గురించి ఆయన ప్రస్తావించారు. ప్రధాని మోడీ అంటే తనకు చాలా ఇష్టమని.. ...మిగతా 2లో

## బాలుడిని తన్నిన 'మానవ' రోబో

బీజింగ్, జూన్ 5 : చైనాలోని షింజియాగ్ లోని ఉర్మికి బొటానికల్ గార్డెన్ లో గురువారం హ్యూమనాయిడ్ రోబోల ప్రదర్శనను ఏర్పాటుచేశారు. వాటిని చూడడానికి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఓ రోబో మార్షల్ ఆర్ట్స్ విన్యాసాన్ని ప్రదర్శిస్తుండగా దానిని చూడడానికి చిన్నారులు చుట్టూ చేరారు. రోబో మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శిస్తూ.. అనుకోకుండా అక్కడ నిలబడి ఉన్న ఓ చిన్నారిని కడుపులో బలంగా తన్నింది. దీంతో ఆ బాలుడు బాధతో విలవిల్లాడుతూ కుప్పకూలిపోయాడు. ఈ వీడియో వైరల్ గా మారడంతో రోబోల వల్ల తలెత్తే భద్రతాపరమైన సమస్యలపై నెటిజన్లు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కాగా, రోబో తన్నడంతో గాయపడిన బాలుడికి అక్కడి అధికారులు వెంటనే ప్రథమ చికిత్స చేశారని.. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉందని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.

## అప్పుడు నేను అక్కడే ఉన్న

(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్య పరిస్థితి ఏంటనే విషయం తెలియక తీవ్ర ఆందోళన చెందానని చెప్పారు.

**ఇరాన్ పౌరుల రక్షణకే..**

'జెనీవాలో కీలక దౌత్య చర్చలు ముగించుకొని వచ్చా. ఆ వెంటనే నివేదిక ఇవ్వడానికి మరుసటి ఉదయం ఖమేనీ కార్యాలయానికి వెళ్లా. నేను ఆ భవనంలో ఉండగానే దాడి జరిగింది. తాము కూర్చున్న విభాగం కూడా దెబ్బతింది. శిథిలాల నుంచి బయటకు వస్తున్నప్పుడు నా ఆలోచనంతా సుప్రీం లీడర్ పైనే. నా గురించి పట్టించుకోలేదు. ఆయన ఆరోగ్య పరిస్థితి ఏంటనే విషయం తెలియక రెండు రోజులు తీవ్ర ఆందోళన చెందా'' అని అబ్బాస్ అరాగ్చీ చెప్పారు.

అమెరికా, ఇజ్రాయెల్ల నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో.. సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లాలని అంతకుముందే సుప్రీం లీడర్ కు సూచించినప్పటికీ అందుకు ఆయన నిరాకరించారని అరాగ్చీ పేర్కొన్నారు. ఇరాన్ పౌరులందరికీ రక్షణ కల్పించే వరకు తాను ఎక్కడికీ వెళ్లనని స్పష్టం చేశారు. తన ప్రజలకు ఏది జరిగితే.. తనకూ అదే జరుగుతుందని ఖమేనీ చెప్పినట్లు అరాగ్చీ వెల్లడించారు.

**ప్రతీకార చర్యలు ఉండేవి కావు..**

ఇరాన్ పై దాడులకు అమెరికా సైనిక స్థావరాలను ఉపయోగిస్తే ప్రతీకార చర్యలు తప్పవని గల్ఫ్ దేశాలను ముందుగానే హెచ్చరించామని అరాగ్చీ వెల్లడించారు. పొరుగు దేశాల్లో అమెరికా స్థావరాలు లేకుంటే.. వాటిపై ప్రతీకార దాడులు ఉండేవి కావన్నారు. తమ భూభాగాన్ని ఈ విధంగా వినియోగించడాన్ని ఆయా ప్రభుత్వాలు వ్యతిరేకించినప్పటికీ.. వాటిని పట్టించుకోకుండా అమెరికా ముందుకు వెళ్లిందన్నారు.

## ఎస్‌యూ-57ను కలిసి డెవలప్ చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

దేశాలకు చురకలు అంటించారు. ఆ దేశాలు సాంకేతికతను బదిలీ చేసేందుకు పలు ఆంక్షలు విధిస్తుంటాయని గుర్తుచేశారు.

అయితే సు-57 ఫైటర్ జెట్ను సంయుక్తంగా అభివృద్ధి చేసేందుకు రష్యా గతంలోనే భారత్కు అవకాశం ఇచ్చింది. 2018లోనే ఆ చర్చలు జరిగాయని ఆయన గుర్తుచేశారు. అయితే, భారత్ అప్పుడు ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకుంది. ఆ యుద్ధ విమానంతో పూర్తిస్థాయి కార్యాచరణ అవసరాలు తీరవని ఐఏఎఫ్ నిర్ధరించడంతో భారత్ వెనక్కి తగ్గింది. ఇదిలాఉంటే.. స్వదేశీ పరిజ్ఞానంతో ఐదోతరం జెట్ ను తయారు చేసేందుకు భారత్ చేపట్టిన 'అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్' (ఆమ్కా) ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉంది. 2030 మధ్యలో వైమానిక దళంలో చేరొచ్చని తెలుస్తోంది.

## మోడీ మంచి మిత్రుడే, కానీ భారతే..

(మొదటి పేజీ తరువాయి)

ఆయన గొప్ప స్నేహితుడని ట్రంప్ అన్నారు. తమ మధ్య మంచి సంబంధాలున్నాయన్నారు. ఈ సందర్భంగా వాణిజ్య చర్చలకు సంబంధించిన ప్రశ్నకు బదులిస్తూ.. భారతదేశ సుంకాల విధానంపై ఆయన విమర్శలు చేశారు. 'ఏళ్లతరబడి.. అమెరికా నుంచి భారత్ చాలా లబ్ధి పొందింది. మాపై వారు భారీగా సుంకాలు విధించారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం భారత్ నుంచి మేం భారీగా లాభాలు పొందుతున్నాం' అని వ్యాఖ్యానించారు. భారత్- అమెరికా మధ్య త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదురుతుందని తాను భావిస్తున్నట్లు తెలిపారు. వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడమే లక్ష్యంగా ఇరుదేశాల ప్రతినిధుల మధ్య నాలుగు రోజుల పాటు సాగిన చర్చలు ముగిశాయి. ఈ క్రమంలో ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఒప్పందానికి సంబంధించిన చర్చలు సహకార స్ఫూర్తి, ఆచరణాత్మకంగా ముగిశాయని వాణిజ్య శాఖ తెలిపింది. వస్తువుల వాణిజ్యం, కస్టమ్స్ విధానాలు, వాణిజ్య సౌలభ్యం, ఆర్థిక భద్రతా సహకారం వంటి పలు అంశాలపై చర్చలు సాగినట్లు అది వెల్లడించింది.

## చిన్న ఫిర్యాదుతో.. బయటపడ్డ పెద్ద స్కాం

హైదరాబాద్,జూన్ 5 (మనం ప్రత్యేక ప్రతినిధి) : చిన్న ఫిర్యాదుతో రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్‌కు సంబంధించిన అతిపెద్ద ఆర్థిక అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. ఈ భారీ కుంభకోణం వ్యవహారంపై 2024 మార్చి నెలలో ఒక షేర్‌హోల్డర్ సెబీకి చేసిన ఒక చిన్న ఫిర్యాదుతో ఈ భారీ కుంభకోణం బయటకు వచ్చింది. ముఖ్యంగా ఫిర్యాదు దారుడు కంపెనీ ఖాతాల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ట్రేడ్ రిసీవబుల్స్‌పై అనుమానాలు వ్యక్తం చేయడంతో సెబీ ఆదిశగా దర్యాప్తును ప్రారంభించింది. ఆర్థిక లావాదేవీలను నిశితంగా పరిశీలించడానికి స్వతంత్ర ఫోరెన్సిక్ ఆడిటర్ అయిన బిడోను రంగంలోకి దింపింది. 2021 నుండి 2025 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో కంపెనీ రిపోర్ట్ చేసిన ఆదాయాన్ని స్వతంత్రంగా ధృవీకరించలేకపోయారని సెబీ విచారణలో తేలింది. అలాగే దర్యాప్తు సంస్థలు కోరిన కస్టమర్ల వివరాలు, కొనుగోలు రికార్డులు, ఇన్వాయిస్‌లు విదేశీ లావాదేవీలకు సంబంధించిన పత్రాలను అందించడంలో కంపెనీ తీవ్రంగా విఫలమైందని సెబీ స్పష్టం చేసింది. 2021 నుండి 2025 మధ్య కాలంలో సుమారు రూ. 15.15 లక్షల కోట్లను తప్పుగా చూపించారని సెబీ మధ్యంతర ఉత్తర్వులలో పేర్కొంది. మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా జారీ చేసిన తాజా 109 పేజీల మధ్యంతర ఉత్తర్వులు దేశీయ స్టాక్ మార్కెట్లలో తీవ్ర ప్రకంపనలు సృష్టించాయి.ఏకంగా రూ.15.15 లక్షల కోట్ల మేర రాబడి లెక్కలను కంపెనీ తప్పుగా లేదా కృత్రిమంగా చూపించిందనేది సెబీ ప్రధాన ఆరోపణ.

**రాబడిలో మాయాజాలం :**

రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ గ్రూప్ ప్రకటించిన మొత్తం రాబడిలో ఏకంగా 97 శాతం నుండి 99 శాతం వరకు కేవలం దాని విదేశీ అనుబంధ సంస్థల ద్వారానే వచ్చినట్లు చూపించడం దర్యాప్తు అధికారులకు అనుమానాలను రేకెత్తించింది. ఈ విదేశీ సంస్థలలో స్విట్జర్లాండ్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రపంచ ప్రఖ్యాత బంగారం శుద్ధి కర్మాగారం వాల్కాంబి ఎస్ఏ కీలక భూమిక పోషించింది. వాల్కాంబి స్వతంత్ర ఆర్థిక నివేదికల ప్రకారం వారి వార్షిక ఆదాయం 2023లో వాల్కాంబి రాబడి సుమారు రూ.543 కోట్లుగా తేలింది. అయతే దాని మాతృ సంస్థ అయిన గ్లోబల్ గోల్ రిఫైనరీస్, రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ కన్సాలిడేటెడ్ నివేదికల్లో ఒక్కసారిగా రాబడి రూ. లక్షల కోట్లకు చేరుకుంది. ఒక్క 2024 ఆర్థిక సంవత్సరానికే రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ సుమారు రూ.2.81 లక్షల కోట్ల రాబడిని ప్రకటించింది. వందల కోట్ల రాబడి మాతృసంస్థ ఖాతాల్లోకి వచ్చేసరికి రూ. లక్షల కోట్లుగా ఎలా మారిందనేది అంశంపై సెబీ ప్రత్యేక దృష్టి సారించింది.

**అర్థంలేని వాదనలు :**

రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ రాబడి మాయాజాలంపై సెబీ ప్రశ్నలకు కంపెనీ అర్థంలేని వివరణ ఇచ్చింది. ముఖ్యంగా వాల్కాంబి కేవలం ప్రాసెసింగ్ ఫీజును మాత్రమే తన స్వతంత్ర ఖాతాల్లో చూపుతుందని, కానీ కన్సాలిడేటెడ్ అకౌంట్స్ లో లావాదేవీ జరిగిన మొత్తం బంగారం స్థూల విలువను కలుపుతామని తెలిపింది. అయితే ఈ వాదనకు సంబంధించిన పత్రాలను, ఇన్వెంటరీ రికార్డులను సెబీకి సకాలంలో అందించలేకపోయింది. దీంతో సెబీ అవసరమైన పత్రాల సమర్పణలో జాప్యం, సరైన ఆధారాలు లేకపోవడాన్ని తీవ్రంగా పరిగణించడంతో పాటు రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్, ప్రమోటర్ ఛైర్మన్ రాజేష్ మెహతాపై కఠిన ఆంక్షలు విధించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆయన కంపెనీ సెక్యూరిటీలను కొనడం, అమ్మడం లేదా ఎలాంటి ఇతర మార్కెట్ లావాదేవీలు జరపకుండా నిషేధం విధించింది.

**స్పందించిన మాజమాన్యం :**

సెబీ మధ్యంతర ఉత్తర్వులపై రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ యాజమాన్యం స్పందిస్తూ తమ ఆదాయ లెక్కల్లో ఎలాంటి కృత్రిమ పెంపు లేదని తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో స్టాక్ ఎక్స్ఛేంజ్ కు ఒక అధికారిక ప్రకటన ద్వారా తెలియజేసింది.నియంత్రణ సంస్థకు, తమకు మధ్య కేవలం కమ్యూనికేషన్ గ్యాప్ మాత్రమే ఉందని, తాము ప్రకటించిన రాబడి అంతా వంద శాతం వాస్తవమంది. సెబీ జారీ చేసినవి కేవలం దర్యాప్తు సమయంలో ఇచ్చే మధ్యంతర ఉత్తర్వులు మాత్రమేనని, తుది తీర్పు కాదని పేర్కొంది. నియంత్రణ సంస్థ అడిగిన పత్రాలను, ఆధారాలను తాము సిద్ధం చేస్తున్నామని, వాటిని సమర్పించిన తర్వాత ఈ వివాదం సద్దుమణుగుతుందని కంపెనీ యాజమాన్యం ధీమా వ్యక్తం చేసింది.

### థ్రెడ్ పోచంపల్లి ఎగ్జిబిషన్

## నేతన్నల ప్రతిభకు గ్లోబల్ గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

అనుబంధ వృత్తిదారులు తమ జీవనోపాధిని ఈ రంగంపైనే ఆధారపడి కొనసాగిస్తున్నారని మంత్రి తెలిపారు. వారి కష్టానికి తగిన గుర్తింపు, ఉత్పత్తులకు విస్తృత మార్కెట్, మెరుగైన ఆదాయం కల్పించాలనే లక్ష్యంతో ఈ ఎగ్జిబిషన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. సుమారు 100 చేనేత స్టాల్స్ తో పాటు స్వయం సహాయక సంఘాలు, అనుబంధ సంస్థల స్టాల్స్ ఏర్పాటు చేయడం ద్వారా వినియోగదారులకు చేనేత ఉత్పత్తుల వైవిధ్యాన్ని పరిచయం చేస్తున్నారని చెప్పారు.

పోచంపల్లి ఇక్కత్, పుట్టపాక తెలియా రుమాలు వంటి భౌగోళిక గుర్తింపు (జిఐ) పొందిన ఉత్పత్తులు యాదాద్రి భువనగిరి జిల్లాకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయని మంత్రి పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్ చేనేత కళ, నేతన్నల అపూర్వ నైపుణ్యం, సంప్రదాయ వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే వేదికగా నిలుస్తుందన్నారు. పోచంపల్లి నేతన్నల ప్రతిభ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిందని మంత్రి కొనియాడారు. అగ్గిపెట్టెలో పట్టేంత సన్నని చీరలను నేసి తమ కళాత్మకతను చాటుకున్నారని, వారి నైపుణ్యం వల్లే పోచంపల్లి 'సిల్క్ సిటీ ఆఫ్ ఇండియా'గా ఖ్యాతి గడించిందన్నారు.

నిజాం కాలం నుంచే పోచంపల్లి గ్రామానికి అంతర్జాతీయ గుర్తింపు ఉందని, అరబ్ దేశాలకు తెలియా రుమాళ్లు, గాజులు, పూసలు ఎగుమతి చేసిన ఘన చరిత్ర ఈ ప్రాంతానికి ఉందన్నారు. భారతదేశ సామాజిక చరిత్రలో కూడా పోచంపల్లికి ప్రత్యేక స్థానం ఉందని మంత్రి గుర్తుచేశారు. 1951 ఏప్రిల్ 18న ఆచార్య వినోబా భావే ఇక్కడే భూదానోద్యమాన్ని ప్రారంభించారని, ఆయన పిలుపుతో వెదిరె రామచంద్రారెడ్డి 100 ఎకరాల భూమిని పేదలకు దానం చేయడం ద్వారా సామాజిక చైతన్యానికి నాంది పలికారని పేర్కొన్నారు.

ఇక్కడి నేతన్నలు ఇక్కత్, డబుల్ ఇక్కత్ పద్ధతుల్లో పత్తి, పట్టు, సికో వస్త్రాలను తయారు చేస్తూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని తెలిపారు. దారాలకు ముందుగానే ప్రత్యేక డిజైన్లు కట్టి రంగులు అద్దిన అనంతరం మగ్గంపై నేసి, చీరకు ఇరువైపులా ఒకే నమూనా కనిపించేలా రూపొందించడం వారి అసాధారణ నైపుణ్యానికి నిదర్శనమన్నారు. ఈ విశిష్ట కళకు గుర్తింపుగా 2003లో జీఐ ట్యాగ్ లభించిందని చెప్పారు. పోచంపల్లి, పుట్టపాక, కోయలగూడెం, సిరిపురం, భువనగిరి, గట్టుప్పల, చౌటుప్పల్ ప్రాంతాలతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అనేక గ్రామాల్లో వేలాది కుటుంబాలు చేనేత వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాయని మంత్రి తెలిపారు. చేనేత రంగంలో విశేష సేవలు అందించి పద్మశ్రీ పురస్కారాలు పొందిన గజం గోవర్ధన్, గజం అంజయ్య, అలాగే ఆసు యంత్రాన్ని అభివృద్ధి చేసి చేనేత కార్మికుల శ్రమను తగ్గించిన చింతకింది మల్లేశం సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

పోచంపల్లి చీరలకు ఉన్న అంతర్జాతీయ గుర్తింపుకు నిదర్శనంగా ఎయిర్ ఇండియా క్యాబిన్ సిబ్బంది వాటిని ధరిస్తున్నారని, ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో పోచంపల్లి వస్త్రాలు ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయని మంత్రి పేర్కొన్నారు. 'ఒక చీర వెనుక నేతన్న కుటుంబం కష్టం, కళ, జీవన పోరాటం దాగి ఉంటుంది. చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించడం అంటే కేవలం వస్త్రాన్ని కొనుగోలు చేయడం కాదు... ఒక కుటుంబానికి అండగా నిలవడం' అని మంత్రి అన్నారు. ఈ ఎగ్జిబిషన్ ద్వారా చేనేత కార్మికులకు మరిన్ని మార్కెటింగ్ అవకాశాలు లభించాలని, వారి శ్రమకు తగిన గౌరవం, ఆదాయం దక్కాలని, పోచంపల్లి చేనేత వైభవం ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రూ.30 వేల కోట్ల విలువైన భూమికి

## హైడ్రా రక్షణ కవచం

(మొదటి పేజీ తరువాయి)

హెచ్ఎండీఏకు కేటాయించిన ఈ భూమిలో అద్భుతమైన రాతి శిలలు, గుహలు, పచ్చని చెట్లు ఉన్నాయి. ఈ చారిత్రక సంపదను కాపాడాలంటూ 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు దశాబ్దాలుగా న్యాయపోరాటం చేస్తున్నారు. వారి పిటిన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, 2019లోనే ఈ రాతి గుట్టలతో పాటు ప్రభుత్వ భూమిని సంరక్షించాలని మున్సిపల్, రెవెన్యూ శాఖలను ఆదేశించింది. అయితే, హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడంలో జాప్యం జరగడంతో భూమి కబ్జాకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. దీంతో 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో పర్యటించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి సంయుక్తంగా సర్వే నిర్వహించి, భూమిని ప్రభుత్వ ఆస్తిగా నిర్ధారించుకున్నారు. అనంతరం శుక్రవారం పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు.

**హైడ్రాకు అభినందనలు:**

రెవెన్యూ రికార్డుల ప్రకారం.. సర్వే నంబర్ 452/1లో 174 ఎకరాలు, 454/1లో 119.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఓవర్ల్యాప్ సమస్యల కారణంగా 63.05 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా గుర్తించి, మిగిలిన భూమిలో దేవాలయాలకు 5 ఎకరాలు, దర్గాకు 5 ఎకరాలు కేటాయించగా, నికరంగా 200 ఎకరాల హెచ్ఎండీఏ భూమిని హైడ్రా కాపాడింది.ఈ ఆపరేషన్‌పై 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

సహజ సిద్ధమైన వ్యూ పాయింట్లు, చారిత్రక గుట్టలను కాపాడి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసినందుకు హైడ్రాను అభినందించారు. స్థానిక ప్రజలు, పర్యావరణ ప్రేమికులు సైతం ప్రభుత్వ చొరవను కొనియాడారు. ఇదే సమయంలో, ఈ గుట్టలను ఆనుకుని ఉన్న భగీరథమ్మ చెరువును కూడా హైడ్రా పునరుద్ధరిస్తోంది. ఒకవైపు ఎత్తైన కొండలు, మరోవైపు జలకళతో నిండిన చెరువుతో ఈ ప్రాంతంభవిష్యత్తులో ఒక అద్భుతమైన పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## 'గండిపేట' కేసులో బ్రహ్మానాయుడి అరెస్ట్

హైదరాబాద్,జూన్ 5(మనం,ప్రత్యేక ప్రతినిధి) : హైదరాబాద్ నగర పరిధిలోని గండిపేటలో రూ.1500 కోట్ల విలువచేసే ప్రభుత్వ భూములను కాజేసేందుకు నకిలీ జీవోలను సృష్టించిన కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు అరెస్టు అయ్యారు. గత కొన్ని రోజులుగా పరారీలో ఉన్న ఆయనను తమిళనాడు రాష్ట్రంలోని కాంచీపురంలో సైబరాబాద్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈక్రమంలో గండిపేటలోని తొమ్మిది ఎకరాల 28 గుంటల ప్రభుత్వ భూమిని కొట్టేసేందుకు బ్రహ్మానాయుడు తెరవెనుక మంత్రాంగం నడిపించినట్లుగా సైబరాబాద్ పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసింది. రంగారెడ్డి జిల్లాలోని గండిపేట గ్రామం సర్వే నెం.18లో ప్రభుత్వ భూమికి నకిలీ జీవోల తయారీ, భూ కబ్జా కోసం రూ.1.25 నగదు బదిలీలో బ్రహ్మానాయుడు కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు.

**మాజీ ఎమ్మెల్యే కీలక పాత్ర :**

గండిపేటలోని రూ. 1500 కోట్ల విలువ చేసే భూమిని కాజేసేందుకు కుట్ర పన్నిన కేసులో కీలక పాత్ర పోషించిన బ్రహ్మానాయుడు సహా మొత్తం 9 మందిపై కేసులు నమోదయ్యాయి. ఇటీవల సైబరాబాద్ పోలీసులు ఆంధ్రప్రదేశ్‌లోని నరసరావుపేటలో బ్రహ్మానాయుడు నివాసంలో సోదాలకు వెళ్లగా అక్కడా ఆయన అందుబాటులో లేరు. ఇతర నిందితులైన బొల్లా రమేష్, కొవ్వూరు సునీల్, మరో ఇద్దరు కూడా పరారీలో ఉన్నట్లుగా సమాచారం. తొలుత హైదరాబాద్, అనంతరం కేరళ, తమిళనాడు, కర్ణాటకాల్లోని పలు ప్రాంతాలకు నిందితులు వెళ్లినట్లుగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఎట్టకేలకు శుక్రవారం కాంచీపురంలో బ్రహ్మానాయుడును అరెస్టు చేశారు.

**బెయిల్ నిరాకరణ :**

భూ కబ్జా కేసులో బ్రహ్మానాయుడు అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించగా నిరాశే ఎదురైంది. న్యాయస్థానంలో బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురికావడంతో పోలీసులు ఆయన కోసం నిఘాను మరింత ముమ్మరం చేశారు.ఈక్రమంలోనే ఆయన తమిళనాడులోని కాంచీపురంలో తలదాచుకున్నట్లు పోలీసులకు ఖచ్చితమైన సమాచారం అందింది. దీంతో సైబరాబాద్ పోలీసులు అక్కడికి చేరుకుని ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం బ్రహ్మానాయుడును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కాంచీపురం నుండి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

## 'న్యాక్'కు జాతీయ అవార్డు

**అత్యుత్తమ నైపుణ్యాభివృద్ధి సేవలందించి గుర్తింపు పొందినందుకు మంత్రి కోమటి రెడ్డి అభినందలు**

హైదరాబాద్, జూన్ 5 : నిర్మాణ రంగంలో ఉత్తమ నైపుణ్యాభివృద్ధి చూపిన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ-న్యాక్)కు ప్లాటినం అవార్డు లభించింది. అలాగే ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ ఎం. శ్రీనివాస రెడ్డికి ఆర్ అండ్ బీలో ఉత్తమ ప్రదర్శనకు గానూ గోల్డ్అవార్డు లభించింది. గురువారం న్యూఢిల్లీ లో ఈ అవార్డులను అందజేశారు. ఇన్ ఫ్రాస్ట్రక్చర్ స్కిల్ డెవలప్మెంట్ అకాడమీ నిర్మాణ, మౌలిక సదుపాయాల రంగాల్లో నైపుణ్యాభివద్ధి, జ్ఞాన వ్యాప్తి కోసం కృషి చేస్తున్న సంస్థ న్యాక్.సామర్థ్య నిర్మాణం, ఆవిష్కరణ, సుస్థిరత, పరిశ్రమలో ఉత్తమతపై దృష్టి సారిస్తూ నిర్మాణ పరిశ్రమ నిపుణులు, విధాన నిర్ణేతలు, విద్యావేత్తలు మరియు యువ నిపుణులు కలిసి పనిచేయడానికి వేదికగా పనిచేస్తుంది. ప్రధాన వృత్తి శిక్షణ సంస్థగా తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివద్ధి శిక్షణలు,ఉద్యోగావకాశాల కల్పనను విజయవంతంగా నిర్వహిస్తోందీ సంస్థ.

తెలంగాణ రాష్ట్ర రోడు, భవనాల శాఖ వ, న్యాక్ ఉపాధ్యక్షులు కొమటిరెడ్డి వెంకట్ రెడి.. న్యాక్ డైరెక్టర్ జనరల్ ఎం. శ్రీనివాస రెడ్డిని, డైరెక్టర్లు, సిబ్బందిని ఈ సందర్భంగాఅభినందించారు.

## నీ పేరు కేసీఆర్ అయితే చర్చకు రా..

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల ముందున్నానని వ్యాఖ్యానించారు. కేసీఆర్ కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయిందనీ, ఇక ఏం చేసినా తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ నేతలను నమ్మరని స్పష్టం చేశారు. పాలమూరు నుంచి గెలిచి ఇక్కడి నుంచి పారిపోయిన కేసీఆర్ ద్రోహి అవుతారా ? లేక పాలమూరు అభివృద్ధి కోసం సీఎంగా కృషి చేస్తున్న తాను ద్రోహిని అవుతానా ? అనేది ప్రజలకు స్పష్టంగా తెలుస్తుందన్నారు. కేసీఆర్ తరువాత ఆయన కొడుకు, మనవడు రాజ్యమేలడానికి ప్రజలు పిచ్చోళ్లు కాదన్నారు. లాల్చి వేసుకున్నోడు లాల్ బహదూర్ శాస్త్రి కాదు, గడ్డం పెంచుకున్నోడు భగత్ సింగ్ కాదు, పంచలు కట్టుకుని ఉద్దండాపూర్‌కు వస్తే తొండలు విడిచి కొడతారని స్పష్టం చేశారు. పదేళ్లలో సాగునీటి ప్రాజెక్టుల పేరిట రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసిన కేసీఆర్ ఉద్దండాపూర్ ముంపు బాధితులకు కేవలం రూ.800 కోట్లు కూడా ఇవ్వకుండా జైల్లో పెట్టి కొట్టించారని ఆరోపించారు. అలాంటి బీఆర్ఎస్ నేతలు నోరు తెరిస్తే అబద్దాలు చెబుతున్నారనీ, పాలమూరులో ఇకపై బీఆరఎస్ జెండా ఎగరన్విబోమన్నారు. గద్దెలు కూలాలి, బీఆర్ఎస్ జెండాలు దిగాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన, కాంగ్రెస్ రెండేళ్ల పాలనపై తాము చర్చకు సిద్ధమనీ, నీ పేరు కేసీఆర్ అయితే, దమ్ముంటే చర్చకు రా అని కేసీఆర్‌కు బహిరంగ సవాల్ విసిరారు. చర్చలో ఓడిపోతే ఏం చేయడానికైనా తాను సిద్ధమేనన్నారు. బీఆర్ఎస్ నేతలు ఇళ్లు కట్టిన చోట ఓట్లు అడగాలనీ, తాను కూడా ఇందిరమ్మ ఇళ్లు కట్టిన చోట్ల ఓట్లు అడుగుతామన్నారు. తాడూ బొంగరం లేని ఇద్దరు నేతలను తమపైకి వదిలారనీ, వాళ్లతో చెప్పించుకునే స్థితిలో తము లేమని స్పష్టం చేశారు. 2034 వరకూ తమదే అధికారమనీ, కేసీఆర్‌కు చాతనైతే, తమ గెలుపును అడ్డుకోవాలని ఎవరి సత్తా ఏందో 2029 ఎన్నికల్లో తేల్చుకుందామని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి చాలెంజ్ విసిరారు.

## రద్దయిన వెయ్యి రూపాయల నోటు కేసీఆర్

హైదరాబాద్, జూన్ 5 (మనం బ్యూరో) : కేసీఆర్ రద్దయిన వెయ్యి రూపాయల లాంటి వారు. బీఆర్ఎస్ పార్టీకి, నేతలకు గతమే ఉంది. భవిష్యత్తు లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేస్తారనుకున్నాం. కృష్ణా జలాలు పూర్తిగా జిల్లాలో ప్రవహించినా ఎన్నడూ ఒడిసి పట్టుకోలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజైన శుక్రవారం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలను సందర్శించారు. అనంతరం కరివెన రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. ఉమ్మడి పాలమూరు జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులూ పెండింగ్‌లో ఉన్నాయనీ, ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ సైతం జరగలేదన్నారు. పంపులు లిఫ్ట్ పనుల్లో అవినీతిపై మాజీ మంత్రి నాగం జనార్ధన రెడ్డి ఏళ్ల తరబడి పోరాడారనీ జిల్లా నలుమూలలా తిరిగి ప్రాజెక్టు పనులను కొలిక్కి తెచ్చే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. మేం పనులు చేపడుతుంటే వాళ్లు రాజకీయ కార్యాచరణ చేస్తున్నారు. సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటనలు చేశా. పనులు పరిశీలించి భవిష్యత్తులో ఎలాంటి చర్యలు చేపట్టాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

పాలమూరు-రంగారెడ్డి పూర్తయితే 26 లక్షల ఎకరాలకు ఆయకట్టు వచ్చేది.రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి పంపులు, లిఫ్టులు పూర్తి చేశారు. ఈ పనులతో కేసీఆర్ ఇంట్లో కనక వర్షం కురిసింది. కమీషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ కూడా జరుగలేదు. కానీ, ప్రాజెక్టులు పూర్తయినట్టు కేసీఆర్ ఎలా భావించారని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల కోసం రూ.22 వేల కోట్లు ఖర్చు చేసిందనీ, వీటిలో రూ.8 వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఇచ్చామని స్పష్టం చేశారు.

ఈ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కావాలంటే 4 వేల ఎకరాల భూ సేకరణ జరగాలి. భూ సేకరణ, ఆర్అండ్ఆర్ చేయకుండా రిజర్వాయర్లలో నీళ్లు నింపగలమా? రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని కంకణం కట్టుకుని ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు. గతంలో విపరీతంగా అప్పులు తేవడం వల్ల ఇప్పుడు ప్రాజెక్టులకు అప్పులు తెచ్చుకోలేని పరిస్థితి వచ్చిందనీ, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.55 వేల కోట్లు అంచనా వేసి రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామనీ, భూ సేకరణకు రూపాయి ఎక్కువ ఇచ్చి అయినా సమస్యలు పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జిల్లాలో ప్రాజెక్టుల పూరికి సంపూర్ణంగా కట్టుబడి ఉన్నామనీ, తక్కువ భూ సేకరణతో ఎక్కువ నీటిని నిల్వ చేసుకునే ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రాజెక్టు పనులకు అడ్డుపడొద్దని బీఆర్ఎస్ నేతలను కోరుతున్నాననీ, ఆ పార్టీ నేతల వ్యాఖ్యలకు పైసా విలువ లేదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ప్రాజెక్టయినా మొదలు పెట్టి పూర్తి చేసిందా చెప్పాలి. ప్రాణహిత-చేవెళ్ల పేరు, ఊరు మార్చి దోపిడీ చేయడమే కేసీఆర్‌కు తెలుసు. కాళేశ్వరం కూలిన తరువాత చుక్క నీటిని తీసుకోకుండా ఎక్కువ వరి ఉత్పత్తి చేశామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ప్రమాదంలో పడ్డ మన జల హక్కులు

**పొరుగు రాష్ట్రం ఏపీ.. 74 శాతం నీటిని వినియోగం**

**25 శాతానికి పరిమితమైన తెలంగాణ తెలంగాణ**

**సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ**

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ జల హక్కులు తీవ్ర ప్రమాదంలో పడ్డాయని ఆయన తన లేఖలో ప్రస్తావించారు. ఎత్తిపోతల పంపుల నిర్వహణ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. దీంతో పంపులు దెబ్బతిని, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చోటుచేసుకుందని హరీశ్ తెలిపారు. తెలంగాణ జల హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆయన ఆరోపించారు. కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయిందన్నారు. అయితే, పొరుగు రాష్ట్రం ఏపీ 74 శాతం నీటిని వినియోగిస్తుంటే.. తెలంగాణ 25 శాతానికి పరిమితమైందని ఆయన తన లేఖలో తెలిపారు. దీంతో రైతులు, తాగునీటి అవసరాలు, పరిశ్రమల భవిష్యత్తును..ఈ దుష్ట కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాదంలో పడేసిందని హరీశ్‌రావు తనదైన శైలిలో విమర్శించారు. సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలు సాగునీటి రంగానికి ముప్పుగా మారాయని లేఖలో స్పష్టం చేశారు. అందుకే రైతు డిస్కం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణకు తగిన నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి రాసిన లేఖలో డిమాండ్ చేశారు. ఏపీ మన వాటా నీటిని కూడా వాడుకుంటుంటే మీరు గుడ్డెద్దు చేలో పడ్డట్లుగా కాకుండా?... తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయకుండా జల హక్కులను సమర్థంగా కాపాడాలని హరీశ్ రావు లేఖలో సూచించారు.

## లబ్ధిదారుల ఖాతాలోకే పింఛను పైసల్

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ ప్రభుత్వం చేయూత పెన్షన్ల పంపిణీ విధానంలో కీలక సంస్కరణలు చేపట్టింది. ఇకపై లబ్ధిదారులకు నగదు రూపంలో కాకుండా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే పింఛను సొమ్మును జమ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీనివల్ల వృద్ధులు, దివ్యాంగులు పోస్టాఫీసుల వద్ద క్యూ కట్టే శ్రమ తప్పుతుంది. ప్రస్తుతం లైవ్ అథెంటికేషన్ ప్రక్రియ జరుగుతుండగా.. జూన్ చివరి నాటికి దీన్ని పూర్తి చేసి ఆగస్టు నెల నుంచి పెన్షన్ డబ్బులను నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేయనున్నారు. తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్ల పంపిణీ వ్యవస్థలో కీలక మార్పులకు సిద్ధమైంది. పెన్షన్ల పంపిణీలో జరుగుతున్న అక్రమాలను పూర్తిగా అరికట్టేందుకు ఇకపై నగదు రూపంలో ఇచ్చే విధానానికి స్వస్తి పలకాలని నిర్ణయించింది. లబ్ధిదారులందరికీ వంద శాతం పారదర్శకంగా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే పెన్షన్ మొత్తాలను జమ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ బాధితులతో పాటు ఇతర కేటగిరీలకు చెందిన దాదాపు 42 లక్షల మంది లబ్ధిదారులు చేయూత పెన్షన్లు పొందుతున్నారు. అయితే.. వీరిలో ప్రస్తుతం సగం మందికి మాత్రమే నేరుగా బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయి. మిగిలిన దివ్యాంగులు, వృద్ధులకు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో బిల్ కలెక్టర్లు నగదు రూపంలో చేతికి ఇస్తున్నారు. మరికొందరికి ప్రతి నెలా తపాలా పోస్టల్ ఖాతాల ద్వారా సొమ్ము చెల్లిస్తున్నారు.



## బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలె

(మొదటి పేజీ తరువాయి)

కూడా పూర్తి పారదర్శకతతో జీవో నం.38 ప్రకారం బదిలీలు చేపట్టాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీంతో మంత్రి దామోదర జీవో నం.38 ద్వారా వైద్యారోగ్య శాఖలో బదిలీల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో శనివారం నుంచి ప్రభుత్వ ఆసుపత్రులలో ఓపీ సేవలు యథావిధిగా కొనసాగుతాయని వైద్యుల సంఘాలు స్పష్టం చేశాయి.

## విపత్తుల నివారణకు సంసిద్ధంగా ఉండాలె

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆదాయ వనరులని పూర్తిగా వినియోగించాలని అధికారులకు సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో తెలంగాణ విపత్తుల నిర్వహణ శాఖ, అగ్నిమాపక శాఖ, హైడ్రా, బెటాలియన్స్, పంచాయత్ రాజ్ శాఖ, నీటిపారుదల శాఖ, రోడ్లు మరియు భవనాల శాఖల తరపున అధికారులు పాల్గొన్నారు.



## గాదె ఇన్నయ్యకు మధ్యంతర బెయిల్

హైదరాబాద్,జూన్ 5(మనం,ప్రత్యేక ప్రతినిధి): తెలంగాణ ప్రజా ఫ్రంట్ ప్రతిప్రతినిధి, హక్కుల నాయకుడు గాదె ఇన్నయ్య కోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు నాంపల్లి కోర్టు షరతులతో కూడిన 2 నెలల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కోర్టు ఉత్తర్వుల అనంతరం శుక్రవారం ఆయన చంచల్‌గూడ జైలు నుండి బెయిల్‌పై విడుదలయ్యారు. గత కొంతకాలంగా ఎన్ఐఏ కేసులో రిమాండ్ ఖైదీగా జైల్లో ఉన్న గాదె ఇన్నయ్య.. తన వ్యక్తిగత, ఆరోగ్య కారణాల దృష్ట్యా మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, ఆయనకు 2 నెలల పాటు తాత్కాలికంగా మధ్యంతర బెయిల్ ఇస్తూ నిర్ణయం తీసుకుంది. బెయిల్ గడువు ముగిసిన తర్వాత తిరిగి కోర్టు ముందు, జైలు అధికారుల వద్ద లొంగిపోవాలని న్యాయమూర్తి ఆదేశించారు.

## మాజీ మావోయిస్టు దేవ్‌జీని కలిసిన కవిత

హైదరాబాద్,జూన్ 5(మనం,ప్రత్యేక ప్రతినిధి): మావోయిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత కలిశారు. ఈ నేపథ్యంలో గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న దేవ్ జీని శుక్రవారం కవిత కలిసి పరామర్శించారు. ప్రస్తుతం దేవ్ జీ కొంపల్లిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న కవిత అక్కడికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దేవ్ జీకి అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులతో చర్చించారు. దేవ్ జీకి మెరుగైన వైద్యం అందించాలని, ఆయన త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులను కోరారు. అనంతరం దేవ్ జీ కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ 40 ఏళ్ల అజ్ఞాత జీవితానికి స్వస్తి పలికి పోలీసుల ఎదుట లొంగిపోయిన విషయం తెలిసిందే.



**అమీర్‌పేట్ బాధితులకు :**

నగరంలోని అమీర్ పేట్ ఫైర్ యాక్సిడెంట్ బాధితులను కవిత పరామర్శించారు. అగ్ని ప్రమాదంలో జరిగిన నష్టంపై వ్యాపారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఫైర్ యాక్సిడెంట్ లో నష్టపోయినవారికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిహారాన్ని సరిగ్గా అంచనావేసి అందించాలని చెప్పారు. ఫైర్ యాక్సిడెంట్ జరిగిన గంటన్నర తరువాత ఫైర్ డిపార్ట్ మెంట్ వస్తే ప్రమాదాలను ఎలా ఆపగలుగుతామని ప్రశ్నించారు. ఇలాంటి ప్రమాదాలు ఏ క్షణం అయినా జరగవచ్చని, వర్కర్స్ ఉన్నప్పుడు రాత్రి సమయంలో ప్రమాదం జరిగితే పరిస్థితి తీవ్రంగా ఉంటుందన్నారు. కాబట్టి ప్రభుత్వం ముందుగానే ఇలాంటి భవనాలను ముందుగానే తనిఖీ చేయాలని చెప్పారు.

## గాంధీలో ముగ్గురు ఎబోలా అనుమానితులు

### ఒకే విమానంలో వచ్చిన ముగ్గురికి ఐసొలేషన్

హైదరాబాద్,జూన్ 5(మనం న్యూస్)ః భాగ్యనగరంలో ఎబోలా వైరస్ కలకలం రేపుతోంది. ఎబోలా తరహా లక్షణాలతో ముగ్గురు వ్యక్తులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేరడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామంతో అప్రమత్తమైన తెలంగాణ ఆరోగ్య శాఖాధికారులు, బాధితులను ప్రత్యేక ఐసోలేషన్ వార్డుకు తరలించి వైద్యుల నిరంతర పర్యవే క్షణలో ఉంచారు. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం ఉదయం ఎబోలా ప్రాథమిక లక్షణాలతో ఇద్దరు వ్యక్తులు జూబ్లీహిల్స్ లోని అపోలో ఆసుపత్రిని ఆశ్రయించారు. పరిస్థితిని గమనించినవైద్యులు వారిని తక్షణమే గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. దీంతో గాంధీలో చేరిన ఎబోలా అనుమానితుల సంఖ్య మూడుకు చేరుకుంది. ప్రాథమిక దర్యాప్తులో ఈ ముగ్గురు ఒకే అంతర్జాతీయ విమానంలో హైదరాబాద్‌కు చేరుకున్నట్లు వెల్లడి కావడంతో, సదరు విమానంలో ప్రయాణించిన ఇతర ప్రయాణికుల వివరాలనుసే కరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

**ఆందోళన వద్దుః**

కాగా, అంతకుముందు గురువారం నాడు సూడాన్ నుంచి ఇథియోపియా మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న 30 ఏళ్ల వ్యక్తిని విమానాశ్రయ వైద్య బృందం గుర్తించింది. థర్మల్ స్క్రీనింగ్‌లో అతనికి 100 డిగ్రీల జ్వరం ఉన్నట్లు తేలింది. ఇటీవల ఎబోలా ప్రభావిత దేశాలైన ఉగాండా, దక్షిణ సూడాన్‌లలో అతడు పర్యటించినట్లు సమాచారం అందడంతో, అధికారులు ముందుజాగ్రత్తగా అతడిని గాంధీ ఆసుపత్రిలోని ఐసోలేషన్ వార్డుకు తరలించారు.ప్రస్తుతం ఆ ముగ్గురి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఎబోలా తీవ్రతను సూచించే రక్తస్రావం, వాంతులు వంటి లక్షణాలు ప్రస్తుతానికి ఎవరిలోనూ కనిపించడం లేదని వైద్యులు స్పష్టం చేశారు. బాధితుల నుంచి సేకరించిన నమూనాలను తుది నిర్ధారణ పరీక్షల నిమిత్తం పూణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆరోగ్య శాఖాధికారులు భరోసా ఇచ్చారు. పూణె నుంచి వచ్చే నివేదికల ఆధారంగా తదుపరి కార్యాచరణ ఉంటుందని వారు వెల్లడించారు.

## పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించాలి: డీజీపీ సీవీ ఆనంద్



హైదరాబాద్,జూన్ 5(మనం,ప్రత్యేక ప్రతినిధి) ః తెలంగాణ స్టేట్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలను త్వరితగతిన నిర్వహించాలని డీజీపీ సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు. అసోసియేషన్ ప్రతినిధులు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక కావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.పోలీస్ సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారంలో అసోసియేషన్ కీలక పాత్ర పోషిస్తుందని, అందువల్ల ఎన్నికలు త్వరగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర అధ్యక్షుడు వై. గోపిరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం డీజీపీని కలిసి వినతిపత్రం అందజేసింది. పలు పరిపాలనా, సాంకేతిక కారణాలతో ఎన్నికలు వాయిదా పడిన విషయాన్ని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు.విషయాన్ని పరిశీలించిన డీజీపీ ఎన్నికల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ప్రాంతాల మధ్య చిచ్చు.. మీకు న్యాయమేనా?

### అమెరికాలో 14న జరిగే తన సభకు పవన్‌ను ఆహ్వానించిన కేఏ పాల్

హైదరాబాద్, మనం ప్రతినిధి : జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇటీవల తెలంగాణలో చేసిన వ్యాఖ్యలు సంచలనం రేకెత్తించిన సంగతి తెలిసిందే. పవన్ వ్యాఖ్యలపై ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'పవన్ కల్యాణ్ ఇలా ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడం న్యాయమేనా?' అని పాల్ ప్రశ్నించారు.
ప్రజలు తమకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చమని నిలదీస్తుంటే.. వాటిని పక్కనపెట్టి, ఈ గొడవలు ఎందుకంటూ పాల్ మండిపడ్డారు. అలాగే జూన్ 14న అమెరికాలోని హ్యూస్టన్‌లో తాను నిర్వహించబోయే భారీ సభకు రావాలంటూ పవన్‌ను ఆయన ఆహ్వానించారు.

## 'ఫోన్ ట్యాపింగ్'లో సిట్ దూకుడు

### నేడు సిట్ విచారణకు ఎంపీ చామల

హైదరాబాద్,జూన్ 5(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తును ప్రత్యేక విచారణ బృందం (సిట్) వేగవంతం చేసింది. ఈ క్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సిట్ అధికారుల ఎదుట హాజరుకానున్నారు. ఈక్రమంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం ఉదయం 11 గంటలకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు రావాలని పోలీసులు ఆయనకు సమాచారం ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ పార్టీ నేతల ఫోన్లు ట్యాప్ అయినట్లు సిట్ గుర్తించిన నేపథ్యంలో, చామల కిరణ్ కుమార్ రెడ్డి ఫోన్ కూడా ట్యాప్ అయినట్లు అధికారులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేయడానికి సిట్ అధికారులు సన్నద్ధమయ్యారు. కాగా గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించిన చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనంతరం జరిగిన 2024 లోక్సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి ఎంపీగా విజయం సాధించిన విషయం విదితమే. ఇటీవల ఫోన్ ట్యాపింగ్ కేసులో దూకుడు పెంచిన సిట్ ఈనెల చివరి వారంలో ఛార్జిషీట్ దాఖలు చేసేందుకు దర్యాప్తు వేగవంతం చేస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటికే వందలాది మంది బాధితుల వాంగ్మూలాలను సిట్ తదుపరి చర్యలను ముమ్మరం చేస్తోంది.

## మలేషియాలో కేటీఆర్‌కు ఘన స్వాగతం



హైదరాబాద్, జూన్ 5 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. కుటుంబ సమేతంగా మలేషియా రాజధాని కౌలాలంపూర్ చేరుకున్నారు. మలేషియా తెలంగాణ అసోసియేషన్ (మైటా), బీఆర్ఎస్ మలేషియా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 6న కౌలాలంపూర్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో పాల్గొనేందుకు కేటీఆర్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడికి విచ్చేశారు. నేడు.. జరగబోయే ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు, విజయవంతం చేసేందుకు మైటా, బీఆర్ఎస్ మలేషియా కమిటీలు ఇప్పటికే అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశాయి.

అంతకుముందు.. కౌలాలంపూర్ విమానాశ్రయానికి చేరుకున్న కేటీఆర్ దంపతులకు వారి కుటుంబ సభ్యులకు ప్రవాస తెలంగాణ ప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. స్వాగతం పలికిన వారిలో తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిశోర్ కుమార్, మైటా అధ్యక్షుడు తిరుపతి, బీఆర్ఎస్ మలేషియా అధ్యక్షుడు మారుతితో పాటు ఇతర ముఖ్య నేతలు, ఎన్నారైలు ఉన్నారు.

## క్రీడల్లో విజేతలకు డీజీపీ అభినందనలు



హైదరాబాద్,జూన్ 5(మనం, ప్రత్యేక ప్రతినిధి)ః జాతీయ స్థాయిలో అద్భుత ప్రదర్శన కనబరిచి పతకాలు సాధించిన పోలీసు క్రీడాకారులను డీజీపీ సి.వి. ఆనంద్ తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ హర్యానాలోని మధుబన్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక 3వ ఆల్ ఇండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్, యోగా) 2026-27 జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్రానికి మూడు పతకాలు దక్కాయన్నారు. గత నెల 23 నుండి 27 వరకు జరిగిన ఈ పోటీల్లో తెలంగాణ పోలీస్ జట్టు ఒక రజత, రెండు కాంస్య పతకాలను కైవసం చేసుకుందన్నారను. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూనే జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి కీర్తి తీసుకురావడం గర్వకారణ మని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని క్రీడాకారులను ప్రోత్సహించారు.

**పవర్ లిఫ్టింగ్‌లో :**

మహిళల పవర్ లిఫ్టింగ్‌లో 84 కేజీల విభాగంలో సీసీఎస్, మల్కాజిగిరి కమిషనరేట్‌కు చెందిన డబ్ల్యూపీసీ ఎస్. రేణుక రజత పతకం సాధించారు. ఆమె మొత్తం 367.5 కిలోల బరువును ఎత్తి ఈ ఘనత సాధించారు. ఇందులో స్క్వాట్‌లో 152.5 కిలోలు, బెంచ్ ప్రెస్లో 75 కిలోలు, డెడ్ లిఫ్ట్లో 140 కిలోల బరువును ఎత్తారు.పురుషుల పవర్ లిఫ్టింగ్ 59 కేజీల విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం ఓఎస్డీకి చెందిన ఏఆర్పీసీ ఎమ్. వంశీ కాంస్య పతకం సాధించారు. ఈయన మొత్తం 407.5 కిలోల బరువును ఎత్తి జాతీయ స్థాయిలో తన ప్రతిభను చాటారు.

**యోగాలో :**

మహిళల ఆర్టిస్టిక్ పెయిర్ యోగా ఈవెంట్‌లో తెలంగాణ మహిళా జట్టు సమిష్టి ప్రతిభతో కాంస్య పతకాన్ని సాధించింది. ఈ జట్టులో ఈగిల్ ఫోర్స్ హైదరాబాద్‌కు చెందిన డీఎస్పీ టి. లక్ష్మి, భద్రాచలంకు చెందిన బి. రత్నకుమారి, మహబూబాబాద్ షీ టీమ్స్‌కు చెందిన బి. సౌభాగ్య, రామగుండం కమాన్పూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కె. శ్రీలత, ఇల్లందు పోలీస్ స్టేషన్‌కు చెందిన కె. రాణి సభ్యులుగా ఉన్నారు.ఈ సందర్భంగా క్రీడాకారుల విజయాలకు వెనుక నిలిచిన వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ కోచ్ రాము, అలాగే ఏఆర్ఎస్ఐ టి. రమేష్ సేవలను డీజీపీ ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే దిశగా మరింత కృషి చేయాలని సూచించారు. కార్యాక్రమంలో ఐజీపీ స్పోర్ట్స్ డాక్టర్ గజారావు భూపాల్, స్పోర్ట్స్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.వి. రామారావు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ యువతకు ఉపాధికి కొత్త దారులు చూపుతున్న ఏటీసీలు

- మంత్రి వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్, జూన్ 6: ప్రపంచ ఉద్యోగ రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా తెలంగాణ యువతను సిద్ధం చేసేందుకే ప్రభుత్వం ఐటీఐలను అత్యాధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీలు) తీర్చిదిద్దిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ కేంద్రాలు కేవలం శిక్షణా సంస్థలుగానే కాకుండా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు మరియు అంతర్జాతీయ కెరీర్లకు ద్వారాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. మల్లేపల్లి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ను మీడియా ప్రతినిధులతో కలిసి సందర్శించిన అనంతరం మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ట్రైనర్లు ఏటీసీల్లో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, ఆధునిక యంత్రాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను ప్రదర్శించారు.

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్) భాగస్వామ్యంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీలు) ఏర్పాటుకు సుమారు రూ.4,000 కోట్ల విలువైన అత్యాధునిక సాంకేతిక మౌలిక సదుపాయాలు, శిక్షణా వనరులను సమకూర్చింది. ఏటీసీలను యువతకు లభించిన సువర్ణావకాశంగా అభివర్ణించిన మంత్రి, అందుబాటులో ఉన్న సదుపాయాలను పూర్తిగా వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. నైపుణ్యవంతమైన మానవ వనరులను తీర్చిదిద్దడంలో ఏటీసీలు కీలక పాత్ర పోషిస్తాయని, తెలంగాణను దేశంలో ప్రముఖ నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా నిలబెట్టడంలో ఇవి మైలురాయిగా మారతాయని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఉచితానికి ఎంఎంటీఎస్ నో

### మహాలక్ష్మి తరహాలో..లోకల్ రైళ్లలో ఉచిత పథకం వీలుకాదని స్పష్టం చేసిన రైల్వే శాఖ

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదించిన మహాలక్ష్మి పథకం తరహాలోనే.. హైదరాబాద్ మహానగర పరిధిలోని లోకల్ రైళ్లలోనూ ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలనే ప్రతిపాదనకు కేంద్ర రైల్వే బోర్డు గట్టి షాక్ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని పరిశీలించిన బోర్డు.. ప్రస్తుతానికి దీనిని అమలు చేయలేమంటూ తిరస్కరించింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనను తోసిపుచ్చుతూ రైల్వే శాఖ తన నిర్ణయాన్ని స్పష్టం చేయడంతో నగర ప్రయాణికులకు నిరాశే మిగిలింది. ఈ ఉచిత ప్రయాణ ప్రతిపాదనను తిరస్కరించడానికి రైల్వే బోర్డు ప్రధానంగా ఎంఎంటీఎస్ నడుస్తున్న తీరు, దానికి వస్తున్న నష్టాలను ప్రధాన కారణంగా చూపింది. హైదరాబాద్ లోకల్ రైళ్ల నిర్వహణ వల్ల ఏటా దాదాపు రూ. 160 కోట్ల మేర వార్షిక నష్టాలు వస్తున్నాయని బోర్డు వెల్లడించింది. ఇప్పటికే భారీ నష్టాల్లో నడుస్తున్న ఈ సబర్బన్ రైల్వే వ్యవస్థపై ఉచిత ప్రయాణాల భారం వేస్తే ఆర్థికంగా మరింత కుంగిపోతుందని, నిర్వహణ కూడా కష్టతరంగా మారుతుందని రైల్వే అధికారులు అభిప్రాయపడ్డారు. కేవలం నష్టాలు మాత్రమే కాకుండా.. గత కొంతకాలంగా తెలంగాణ ప్రభుత్వం నుండి రైల్వే శాఖకు రావాల్సిన పాత బకాయిల అంశాన్ని కూడా ఈ సందర్భంగా బోర్డు గట్టిగా ప్రస్తావించింది. ఎంఎంటీఎస్ ఫేజ్-2 ప్రాజెక్ట్ వ్యయ భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నుండి దాదాపు రూ. 490 కోట్ల నిధులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని రైల్వే బోర్డు గుర్తుచేసింది. గతంలో ఇవ్వాల్సిన పాత బకాయిలే ఇంకా చెల్లించకుండా, మళ్లీ ఉచిత ప్రయాణాల భారాన్ని రైల్వేపై నెట్టడం సరికాదని బోర్డు తన లేఖలో స్పష్టం చేసింది. అయితే, ఈ ఉచిత ప్రయాణ పథకం అమలు కావడానికి రైల్వే బోర్డు ఒక స్పష్టమైన నిబంధనను రాష్ట్ర ప్రభుత్వం ముందుంచింది. ఈ ఉచిత ప్రయాణాల వల్ల రైల్వే శాఖపై పడే పూర్తి ఆర్థిక భారాన్ని భరించడానికి తెలంగాణ ప్రభుత్వం అంగీకరిస్తేనే?.., ఈ ప్రతిపాదనను తాము పునఃసమీక్షించే అవకాశం ఉంటుందని తేల్చిచెప్పింది. అంటే, ఉచిత ప్రయాణ టికెట్ల సొమ్మును సకాలంలో రాష్ట్ర ప్రభుత్వమే రైల్వేకు రీఅంబర్స్ చేయాల్సి ఉంటుంది. మరి దీనిపై నిధుల కొరతతో ఉన్న తెలంగాణ సర్కార్ ఎలా స్పందిస్తుందో?, బకాయిల క్లియరెన్స్‌పై ఎలాంటి అడుగులు వేస్తుందో వేచి చూడాలి మరి.

## సర్జికల్స్ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

### ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేరుకుపోయిన రూ.128 కోట్ల బిల్లులు

### మంత్రి దామోదరకు ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, జూన్ 05(మనం బ్యూరో): 2022 నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెండింగ్‌లో ఉన్న సర్జికల్ బిల్స్‌ను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర నరసింహకు ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్ విజ్ఞపి చేసింది. ఈమేరకు అసోసియేషన్ మంత్రి దామోదరకు చేసిన విజ్ఞప్తిలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సర్జికల్స్, డ్రగ్స్‌కు ప్రస్తుతం నెలకు ఉన్న బడ్జెట్‌ను రూ.50 కోట్ల నుంచి 100 కోట్లకు పెంచినట్లు తెలిసిందనీ, కానీ, దురదృష్టవశాత్తు టీజీఎంఎస్ఐడీసీ మెడిసిన్స్, ఆక్సిజన్ కోసం కేవలం 2026 మే నెలకు సంబంధించి రూ.50 కోట్లు మాత్రమే విడుదల చేసిందని పేర్కొన్నారు.

అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా చేసిన సర్జికల్, డయాగ్నస్టిక్స్‌కు సంబంధించి 2022 నుంచి 2024 వరకు తమకు ఎలాంటి బిల్లులు విడుదల చేయలేదనీ, అలాగే, ఎనిమిది త్రైమాసికాలకు సంబంధించి కేవలం మూడు త్రైమాసికాలకు సంబంధించిన బిల్లులను మాత్రమే ప్రభుత్వం విడుదల చేయడం విచారకరమన్నారు. ప్రభుత్వం టీజీఎంఎస్ఐడీసీ ద్వారా ఇప్పటి వరకు తమకు మొత్తంగా రూ.128 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉందనీ, వీటిలో గాంధీ ఆసుపత్రిలో రూ.7 కోట్లు, నీలోఫర్ ఆసుపత్రిలో రూ.7 కోట్లు, ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో రూ.4.5 కోట్లు, పేట్లబురుజు మెటర్నిటీ హాస్పిటల్, ఈఎన్‌టీ హాస్పిటల్ కు రూ.1.5 కోట్లు, సరోజిని ఐ హాస్పిటల్‌కు రూ.1.25 కోట్లు, అలాగే, ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించి ఉస్మానియా హాస్పిటల్ నుంచి రూ.18 కోట్లు, గాంధీ ఆసుపత్రి నుంచి రూ.9 కోట్లు, నీలోఫర్ హాస్పిటల్ నుంచి రూ.5 కోట్ల బకాయిలు తాము సరఫరా చేసిన సర్జికల్స్‌కు సంబంధించిన బిల్లులు తమకు రావాల్సి ఉందని స్పష్టం చేశారు.అంతేకాకండా గాంధీ, ఉస్మానియా హాస్పిటల్స్‌కు ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జికల్ డిస్పోజబుల్స్ కూడా సరఫరా చేస్తున్నామనీ, దేశంలోనే తొలిసారిగా ఈ ఆసుపత్రుల్లో బోవెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగిందని గుర్తు చేశారు. అలాగే, సీఎంవో నుంచి ఆయా హాస్పిటల్స్ లెటర్ ఆఫ్ క్రెడిట్స్ పొందుతున్నాయనీ, కానీ తాము మాత్రం గత ఏడాదిన్నర ఎలాంటి బిల్లులు పొందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ పరిస్థితుల దృష్ట్యా గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సర్జికల్స్ బిల్లులను వెంటనే విడుదల చేసి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని ఈ మేరకు ట్విన్ సిటీస్ సప్లయర్స్ అసోసియేషన్ మంత్రి దామోదరకు విజ్ఞప్తి చేసింది.

## రాష్ట్రంలో హీరోషిమా బృందం పర్యటన

- తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్‌ను సందర్శించిన ప్రతినిధుల బృందం
- స్వాగతం పలికిన శాసన మండలి ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్



హైదరాబాద్, మనం ప్రతినిధి : జపాన్ దేశం హీరోషిమా రాష్ట్రానికి చెందిన ప్రతినిధుల బృందం తెలంగాణ శాసన మండలి, శాసన సభను సందర్శించారు. ఈ సందర్భంగా శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్ వారికి స్వాగతం పలికారు. మండలి ఛైర్మన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని వివరించారు. తెలంగాణ రాజధాని నగరంలో అన్ని దేశాలకు చెందిన ప్రజలు జీవిస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి విప్‌లు అద్దంకి దయాకర్, వెంకట నర్సింగరావు, ఎమ్మెల్సీలు దాసోజు శ్రావణ్, అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు టి రామ్మోహన్ రెడ్డి, పాల్వాయి హరీష్, శాసన మండలి సెక్రెటరీ డా. నర్సింహాచార్యులు, శాసన సభ సెక్రెటరీ ఆర్. తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## కొడుకు ముందే భార్యను కత్తితో పొడిచి చంపిన భర్త

- హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో ఘాతుకం

హైదరాబాద్, జూన్ 5 : భార్యాభర్తలు కొన్ని రోజులుగా తరచూ గొడపడుతున్నారు. గురువారం రాత్రి కూడా వారి మధ్య వాగ్వాదం ప్రారంభమైంది. అర్ధరాత్రి దాటినా గొడవ ఆగలేదు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో వాగ్వాదం తీవ్ర రూపం దాల్చింది. పడుకున్నట్టు నటించిన తండ్రి.. తన పిల్లల ముందే కత్తి పట్టుకొని తల్లిని పొడవడం ప్రారంభించాడు. తొమ్మిదేళ్ల కుమారుడు నాన్నా అమ్మను చంపొద్దంటూ ఏడుస్తూ తండ్రిని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. కానీ, కసాయి తండ్రి బాలుడి మాట వినలేదు. విచక్షణ రహితంగా పొడిచి హత్య చేశారు. ఈ హృదయ విదారక ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తేజస్వీనిగర్లో చోటు చేసుకుంది.అత్తాపూర్ ఎస్సై పార్వతి, ప్రత్యక్షంగా చూసిన బాలుడు చెప్పిన వివరాల మేరకు.. నాందేడ్కు చెందిన కోమలి(31), అవినాష్ దంపతులు. వారికి 8, 9 సంవత్సరాల వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆరు నెలల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన ఈ కుటుంబం.. అత్తాపూర్ తేజస్వినినగర్లోని ఓ అపార్ట్మెంట్లో పనికి కుదిరారు. కోమలి కాపలాదారుగా ఉంటూ పలువురి ఇళ్లల్లో పనిచేస్తోంది. అవినాష్ ఆటోడ్రైవర్గా పని చేస్తున్నాడు. కోమలి ఇళ్లల్లో పనిచేస్తూ పలుమార్లు ఆలస్యంగా రావడంతో అవినాష్కు ఆమెపై అనుమానం పెరిగింది. కొన్ని రోజులుగా భార్యాభర్తలు తరచూ గొడవ పడుతున్నారు. గురువారం రాత్రి మద్యం తాగి వచ్చిన అవినాష్.. భార్యతో గొడవకు దిగాడు. శుక్రవారం తెల్లవారుజాము వరకు గొడవ జరగడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన భర్త.. భార్యపై కత్తితో దాడికి దిగాడు. మొదట ముఖంపై పొడవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన పెద్ద కుమారుడు.. అమ్మని చంపొద్దని తండ్రిని వేడుకున్నాడు. అదే సమయంలో కోమలి అరుస్తూ బయటకు పరిగెత్తింది. వెంటపడ్డ అవినాష్.. అప్పటికే కత్తి జారిపోవడంతో చేతికి అందిన స్క్రూడైవర్తో కడుపులో పొడిచాడు. పక్కన ఉన్న ఓ రాడ్డు తీసుకుని మరోసారి గట్టిగా తలపై మోదాడు. కుమారులు ఇద్దరూ ఏడుస్తూనే కొట్టొద్దని వేడుకున్నారు. అయినా తండ్రి కనికరించలేదు. వీరి అరుపులకు అపార్ట్మెంట్ వాసులు బయటకు రావడంతో అవినాష్ అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు అంబులెన్స్, పోలీసులకు సమాచారం అందించారు. ఆసుపత్రికి తీసుకెళ్లిన కొద్దిసేపటికే కోమలి మృతి చెందింది.

మనం Manam



# ప్రజాకవి సుద్దాల హనుమంతు



కవిగా, కళాకారుడిగా, అంతకుమించి క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టుగా జీవితమంతా కష్టజీవుల కోసం, కమ్యూనిస్టు ఉద్యమం కోసం అంకితం చేసిన వ్యక్తి. తెలంగాణ జాతిని తన కవితలతో మేల్కొలిపిన మహా కవి సుద్దాల హనుమంతు.

సుద్దాల హనుమంతు ఇంటి పేరు గుర్రం. అయితే 'సుద్దాల' గ్రామంలో స్థిరపడడం చేత ఆ ఊరిపేరే ఇంటి పేరుగా స్థిరపడి పోయింది. సుద్దాల హనుమంతు నేటి యాదాద్రి భువనగిరి జిల్లా పాలడుగు గ్రామంలో 1910 జూన్ 6న పుట్టాడు. తండ్రి బుచ్చిరాములు. తల్లి లక్ష్మీ నరసమ్మ, బుచ్చిరాములు ఆయుర్వేద వైద్యుడు, గొప్ప కళాకారుడు. ఆయన అన్నదమ్ములు కూడా కళాకారులే. వారందరూ సుదీర్ఘకాలం పాటు వీధినాటకాలు ప్రదర్శించారు. హనుమంతు తాతగారు కూడా కళాకారుడే. ఆయన హరికథలు చెప్పేవాడు. బహుశ ఆ సాంస్కృతిక కళాప్రదర్శన వారసత్వంగా హనుమంతుకు జన్మతః లభించినట్లుంది. సాయుధ పోరాట కాలంలో బుర్రకథ, గొల్లసుద్దులు, పిట్టలదొర, యక్షగానం వంటి జానపద కళారూపాల ప్రదర్శన ద్వారా ప్రజలను చైతన్య పరచి పోరాటానికి సిద్ధపరచేవాడు. సుద్దాల హనుమంతు బుర్రకథ చెబితే గడ్డిపోచ కూడా యుద్ధానికి సై అంటుందని జన ప్రచారంలో బలంగా వినిపించేది.

హనుమంతుకు చిన్నప్పటి నుండి బాగా చదువుకోవాలనే కోరిక ఉండేది. కానీ బడిలో చేరాడు. కాని అక్కడి శిక్షలకు భయపడి బడి మానేశాడు. ఆదర్శవాది, మానవతామూర్తి అయిన ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుని కారణంగా మళ్ళీ బడిలో చేరి ప్రాథమిక విద్యను పూర్తి చేశాడు. ఆ ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్ళిపోవడంతో హనుమంతు చదువు మానేశాడు. ఆ ఊరికి హరికథ చెప్పడానికి వచ్చిన ఒక ఆధ్యాత్మిక గురువు హనుమంతు గాత్రశక్తికి అబ్బురపడి అతనిని శిష్యుడుగా చేసుకున్నాడు. హనుమంతు ఆయన వెంట డ్రామా కంపెనీ సభ్యుడుగా కొంతకాలం తిరిగాడు. ఆ తరువాత హైదరాబాదు చేరి వ్యవసాయ శాఖలో గుమస్తాగా పనిచేస్తుండేవాడు. నిజాం ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే స్వభావం కలిగిన హనుమంతు 'ఆర్యసమాజం' పట్ల ఆకర్షితుడై వారి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవాడు. అది నచ్చని నాటి నిజాం సర్కారు ఆఫీసరు అతనిని మందలించాడు. ఆత్మాభిమానం గల హనుమంతు రోషంతో ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. బతుకు దెరువు కోసం దర్జీ పనిని చేపట్టాడు. రావి నారాయణరెడ్డి ప్రసంగం విని ఉత్తేజితుడైన హనుమంతు కమ్యూనిస్టుగా మారి జీవితాంతం కమ్యూనిస్టుగానే ఉండిపోయాడు. ప్రజాఉద్యమ నిర్మాణంలో భాగంగా సుద్దాల గ్రామం చేరాడు. సుద్దాల హనుమంతుగా స్థిరపడిపోయాడు. అక్కడే జానకమ్మతో పెండ్లి జరిగింది. ఆమె కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలు, హనుమంతుతో కలిసి తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని ఎన్నో బాధలు అనుభవించింది. ఆమెలేకుంటే తాను లేనని, ఆమె ప్రేమ, ఓదార్పు, సేవ వల్లనే తాను జీవించ గలుగుతున్నానని హనుమంతు చెప్పిన మాటలే ఆమె ఔదార్యానికి నిదర్శనం.

కమ్యూనిస్టు పార్టీ సుద్దాలకు కళారంగ విభాగాన్ని అప్పగించింది. ఆ క్రమంలో హనుమంతు ఎన్నో చైతన్య గీతాలను రాసి వివిధ కళారూపాల ద్వారా వాటిని ప్రదర్శించి ప్రజలను పోరాటానికి సమాయత్త పరిచేవాడు. సాయుధ పోరాట కాలంలో దళ సభ్యులతో కలసి రాత్రింబవళ్ళు అడవుల్లో, గుట్టల్లో తిరుగుతూ రజాకార్లను, భూస్వామ్య పెత్తందారీ దొరల కిరాయి మూకలను ఎదుర్కొంటూ గెరిల్లా పోరాటం చేశాడు. ఎన్నోసార్లు వెంట్రుకవాసిలో చావును తప్పించుకున్నాడు. భూముల తాకట్టుకు



సంబంధించిన దస్తావేజులను తగులబెట్టాడు. వాటి నుండి ప్రజలను విముక్తులను చేశాడు. భూస్వాముల భూములను స్వాధీన పరచుకొని పేదలకు పంచాడు. పేదల శ్రమను దోచుకొని ధాన్యపురాశులను ప్రోగు చేసిన దొరల వద్ద ధాన్యాన్ని కొల్లగొట్టి పేదలకు పంచాడు. హనుమంతు రాసిన పాడిన పాటలు ప్రజలపై ఎంతో ప్రభావం చూపాయి. సాయుధ పోరాటంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజాసభపైకి రజాకార్లు దాడి చేసినప్పుడు భయంతో పరుగులు తీస్తున్న జనాన్ని ఉద్దేశించి 'వెయ్యి దెబ్బవెయ్, దెబ్బకు దెబ్బ వెయ్ ' అనే పాట పాడి ప్రజలను రజాకార్ల మీద తిరుగబడేటట్లు చేశాడు. ఆ పాట వింటుంటే ఇప్పటికీ రోమాలు నిక్కపొడుచుకుంటాయి. అట్లాగే 'నైజం సర్కారురా ఓరన్న ! నరకాసురుని మించెరా !' అంటూ నిజాం పాలనను తూర్పార బట్టాడు. 'సంఘం వచ్చిందిరో రైతన్నా! మనకు బలం చాలా తెచ్చిందిరో కూలన్నా!' అనే పాట ద్వారా సన్నకారు రైతులను, రైతు కూలీలను సంఘటిత పరచి సంఘాన్ని బలోపేతం చేశాడు. సాయుధ పోరాటంలో అమరులైన వీరులను కీర్తిస్తూ 'జోహారులు! జోహారులు! అమరవీరులారా మీకు జోహారులు' అంటూ పాట రాసి స్వయంగా పాడాడు. ఆ పాట తెలంగాణ అమరవీరుల త్యాగాలను నిరంతరం గుర్తుచేస్తూనే ఉంటుంది.

వెట్టి చాకిరిని నిరసిస్తూ వెట్టి బాధను తెలుపుతూ అందరి హృదయాలను కదిలించే విధంగా 'వెట్టిచాకిరి విధానమో రైతన్న ! ఎంత చెప్పిన తీరదో రైతన్న!' అంటూ రాసిన పాట వెట్టిపై తిరుగుబాటు బావుటా ఎగరేసేటట్లు చేసింది. పోరాటక్రమంలో గ్రామాలు తిరుగుతున్న హనుమంతుకు ఒకచోట ఒక చిన్న పిల్లవాడు బడికి దూరమై దొర దగ్గర వెట్టి చేస్తూ పశువులను కాస్తు కనిపించాడు. అటు పశువుల్ని అదిలించలేక ఇటు కడుపునిండా తిండిలేక ఆకలితో అలమటిస్తూ, కాలికి ముండ్లు గుచ్చుకొని బాధతో రాతిగుండు మీద కూర్చొని వెక్కివెక్కి ఏడుస్తున్న ఆ పిల్లగాడిని చూసి నిలువునా కరిగిపోయి 'పల్లెటూరి పిల్లగాడా ! పసులు గాసే మొనగాడా' అనే పాట రాశాడు. అది ప్రజల నాలుకల మీద సజీవంగా నిలిచిపోయింది. దానిని 'మా భూమి' సినిమాలో టైటిల్ సాంగ్ గా తీసుకున్నారు. సుద్దాల హనుమంతు అజ్ఞాతంలో ఉన్నా ఆయన పాటలు ప్రజల నోళ్ళల్లో నానుతూ పోరాట గీతాలైనాయి. ఆ గీతాల ప్రభావం అలాంటిది. అవి నాటికే కాదు నేటికి కూడా ప్రజలలో చైతన్యం కలిగించగల శక్తి స్వరూపాలు.

1947లో హనుమంతుకు తీవ్రమైన అనారోగ్యం కలిగింది. ఆ సమయంలోనే ఆయనపై 'కనిపిస్తే కాల్చివేసే వారెంట్' ఉన్నది. పార్టీ ఆదేశాల మేరకు మారు వేషాలతో భార్య జానకమ్మతో సహ ముంబయి చేరుకొని అజ్ఞాతవాసం చేశాడు. నిజాంపాలన అంతమై, తెలంగాణ విముక్తి పొందిన తరువాత తిరిగి సుద్దాలకు చేరుకున్నాడు. అప్పుడు వైద్యవృత్తిని ఎన్నుకొని ప్రఖఆ పరీక్షలో ఉత్తీర్ణత పొంది వైద్యుడిగా జీవితాన్ని ప్రారంభించాడు. కమ్యూనిస్టు పార్టీ సుద్దాల గ్రామశాఖ కార్యదర్శిగా పనిచేశాడు. 1952లో కమ్యూనిస్టు పార్టీ ఆఈఓ పేరుతో ఎలక్షన్లో పాల్గొంది. ఆ పార్టీ ప్రచారంలో పాల్గొని పాటలు రాశాడు. ఆ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన ఒక పార్టీ హనుమంతును తమ పార్టీలో చేరమని డబ్బు ఆశ చూపారు. అంతేకాదు నాగార్జునసాగర్ కింద పొలం కూడా ఇస్తామని ఆశపెట్టారు. తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన హనుమంతు పార్టీని వీడలేదు. తనకు లభించిన ఆఫర్లన్నింటినీ తృణప్రాయంగా వదిలేశాడు.

నికార్సయిన కమ్యూనిస్టుగానే జీవితం కొనసాగించాడు. అయితే ప్రతికూల వర్గం వారు హనుమంతుని లొంగదీయాలని, ఆర్థికంగా అణచివేయాలని కుట్రలుపని హనుమంతు భూమిని ఆక్రమించారు. ఆయన ఇంట్లో దొంగతనం చేయించి బంగారం, నగదు పోయేటట్లు చేశారు. అయినా హనుమంతు పార్టీ మారలేదు. పోరాట మార్గాన్ని వీడలేదు. కమ్యూనిస్టుగానే ఉన్నాడు. అధికారం కోసం పార్టీలు మారే ఈనాటి నాయకులకు హనుమంతుకు ఎంత తేడా !

సాయుధ పోరాటం ద్వారా వేలాది వీరులు తమ ప్రాణాలను ధారపోసి సాధించిన తెలంగాణ ఫలాలను మళ్ళీ దొరలు, పెత్తందారులు, భూస్వాములు, దోపిడిదారులు దండుకున్నారనేది సుద్దాల హనుమంతు భావన. తాను కోరుకున్న ప్రజారాజ్యం రాలేదని తలచేవాడు. ఆ క్రమంలోనే 'ఆహా మంటలు, మంటలు', 'ఇదే రామరాజ్యమా, ఇదే ప్రజాస్వామ్యమా' 'గాంధీతాతా, శాంతిదూతా' అంటూ సమాజంలోని దీనమైన జీవితాలను చూసి ద్రవించిపోయి ఎన్నో గేయాలు రాశాడు. అంతేగాక ఓట్ల కొరకై నోట్లు పంచి, వసుధ ప్రజలను మోసగించి, సీట్ల కొరకై సిగ్గు విడిచి, సిగలు సిగలే పట్టుకొనిరి అంటూ నేటి రాజకీయ అరాచకాన్ని 'చెందొర పెద్దొర' అనే గేయం ద్వారా ఎండగట్టాడు.

ఇంతటి ఆదర్శజీవి, ఆచరణశీలి, మానవతామూర్తి, తాడిత పీడిత శ్రామిక వర్గాల ఆశాజ్యోతి, నిస్వార్థజీవిని క్యాన్సరు వ్యాధి కబళించింది. ఆ బాధను మరణాంతం మౌనంగా భరించాడే తప్ప ఏనాడు బహిరంగ పరచలేదు. చివరకు జీర్ణాశయ క్యాన్సరుతో 1982 అక్టోబరు 10న మరణించాడు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రూపొందించిన తెలుగు పాఠ్యపుస్తకాలలో ఆరవ తరగతిలో ఆయన రచించిన పల్లెటూరి పిల్లగాడ పాటను చేర్చడం ఆయనకు దక్కిన గౌరవం. ఉద్యమం ఉన్న చోటల్లా ఆయన చైతన్య కిరణమై వెలుగొందుతుంటాడు. స్ఫూర్తిని కలిగిస్తూనే ఉంటాడు. భావితరాన్ని 'జాగరతండోయ్- జాగరత' అని హెచ్చరిస్తూనే ఉంటాడు.

**జూన్ 6 సుద్దాల హనుమంతు జయంతి**

**- సుధాకర్.ఏ.వి**
9000674747

# నీటి పారుదల రంగానికి కె.ఎల్.రావు ఎనలేని సేవలు



నీటిపారుదల రంగంలో అపర భగీరథుడిగా కీర్తించబడే తెలుగు ప్రజలు గర్వించ దగిన డా. కానూరి లక్ష్మణరావు (జూన్ 6, 1902 - మే 18, 1986) భారత దేశం లోనే గాక ప్రపంచ వ్యాప్తంగా నీటిపారుదల రంగంలో విప్లవాత్మకమైన పనులు చేసిన గొప్ప ఇంజనీరు. మోక్ష గుండం విశ్వేశ్వరయ్య తర్వాత గొప్ప వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారు. 1902 జూలై 14న కృష్ణా జిల్లా కంకి పాడు గ్రామంలో జన్మించిన కె.ఎల్. రావు మద్రాసు విశ్వ విద్యాలయ ములో ఇంజనీరింగు (బీ.ఈ) డిగ్రీ పూర్తి చేసి, గిండీ ఇంజనీరింగు కళా శాల నుండి పోస్టుగ్రాడ్యుయేషన్ చేసి, మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఇంజనీరింగులో మాస్టరు డిగ్రీ (ఎం.ఎస్.సి ఇన్ ఇంజనీరింగ్) పొందిన తొలి వ్యక్తిగా నిలిచారు. చదువు పూర్తయిన తర్వాత విశాఖ జిల్లా బోర్డు అసిస్టెంట్ ఇంజనీరుగా పని చేశారు. కొంత కాలం తర్వాత రావు గారు గిండీ ఇంజనీరింగ్ కళాశాలలో పరిశోధ కుడిగా చేరారు.

ఇంగ్లండ్ లోని బర్మింగ్ హోమ్ విశ్వవిద్యాలయం నుండి 1939 లో డాక్టరేట్ డిగ్రీ పొందారు. కొంత కాలం పాటు ఇంగ్లాండ్‌లో ప్రొఫెసర్‌గా పని చేసిన ఆయన 1946లో భారత దేశం తిరిగి వచ్చి మద్రాసు ప్రభుత్వంలో డిజైన్ ఇంజనీర్‌గా చేరారు. 1950-54 మధ్యకాలంలో భారత ప్రభుత్వంలో చీఫ్ ఇంజనీర్ గా పని చేశారు. ప్రభుత్వంలో ఇంజనీర్ గా పని చేస్తున్న సమయాన, దేశం లోని అనేక నీటి పారుదల ప్రాజెక్టులకు నమూనాలు తయారు చేశారు.

నాగార్జునసాగర్, పులిచింతల, శ్రీశైలం, శ్రీరాం సాగర్ వంటి ఎన్నో సుప్రసిద్ధ నీటిపారుదల పథకాలకు రూపకల్పన చేశారు. గంగా, బ్రహ్మపుత్ర తదితర నదుల వరదల నివారణకై అనేక సూచనలు సలహాలు ఇచ్చారు. అందులో భాగంగానే గాంధీసాగర్ , జవహర్ సాగర్, రాణాప్రతాప్‌సాగర్ వంటి నిర్మాణాలు సిద్ధం చేశారు. నాటి ప్రభుత్వం నాగార్జునసాగర్, భాక్రానంగల్ ప్రాజెక్ట్, హిరాకుడ్ ప్రాజెక్ట్ విషయంలో పిలిపించిన విదేశీ ఇంజనీర్లు కూడా రావును సంప్రదించడం ఆయన ప్రతిభకు నిదర్శనం. ఇంజనీరింగ్ విషయాలకు సంబంధించి ఈయన రాసిన 'ఇండియాస్ వాటర్ వెల్త్' అనే పుస్తకం నేటి తరాల శాస్త్రవేత్తలకు ప్రామాణిక గ్రంథంగా ఉంది. ఉద్యోగ విరమణ అనంతరం నాటి జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు నీలం సంజీవరెడ్డి పిలుపు మేరకు 1962, 1967,1971లో విజయవాడ నుంచి పార్లమెంటుకు పోటీ చేసి గెలిచారు. నెహ్రూ, శాస్త్రి, ఇందిరా గాంధీ, నేతృత్వంలోని ప్రభుత్వంలో కేంద్ర జలవనరుల శాఖ మంత్రిగా పని చేశారు. కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడే గంగా బ్రహ్మపుత్ర నదిలో వర్షాకాలంలో చేరుతున్న నీటిని నిల్వ ఉంచి భారతదేశంలో క్షామ ప్రాంతాలైన మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు నీటి సౌకర్యం కల్పించే 'నేషనల్ వాటర్ గ్రిడ్' పథకానికి రూపకల్పన చేశారు. 1963లో పద్మభూషణ్ అందుకున్నారు. రూర్కీ, ఆంధ్రా మరియు జేఎన్‌టీ విశ్వ విద్యాలయాల డాక్టరేట్లు పొందారు, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్, అలాగే ఆల్ ఇండియా ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా, ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ సాయిల్ మెకానిక్స్ అండ్ జియోటెక్నికల్ ఇంజనీరింగ్ (ఆసియా) వైస్ ప్రెసిడెంట్‌గా, రంగూన్ (బర్మా, ఇప్పుడు మయన్మార్)లో ప్రొఫెసర్గా, యునైటెడ్ కింగ్‌డమ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేశారు. ఇంజనీరుగా చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా మూడు పర్యాయాలు రాష్ట్రపతి పురస్కారం లభించింది. ఆయన జ్ఞాపకార్థం పులిచింతల ప్రాజెక్టుకు కె.ఎల్.రావు ప్రాజెక్టు అని నామ కరణము చేయబడింది. ఒక ఇంజనీరు పేరును ప్రాజెక్టుకు పెట్టడం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఇదే ప్రథమం. 1986 మే 18 న 84 సంవత్సరాల వయసులో మృతి చెందారు.

**జూన్ 6 డాక్టర్ కానూరి లక్ష్మణరావు జయంతి**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# వాతావరణ సంక్షోభం పరిష్కార మార్గం



ఒకప్పుడు వాతావరణ మార్పులు అంటే భవిష్యత్తులో సంభవించే ప్రమాదంగా మాత్రమే భావించేవారు. శాస్త్రవేత్తల నివేదికలు, అంతర్జాతీయ సదస్సులు, పర్యావరణవేత్తల హెచ్చరికలకే పరిమితమైన అంశంగా కనిపించేది. అయితే నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వాతావరణ సంక్షోభం ఇక భవిష్యత్తు ముప్పు కాదు. మన దైనందిన జీవితాలను ప్రభావితం చేస్తున్న వాస్తవం.

ఈ నేపథ్యంలో జూన్ 5న జరుపుకునే ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని కేవలం ఒక వార్షిక కార్యక్రమంగా చూడలేం. అది మన అభివృద్ధి నమూనాలను, జీవన విధానాలను పునఃపరిశీలిం చుకునే అవకాశంగా మారాలి. అడవుల్లో వందలాది రకాల చెట్లు, మొక్కలు, పక్షులు, జంతువులు, సూక్ష్మజీవులు పరస్పర సహకారంతో జీవిస్తాయి. ఈ వైవిధ్యమే వాటి స్థిరత్వానికి, మనుగడకు మూలం. ఐక్యరాజ్యసమితి జీవవైవిధ్య అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 10 లక్షల జాతులు అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్నాయి. వ్యవసాయ రంగాన్నే తీసుకుంటే, ఒకే పంటపై ఆధారపడే విధానాలు అధిక ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. వర్షపాతం మారినా, తెగుళ్లు వ్యాపించినా రైతు ఆదాయం మొత్తం దెబ్బతింటుంది. అదే మిశ్రమ పంటలు, స్థానిక విత్తనాలు, వ్యవసాయ అటవీ విధానాలు అదనపు రక్షణ కల్పిస్తాయి. జీవ వైవిధ్య పరిరక్షణ అనేది కేవలం పర్యావరణ అంశం మాత్రమే కాదు. అది ఆహార భద్రత కూడా.

ప్రకృతిలో ప్రతి వ్యవస్థకు ఒక భరించే సామర్థ్యం ఉంటుంది. నదులు, అడవులు, నేలలు, సముద్రాలు అన్నింటికీ హద్దులు ఉన్నాయి. ఆ పరిమితులను దాటినప్పుడు సమతుల్యత దెబ్బతింటుంది. ప్రస్తుతం ఎదురవుతున్న అనేక పర్యావరణ సమస్యలకు మూల కారణం ఇదే. అధిక భూగర్భ జల వినియోగం, అడవుల నరికివేత, తీర ప్రాంతాల ఆక్రమణ, సహజ జలవనరుల విధ్వంసం వంటి చర్యలు ప్రకృతి పరిమితులను విస్మరించిన ఫలితాలే. అభివృద్ధి అంటే ప్రకృతిని జయించడం కాదని, దానితో సమన్వయంగా ముందుకు సాగడమేనని ఈ పాఠం గుర్తు చేస్తుంది. భవిష్యత్తు అభివృద్ధి నమూనాలు కూడా ప్రకృతి సామర్థ్యాలను గౌరవించే విధంగానే రూపుదిద్దుకోవాలి. వాతావరణ మార్పులను ఎదుర్కొనే క్రమంలో ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి ఆధారిత పరిష్కారాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు, అంతర్జాతీయ సంస్థలు ప్రకృతి అందించే సేవల విలువను మరింత స్పష్టంగా గుర్తిస్తున్నాయి. దీనికి అడవులే ఉత్తమ ఉదాహరణ. ప్రపంచంలో అతిపెద్ద సహజ కార్బన్ నిల్వ కేంద్రాలుగా అవి పనిచేస్తాయి. ప్రపంచ కార్బన్ ఉద్గారాల్లో సుమారు 30 శాతం వరకు శోషించడంలో అడవులు, ఇతర సహజ పర్యావరణ వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం అంచనా వేస్తోంది. వర్షపాతం చక్రాన్ని ప్రభావితం చేయడం, నేల సారాన్ని కాపాడటం, జీవ వైవిధ్యానికి ఆశ్రయం కల్పించడం వంటి అనేక సేవలను అవి అందిస్తాయి. అందువల్ల అడవుల సంరక్షణ అనేది కేవలం పర్యావరణ కార్యక్రమం కాదు; వాతావరణ విధానంలో కీలక అంశం. చిత్తడి నేలలు, చెరువులు, సరస్సులు, మడ అడవులు కూడా అమూల్యమైన సేవలను అందిస్తున్నాయి. ఇవి వరద నీటిని నిల్వ చేస్తాయి, తీర ప్రాంతాలను రక్షిస్తాయి, భూగర్భ జలాలను పునరుద్ధరిస్తాయి. అయితే పట్టణీకరణ, భూవినియోగ మార్పుల కారణంగా ఈ వ్యవస్థలు వేగంగా కనుమరుగవుతున్నాయి. ఈ నష్టాన్ని పూడ్చుకోకుండా వాతావరణ అనుకూల అభివృద్ధి గురించి మాట్లాడటం అసంపూర్ణమే.

భారతదేశానికి నీటి వనరుల పరిరక్షణ మరింత కీలకం. ప్రపంచ జనాభాలో దాదాపు 18 శాతం మంది భారతదేశంలో నివసిస్తున్నప్పటికీ, ప్రపంచ మంచినీటి వనరుల్లో కేవలం 4 శాతం మాత్రమే మనకు అందుబాటులో ఉన్నాయి. నీతి ఆయోగ్ అంచనాల ప్రకారం దేశంలో సుమారు 60 కోట్ల మంది ప్రజలు ఇప్పటికే నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో ఈ ఒత్తిడి మరింత పెరుగుతోంది. అందువల్ల సంప్రదాయ నీటి సంరక్షణ వ్యవస్థలు, చెరువులు, కుంటలు, వర్షపు నీటి సేకరణ పద్ధతుల పునరుద్ధరణ అత్యవసరంగా మారింది. వాతావరణ చర్య అనేది ప్రభుత్వాలకే పరిమితమైన బాధ్యత కాదు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్థానిక సంస్థలు, పౌర సమాజం, ప్రతి వ్యక్తి ఇందులో భాగస్వాములు కావాలి. శక్తి వినియోగాన్ని తగ్గించడం, నీటిని పొదుపుగా వినియోగించడం, వ్యర్థాలను తగ్గించడం, పచ్చదనాన్ని పెంచడం వంటి చర్యలు వ్యక్తిగత స్థాయిలో చిన్నవిగా కనిపించినా, సమిష్టిగా అవి పెద్ద మార్పుకు దారితీస్తాయి. వైవిధ్యం, సమతుల్యత, పునరుద్ధరణ సామర్థ్యం, పరిమితుల పట్ల గౌరవం ఇవన్నీ ప్రకృతి మనకు అందిస్తున్న శాశ్వత పాఠాలు. ఆ పాఠాలను అభివృద్ధి విధానాల్లో ప్రతిబింబించగలిగితేనే వాతావరణ చర్యలు ఆశించిన ఫలితాలను ఇస్తాయి. ప్రకృతి స్ఫూర్తితో ముందుకు సాగే సమాజమే భావితరాలకు సురక్షితమైన, స్థిరమైన ప్రపంచాన్ని అందించగలదు.

**- జనక మోహన రావు దుంగ**
8247045230

# నెహ్రూ కాలాన్ని దాటేసిన మోదీ



స్వతంత్ర భారత రాజకీయ చరిత్రలో ఇద్దరు ప్రముఖ ప్రధానమంత్రుల నిరంతర పాలనా కాలాలపై ఇటీవల చర్చలు మళ్లీ తీవ్రమయ్యాయి. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మరియు ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ పాలనా కాలాలను పోల్చుతూ, ఎవరు ఎక్కువ కాలం నిరంతరాయంగా ప్రధానిగా కొనసాగారనే అంశంపై విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, నిజమైన చారిత్రక గణాంకాలు స్పష్టంగా చెబుతున్నాయి - ప్రధాని నరేంద్ర మోదీ 2026 జూన్ నాటికి నెహ్రూ రికార్డును అధిగమించి, స్వతంత్ర భారతంలో అత్యధిక కాలం పాలన సాగించిన ప్రధానిగా చరిత్ర సృష్టించనున్నారు.

జవహర్‌లాల్ నెహ్రూ స్వతంత్ర భారత తొలి ప్రధానిగా దేశ నిర్మాణంలో పాత్ర పోషించారనేది నిజమే. ఆయన మే 13, 1952న మొదటి సాధారణ ఎన్నికల అనంతరం ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి, 1964 మే 27న మరణించేవరకు అంటే సుమారు 4,398 రోజులు పదవిలో ఉన్నారు. కానీ ఈ కాలంలో ఒక వాస్తవాన్ని గుర్తించాలి - నెహ్రూ కాలంలో కాంగ్రెస్ పార్టీ దేశ రాజకీయాల్లో నీరసమైన ప్రతిపక్షంతో అధిపత్యం వహించింది. ఆ కాలంలో బలమైన ప్రతిపక్షం లేని ఏక పార్టీ ఆధిపత్యం ఉండేది. అంతే కాకుండా, నెహ్రూ స్వయంగా మహాత్మా గాంధీ సూచన మేరకే ప్రధాని అయ్యారనేది చరిత్ర. ఆ కాలంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ వంటి దిగ్గజ నేతలను పక్కనపెట్టి నెహ్రూను ఎంపిక చేసినప్పటికీ, ఆయన పాలనలో ప్రజాస్వామ్య సంస్థలు బలపడినా, రాజకీయంగా వారసత్వ పాలనకు నాంది పలికారు. నెహ్రూ తర్వాత ఆయన కుమార్తె ఇందిరా గాంధీ కూడా దీర్ఘకాలం పాలన చేసినా, వారి వారసత్వ రాజకీయాల కారణంగానే కాంగ్రెస్ పార్టీ కుటుంబ కేంద్రిత సంస్థగా మారింది.

ఇందిరా గాంధీ 1966 నుంచి 1977 వరకు సుమారు 4,077 రోజులు వరుసగా ప్రధానిగా ఉన్నారు. ఆమె తర్వాత మళ్లీ అధికారంలోకి వచ్చినా, ఆమె పాలనలోఎమర్జెన్సీ వంటి నల్ల అధ్యాయాలు, ప్రజాస్వామ్య సంస్థల కుంగుదాటుకు ప్రసిద్ధి. నెహ్రూ-గాంధీ కుటుంబం భారత రాజకీయాల్లో వారసత్వాన్ని ఏర్పరిచినా, ఆ వారసత్వంలో ఆర్థిక ఇబ్బందులు, అవినీతి, లోక్‌పాల్ వంటి సంస్థలను బలహీనపరచడం వంటివి ఉన్నాయి. ఇతర ప్రధానుల్లో మన్మోహన్ సింగ్ లేదా అటల్ బిహారీ వాజ్‌పేయి దీర్ఘకాల పాలన సాధించలేదు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ అత్యంత పోటీతత్వ బహుళ పార్టీ వ్యవస్థలో, ప్రతికూల ప్రచారం, ప్రాంతీయ పార్టీల బలమైన సవాళ్లను ఎదుర్కొంటూ మూడుసార్లు (2014,2019,2024) అత్యున్నత మెజారిటీ సాధించి నిరంతరాయంగా పదవిలో కొనసాగుతున్నారు. ఇది ఆయన ప్రజాబలానికి, పాలనా సామర్థ్యానికి నిదర్శనం.

ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ 2014 మే 26న తొలిసారిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత 2019 మరియు 2024 ఎన్నికల్లో భారీ మెజారిటీతో వరుసగా గెలుపొందారు. 2026 జూన్ నాటికి ఆయన నిరంతరాయ ప్రధానిగా ఉన్న కాలం 4,399 రోజులకు చేరుకుంటుంది. అంటే నెహ్రూ 4,398 రోజుల రికార్డును కేవలం ఒక్క రోజుతో అధిగమించనున్నారు. ఈ ఘనతను సాధించడంలో మరో విశేషమేమిటంటే, నెహ్రూ కాలంలో ప్రతిపక్షం దుర్బలంగా ఉండగా, మోదీ కాలంలో విపక్షాలు మూడుసార్లు ఏకమై ప్రతిఘటించినా, ఆయనను ఆపలేకపోయాయి. ఇది కేవలం వ్యక్తిగత రికార్డు మాత్రమే కాకుండా, ఆధునిక భారతదేశంలో స్థిరమైన, ప్రభావవంతమైన, దార్శనికమైన పాలనకు గుర్తుగా నిలుస్తుంది.

నెహ్రూ సెక్యులర్, సామ్యవాద దృక్పథంతో దేశాన్ని నడిపించారు. అయితే ఆయన 'సెక్యులరిజం' వాస్తవంలో మైనారిటీల విషయంలో అనవసర అనుగ్రహంగా మారిందని, జమ్మూ కాశ్మీర్ విషయంలో ఆయన చేసిన రాజకీయ తప్పిదాలే నేడు విభజనవాదానికి దారితీశాయని చాలామంది వాదిస్తారు. నెహ్రూ కాలంలో చారిత్రక తప్పిదాల వలన చైనాతో 1962 యుద్ధంలో దేశం అవమానకరంగా ఓడిపోయింది. అంతర్జాతీయ వేదికపై అలీన ఉద్యమాన్ని ప్రోత్సహించినా, దాని వలన దేశానికి ప్రత్యక్ష ప్రయోజనాలు పెద్దగా లేవు. మరోవైపు ప్రధాని మోదీ 'సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్, సబ్కా ప్రయాస్' అనే దార్శనిక మంత్రంతో జాతీయత, సాంస్కృతిక పునరుజ్జీవనం, అభివృద్ధికి



ప్రాధాన్యం ఇచ్చారు. మోదీ పాలనలో ఆర్టికల్ 370 రద్దు ద్వారా జమ్మూ కాశ్మీర్‌ను భారత్‌లో పూర్తి ఏకీకరణ చేశారు. త్రిపుల్ తలాక్ నిషేధం ద్వారా ముస్లిం మహిళలకు గౌరవం లభించింది. అయోధ్యలో రామమందిర నిర్మాణం ద్వారా దేశం తన సాంస్కృతిక వారసత్వాన్ని తిరిగి పొందింది. నెహ్రూ సాంప్రదాయిక భారతాన్ని విమర్శించారు, మోదీ భారత గౌరవాన్ని నిలబెట్టారు.

నెహ్రూ కాలంలో 'లైసెన్స్ రాజ్' అనే మూసీ విధానం కారణంగా ఆర్థిక వృద్ధి నెమ్మదిగా సాగింది, దీనిని 'హిందూ రేట్ ఆఫ్ గ్రోత్' అని పిలిచేవారు. ప్రధాని మోదీ ఈ నమూనాను పూర్తిగా మార్చారు. డిజిటల్ ఇండియా, మేక్‌ఇన్‌ఇండియా,స్టార్టప్ ఇండియా, జన్ ధన్-ఆధార్-మొబైల్ (జెఎఎం) ట్రినిటీ ద్వారా దేశంలో ప్రతి పౌరుడిని ప్రధాన ఆర్థిక వ్యవస్థతో అనుసంధానించారు.

భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు - ఎక్స్‌ప్రెస్‌వేలు, రైల్వే విద్యుద్దీకరణ, నమో భారత్, అంతర్జాతీయ విమానా శ్రయాలు, నీతి ఆయోగ్ ద్వారా ప్రణాళికా విధానాన్ని ఆధునికీకరించారు. దేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మారింది. 2014 ముందు ప్రపంచంలో భారత్‌ను 'త్రైమాసిక బలహీన ఆర్థిక వ్యవస్థ'గా చూస్తే, ఈనాడు 'బ్రైట్ స్పాట్'గా చూస్తున్నారు. మోదీ పాలనలో కార్పొరేట్ పన్నులు తగ్గింపు, ఉత్పత్తి ఆధారిత పథకాలు, గిగ్ ఎకానమీ, స్టార్టప్లకు ప్రోత్సాహకాలు-ఇలా ప్రతి రంగం స్పృశించ బడింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ఉజ్వల, సౌభాగ్య, హర్ ఘర్ జల్ మిషన్, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన వంటి ప్రత్యక్ష పథకాలతో పేదలకు ప్రత్యక్ష లబ్ధి చేకూరింది. నెహ్రూ కాలంలో ఎన్నడూ లేనంత పారదర్శకత, సమర్థత, నిబద్ధత మోదీ పాలనలో కనిపిస్తుంది.

నెహ్రూ కాలంలో ఎన్నికల సంఘం, ప్రతిపక్షం బలహీనంగా ఉండగా, మోదీ కాలంలో ఎన్నికల సంఘం స్వతంత్రంగా, బలంగా ఉంది. మోదీ పాలనలో ఎన్నికల ప్రక్రియ డిజిటలైజ్ అయింది, ఓటరు నమోదు వ్యవస్థ పారదర్శకంగా మారింది, నెహ్రూ కాలంలో కాంగ్రెస్ కుటుంబీయ ప్రభుత్వంలా ఉండేది. మోదీ కాలంలో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత సజీవ ప్రజాస్వామ్యం. ఆయన 'కోయిలో దమ్ హై తో....' వంటి నినాదాలతో ప్రతిపక్షాలకు గట్టిగా ఎదురీతలిచ్చారు. ప్రతి ఒక్క పౌరుడు స్వేచ్ఛగా తన అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు - ఇది మోదీ హయాంలోనే సాధ్యమైంది.

బీజేపీ నాయకులు తరచూ నెహ్రూ ఎంపిక విషయంలో చారిత్రక ఆధారాలు చూపిస్తారు. అసలు సంఘటన ఏమిటంటే - స్వతంత్రా నంతరం కాంగ్రెస్ కమిటీలలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ ప్రధాని అభ్యర్థిగా ఎక్కువ మంది సభ్యుల మద్దతు పొందారు. మహాత్మా గాంధీ జోక్యం చేసుకుని నెహ్రూను ప్రధానిగా చేయమని చెప్పారు - కాంగ్రెస్ పార్టీలో అప్పటికే జరిగిన మెజారిటీ ప్రక్రియను కొట్టిపారేస్తూ. దీని వలన భారత రాజకీయాల్లో మొదటి పెద్ద వారసత్వ ప్రయోగం జరిగింది. నెహ్రూ స్థానంలో పటేల్ ఉండి ఉంటే దేశ విభజన నుండి ఆర్థిక, రాజకీయ పునర్నిర్మాణం వేగంగా జరిగేదేమో అనే చర్చ చరిత్రకారుల్లో ఉంది. అయితే ఈ చర్చ చారిత్రకమే - కానీ మనం ఇప్పటి పాలనాపై దృష్టి పెడితే, మోదీ ఎటువంటి గాడ్‌ఫాదర్ లేక, స్వంత మెరిట్తో, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన నేత. ఇది ఆయన సాధించిన విజయాల ప్రాముఖ్యతను మరింత పెంచుతుంది.

నెహ్రూ స్వతంత్ర భారతానికి పునాది వేసిన నేతగా చరిత్రలో నిలిచి ఉండవచ్చు, కానీ ప్రధాని నరేంద్ర మోదీ ఆ పునాదిపై స్టీల్ ఫ్రేమ్ నిర్మించి, 21వ శతాబ్దపు భారత దేశాన్ని ప్రపంచ నాయకుడిగా నిలిపిన దార్శనికుడు. నెహ్రూ కాలంలో దేశం నెమ్మదిగా కదిలితే, మోదీ కాలంలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మారింది. నెహ్రూ ప్రజా స్వామ్యాన్ని పారంపర్యంగా చూస్తే, మోదీ దానిని సంస్థాగత బలంగా మార్చారు. నెహ్రూ మైనారిటీల విషయంలో అనుగ్రహ విధానం ప్రోత్స హిస్తే, మోదీ సమాన హక్కులు, త్రిపుల్ తలాక్ నిషేధం ద్వారా మహిళా సాధికారత, రామమందిరం ద్వారా సాంస్కృతిక పునరుజ్జీవనం సాధిం చారు. నెహ్రూ విదేశాల్లో తటస్థంగా ఉంటే, మోదీ ప్రపంచంలోని ప్రతి పెద్ద శక్తితో సత్సంబంధాలు పెట్టుకున్నారు.

ఈ నేపథ్యంలో 2026 జూన్ నాటికి మోదీ నిరంతర ప్రధానిగా నెహ్రూ రికార్డును అధిగమించనుండడం చారిత్రక ఘనత. ఇది భారతీయ ప్రజల విశ్వాసానికి, ప్రజాస్వామ్యం బలంగా ప్రతిధ్వనించే విజయానికి, సుస్థిర, అవినీతి రహిత పాలనకు సంకేతం. నెహ్రూ కాలంలో 4,398 రోజులు ఉన్నా, ఆ రోజుల్లో ప్రజలకు ఎదురైన ఇబ్బందులు, అవినీతి, అనిశ్చితి - మోదీ కాలంలో పూర్తిగా తొలగించబడ్డాయి. ఈ దృక్కోణంలో, మోదీ 4,399వ రోజు కేవలం రికార్డు ఛేదన మాత్రమే కాదు, అది భారత చరిత్రలో ఒక నూతన, స్వర్ణయుగ ప్రారంభానికి నాంది. మోదీ యుగం నిజంగా 'న్యూ ఇండియా' నిర్మాణానికి, ప్రపంచ గుర్తింపుకు మార్గదర్శి. మోదీ స్ఫూర్తితో, భారత్ 2047 స్వాతంత్ర్య శతాబ్దిలో 'వికసిత్ భారత్'గా మారుతుందనే విశ్వాసం ప్రతి భారతీయునిలో ఉంది.

**డా . రవి కుమార్ చేగొని**

# భూ నిర్వాసితుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటాం

- చట్ట ప్రకారం పరిహారం చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- ధర్మపురి క్షేత్ర అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజల సహకారాలందించాలి
- 2027 గోదావరి పుష్కరాలకు సకల సౌకర్యాలు కల్పిస్తాం
- రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**జగిత్యాల, జూన్ 5 (మనం ప్రతినిధి):** ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్ర అభివృద్ధికి భూనిర్వాసితుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ముందుకు సాగుతామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ధర్మపురిలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్ర అభివృద్ధి, పుష్కర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, సంబంధిత అధికారులు, భూనిర్వాసితులతో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ భూ నిర్వాసితుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని ఎవ్వరిని ఇబ్బంది పెట్టకుండా శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర అభివృద్ధికి ముందుకు సాగుతామని తెలిపారు. 2017 -18 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు ప్రభుత్వం పరిహారం చెల్లించడానికి సిద్ధంగా ఉందని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ప్రజా పాలనలో ప్రజలు ఎవ్వరిని ఇబ్బందులకు గురి చేయమని మంత్రి అన్నారు. ఇప్పటికే పలుమార్లు భూ నిర్వాసితులతో నెలలుగా చర్చలు జరిపామని శనివారం మరో దఫా చర్చలు నిర్వహిస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ధర్మపురి క్షేత్ర అభివృద్ధి కోరకు స్థానికులంతా సహకరించాలని ఎవరు క్షేత్ర అభివృద్ధిలో రాజకీయాలు చేయద్దని ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేయలే కానీ అభివృద్ధి విషయంలో ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. దేశం నలుమూలల నుండి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి క్షేత్రానికి వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించడమే తమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆలయ అభివృద్ధి కొరకు సేకరిస్తున్న భూములు, ఇల్లు కోల్పోతున్న వారు పెద్ద మనసుతో సహకరించాలని మంత్రి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. 2027 గోదావరి పుష్కరాలకు రూ.117కోట్లు 2027 జూన్ లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు మొదటి విడతగా ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి, కోటి లింగాలకు రూ. 117 కోట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేటాయించారని తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా బైపాస్ రోడ్లు, పార్కింగ్ స్థలాలు, పుష్కర ఘాట్లు నిర్మిస్తున్నామని తెలిపారు. మరిన్ని సౌకర్యాల కోసం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆధ్వర్యంలో నేడు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తున్నామని త్వరలోనే నిధులు సాధించి పుష్కరాలకు ముందే పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు భూనిర్వాసితుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి పనులు చెప్పడతామని అన్నారు. 2017 - 2018 భూ సేకరణ చట్టం ప్రకారం భూ నిర్వాసితులకు ప్రభుత్వం అందించే పరిహారం పారదర్శకంగా అందిస్తామని అన్నారు. అదేవిధంగా 2027 గోదావరి పుష్కరాలకు రానున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వాటి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఇప్పటివరకు ప్రభుత్వం 117 కోట్ల రూపాయల నిధులు కేటాయించిందని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, దేవాదాయ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఇరిగేషన్ శాఖ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆర్అండ్బి చీఫ్ ఇంజనీర్ని కలిసిన ఎమ్మెల్యే



**జగిత్యాల జూన్ 05 (మనం న్యూస్):** గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ల ఆదేశాల మేరకు జగిత్యాల నియోజవర్గంలో సుమారు 65 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకి నిధులు తక్షణమే మంజూరు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను కోరగా, దానికి స్పందించిన సీఎం రేవంత్ మంత్రి నిధులు తక్షణమే మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఏఎన్సి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జగిత్యాల నియోజవర్గంలో దాదాపు 100 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడానికి సీఎం రేవంత్ హామీ ఇవ్వడం జరిగిందని, త్వరలోనే జగిత్యాల దాని చుట్టూ ఉన్న గ్రామాల్లో వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జి లు, రోడ్ల వెడల్పు తదితర రోడ్ల మరమ్మతులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు.

# రాజకీయ చైతన్యమే పార్టీకి బలం

- సుశిక్షిత కమ్యూనిస్టులుగా ఎదగాలి
- మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

3 దేశంలో రోజురోజుకూ మారుతున్న రాజకీయ, సామాజిక పరిస్థితులను అధ్యయనం చేస్తూ సుశిక్షిత కమ్యూనిస్టులుగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. రాజకీయ శిక్షణా శిబిరాలు కార్యకర్తలకు సిద్ధాంతపరమైన అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. వేములవాడలోని మహందీశ్వర బ్యాంకెట్ హాలులో శుక్రవారం ప్రారంభమైన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సీపీఐ కౌన్సిల్ సభ్యుల మూడు రోజుల రాజకీయ శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్రావు పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ, జాతీయ, రాష్ట్ర స్థాయి పరిణామాలను అర్థం చేసుకోవడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన పెంపొందించేందుకు రాజకీయ శిక్షణ అవసరమన్నారు. కార్యకర్తలను సమర్థ నాయకులుగా తీర్చిదిద్దడంలో ఇటువంటి శిబిరాలు దోహదపడతాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రాజకీయ శిక్షణా శిబిరాలు నిర్వహించాలని పార్టీ నిర్ణయించిందని వెల్లడించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికుల హక్కులను హరించే విధంగా చట్టాల్లో మార్పులు చేస్తోందని ఆరోపించారు. కేంద్ర పథకాల నిధుల విషయంలో రాష్ట్రాలపై అదనపు భారం మోపుతోందన్నారు.తెలంగాణలో మతోన్మాద రాజకీయాలకు అవకాశం కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రజల మధ్య విభేదాలు సృష్టించే వ్యాఖ్యలు సమాజానికి హానికరమని అన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలపై పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, కరీంనగర్,పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సిపిఐ కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, తాండ్ర సదానందం,మంద సుదర్శన్,చెన్న విశ్వనాథం, సిరిసిల్ల జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు, సిపిఐ వేములవాడ నియోజక వర్గ ఇంచార్జీ కడారి రాములు, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, గోషిక మోహన్,గౌతం గోవర్ధన్,పట్టణ కార్యదర్శి ఎల్ల దేవరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి,సోమ నాగరాజు,మీసం లక్ష్మణ్ , కె.వి.అనసూయ తదితరులు పాల్గొన్నారు.




## కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించిన జగిత్యాల విద్యార్థులు

- విద్యార్థులను అభినందించిన కరీంనగర్ కమీషనర్ ఆఫ్ పోలీస్ గౌస్ అలామ్



**జగిత్యాల, జూన్ 05(మనం న్యూస్):** జగిత్యాల జిల్లా కు చెందిన నలుగురు విద్యార్థులు కరాటే లో సత్తాచాటి బ్లాక్ బెల్ట్ సాధించారు. కరీంనగర్ లోని వివేకానంద రెసిడెన్సియల్ స్కూల్ లో ఒకినావా మార్షల్ ఆరట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పోటీల్లో జగిత్యాల ఒకినావా మార్షల్ ఆరట్స్ అకాడమీ ప్రధాన శిక్షకుడు మర్రిపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ఎస్.చక్రి ,కె. సాయి చరణ్, బి. సౌమిత్ రాజ్, కె. చైతన్య విశేష ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్ట్ కైవసం చేసుకున్నారు. ఒకినావా మార్షల్ ఆరట్స్ అకాడమీ తెలంగాణ డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ చీఫ్ ఎగ్జామినర్ కే వసంత్ కుమార్ బ్లాక్ బెల్ట్ టెస్ట్ నిర్వహించి విద్యార్థులకు బెల్ట్ మరియు సర్టిఫికెట్ లను ప్రధానం చేశారు. బ్లాక్ బెల్ట్ సాధించిన జగిత్యాల విద్యార్థులను కరీంనగర్ కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌస్ అలం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు కరాటే నేర్చుకోవాలని ముఖ్యంగా యువత వ్యసనాలకు అలవాటు కాకుండా క్రీడల వైపు దృష్టి సారించాలని అమ్మాయిలు ఆత్మ రక్షణ విద్య కరాటే తప్పనిసరిగా నేర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్ మరిపెల్లి లింగయ్య, ఎంఏ మన్నన్, అనంతుల కాంతారావు, నరేష్,రాజశేఖర్, సంతోష్,రాము, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల, జూన్ 5 (మనం ప్రతినిధి):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణ కేంద్రంలోని గన్ పార్కో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన మరియు హరిత వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ సూచించారు.పర్యావరణ సమతుల్యాతను కాపాడడంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్న కలెక్టర్, మొక్కల పెంపకం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు జీవ వైవిధ్యాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. జిల్లాలో హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నివారణతో పాటు నేరాలను త్వరితగతిన ఛేదించాలి

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల, జూన్ 05 (మనం న్యూస్):** బక్రీద్, హనుమాన్ జయంతి వేడుకలు ప్రశాంతంగా జరగడానికి పోలీస్ అధికారులు, సిబ్బంది చేసిన కృషి అభినందనీయమని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు.సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి నేరాల నివారణకు ప్రాధాన్యత ఇస్తూనే, జరిగిన నేరాలను త్వరితగతిన ఛేదించి బాధితులకు న్యాయం అందించే విధంగా పోలీస్ అధికారులు, సిబ్బంది పనిచేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ సూచించారు.ఈరోజు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ క్రైమ్ మీటింగ్లో ఆయన పోలీస్ అధికారులతో సమావేశమై వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు.గత నెలలో నమోదైన నేరాలపై సమగ్రంగా చర్చించిన ఎస్పీ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి వాటి సంఖ్యను తగ్గించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా పోక్సో, గ్రేవ్, నాన్-గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి కోర్టుల్లో చార్జీషీట్లు సకాలంలో దాఖలు చేయాలని సూచించారు.మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వారికి నాణ్యమైన, సత్వర సేవలు అందించాల్సిన బాధ్యత పోలీస్ శాఖపై ఉందని పేర్కొన్నారు. అలాగే జిల్లాల మరియు రాష్ట్ర సరిహద్దుల నుంచి వచ్చే గంజాయి సరఫరా మార్గాలను గుర్తించి కీలక వ్యక్తులపై కేసులు నమోదు చేసి అక్రమ రవాణాను కట్టడి చేయాలని ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభలను ఎలాంటి అంతరాయం లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ₹నేరాల నివారణకు ప్రత్యేక చర్యలు₹ సొసైటీ ఫర్ పబ్లిక్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా ప్రతి పట్టణం, కాలనీ, గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాధాన్యతను ప్రజలకు, వ్యాపారులకు వివరించాలని సూచించారు. దొంగతనాల నివారణకు ప్రతి సర్కిల్ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు.భూవివాదాలు, పాత కక్షలతో నేరాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై అవసరమైతే కొత్తగా రౌడీషీట్లు ఓపెన్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, ఎస్బీ డీఎస్పీ వెంకటరమణ, డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, ఇన్స్పెక్టరు, ఎస్.ఐ లు పాల్గొన్నారు.



# సమాజ సేవలో జర్నలిస్టుల పాత్ర వెలకట్టలేనిది



**వేములవాడ, జూన్ 5( మనం న్యూస్):** సమాజాభివృద్ధిలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రజలకు-ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టుల సేవలు అభినందనీయమని రాజన్న సిరిసిల్ల జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బుస్స దశరథం అన్నారు.శుక్రవారం వేములవాడ లోని ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో టీయూడబ్ల్యూజే హెచ్-143 వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులకు ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు బుస్స దశరథం ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీతో పాటు నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా బుస్స దశరథం మాట్లాడుతూ, ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేసే పాత్రికేయుల సేవలు సమాజానికి ఎంతో అవసరమన్నారు.నూతన కార్యవర్గం ఐక్యతతో ముందుకు సాగి జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి అభివృద్ధి కోసం విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నరసయ్య లు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం యూనియన్ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం పాత్రికేయుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ ఆదర్శవంతంగా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బుస్స దశరథం, ప్రధాన కార్యదర్శి జనార్ధన్తో పాటు సంఘం ప్రతినిధులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ అందించిన ప్రోత్సాహం తమపై మరింత బాధ్యతను పెంచిందని, పాత్రికేయుల సంక్షేమం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారు కొత్వాల్ శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు రసూల్, ఉపాధ్యక్షులు చింతలతాడెం దేవరాజ్, విష్ణు, జిల్లా సభ్యులు కంటాల విజయ్, క్యాషియర్ పంపరి నాగరాజు, దెబ్బేటి ప్రవీణ్, సందీప్, ఆర్యవైశ్య మహాసభ సభ్యులు చికోటి అశోక్, బుస్స బుచ్చిబాబు, దైత కుమార్, ఆర్యవైశ్య నాయకులు చేపూరి రవీందర్, చేపూరి గణేష్, వాసవి క్లబ్ గవర్నర్ నరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి అంత్యపుష్కరాలలో విశేష సేవలు అందించిన పోలీసులకు సన్మానం

- ఎస్పీసిరిశెట్టి సంకీర్త్కు మాజీ జెడ్పిటిసి గుడాల అరుణ శ్రీనివాస్ అభినందనలు

**మహదేవ్ పూర్, జూన్ 5 మనం న్యూస్:** సరస్వతి అంతే పుష్కరాలసందర్భంగా భక్తులకు ఎలాంటిఇబ్బందులు కలగకుండా చోటుచేసుకోకుండాప్రవమాదాల నిహారణకు అంకితభావంతోవిధులు నిర్వహించిన జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా పోలీస్ శాఖ అధికారులనుఇబ్బందినిమాజీజెడ్పిటిసిగుడాల అరుణశ్రీనివాసుఅభినందించారు,రాష్ట్రఐటీపరిశ్రమలశాఖ,మంత్రివర్యులు, దుద్దిల్ల శ్రీధర్ బాబుఆదేశాల మేరకు పుష్కరాల నిర్వహణలో పోలీస్ శాఖ కీలకపాత్ర పోషించిందన్నారు తీవ్ర ఎండలు 46 నుండి 45 డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య కూడా పోలీసులు నిరంతరం విధులు నిర్వహించారు అని కొనియాడారు సందర్భంగా జిల్లా పోలీస్ అధికారి ఎస్పీ ఎస్పీ శ్రీ సిరిశెట్టి సంకీర్త్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాల తో సన్మానించి పోలీస్ అధికారులు సిబ్బంది హృదయపూర్వకధన్యవాదాలు తెలిపారు పుష్కరాల విజయవంతమైన నిర్వహణకు పోలీసు శాఖ చేసిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు

## వైద్యుల బదిలీల్లో జీవో 38 అమలు చేయాలి



- ప్రభుత్వ వైద్యుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి

**జగిత్యాల, జూన్ 05 (మనం న్యూస్):** వైద్యుల బదిలీల ప్రక్రియలో ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 38లో పేర్కొన్న నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన టీజీజీడీఏ సమావేశంలో ఆయన మాట్లాడుతూ,ఒక రోజు నిరసన తెలుపుతూ వైద్యసేవలు అందించామని, ప్రస్తుతం కొనసాగుతున్న బదిలీల ప్రక్రియలో పారదర్శకత లోపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో 38లో పొందుపరిచిన అన్ని ప్రమాణాలను కచ్చితంగా అమలు చేస్తూ వైద్యులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ముఖ్యంగా భార్యాభర్తలు ఒకే ప్రాంతంలో లేదా సమీప ప్రాంతాల్లో విధులు నిర్వహించేలా కల్పించే స్పౌస్ ప్రాధాన్యతతో పాటు ఇతర ప్రత్యేక ప్రాధాన్యతా ప్రమాణాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. వైద్యులు సమర్పించిన వినతిపత్రాలను పరిశీలించి అర్హులైన వారికి తక్షణమే బదిలీలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం గుర్తింపు పొందిన తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులకు బదిలీల నుంచి మినహాయింపు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జీవో 38 నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు రాష్ట్ర సంఘం పదాధికారులు ఎవరూ బదిలీలకు సంబంధించిన ఆప్షన్ ఫారాలను సమర్పించవద్దని సమావేశంలో తీర్మానించినట్లు వెల్లడించారు. వైద్యుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే వైద్యసేవలను నిలిపివేసేందుకు కూడా వెనుకాడబోమని డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో టీజీజీడీఏ జిల్లా కోశాధికారి డాక్టర్ జి. నవీన్తో పాటు టీవీవీపీ, మెడికల్ కాలేజీ, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలోని వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాలువల నిర్మాణ పనులను పరిశీలించిన సీఎం



**ఉమ్మడి మహబూబ్ నగర్, జూన్ 5 (మనం బ్యూరో):** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ ప్యాకేజీ-2, ప్యాకేజీ-3 కాలువల నిర్మాణ పనుల పురోగతిని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకాటి శ్రీహరి ముఖ్యమంత్రితో కలిసి కాలువల నిర్మాణ పనులను సందర్శించి, జరుగుతున్న పనుల ప్రగతిపై అధికారులను అడిగి సంక్రుప్తంగా తెలుసుకున్నారు. ప్రాజెక్టు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, పాలమూరు ప్రాంతానికి సాగు, తాగునీటి అవసరాలను తీర్చే లక్ష్యంతో ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్పష్టం వ్యక్తం చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ శాఖ అధికారులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ ప్రాజెక్టులను సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి

**రెండు రోజులుగా విస్తృతంగా పర్యటన చేసిన ముఖ్యమంత్రి, మంత్రులు**

**నార్లాపూర్ రిజర్వాయర్ పూర్తిస్థాయిలో పరిశీలన చేసిన సీఎం**

**రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా 12 లక్షల 30 వేల ఎకరాలకు సాగునీరు**





**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 05 (మనం బ్యూరో):** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా రెండవ రోజైన శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, సహచర మంత్రివర్గ సభ్యులతో కలిసి పలు ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో సందర్శించారు. ముందుగా ముఖ్యమంత్రి కొల్లాపూర్ పట్టణ కేంద్రంలోని రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ ,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నివాసంలో అల్పాహారం తీసుకొన్నారు. అక్కడే స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇతరులు రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిశారు. అనంతరం పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీ -2, 3 హెడ్ రెగ్యులటరీ వద్ద ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను సీఎం తిలకించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఇంజనీర్లు, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి ముఖ్యమంత్రికి పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీ 2, 3 ల గురించి సంపూర్ణంగా వివరించారు. తదనంతరం పి ఆర్ ఎల్ ఐ లో భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్ (అంజనగిరి రిజర్వాయర్) డెలివరీ సిస్టర్ ను ముఖ్యమంత్రి పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నార్లాపూర్ రిజర్వాయర్(అంజనగిరి రిజర్వాయర్) 6. 4 టిఎంసిల సామర్థ్యం కలిగి ఉండగా మొత్తం 8 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు రూపొందించడం జరిగింది. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద మొత్తం 12 లక్షల 30 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు లక్ష్యంగా నిర్ణయించగా, శ్రీశైలం తిరుగుజలాల ద్వారా నీటిని ముందుగా నార్లాపూర్ రిజర్వాయర్ కు, డెలివరీ సిస్టన్స్ ద్వారా నీరు చేరుకున్న అనంతరం అక్కడి నుండి ఇదే ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీ 4,5 లకు పంపించడం జరుగుతుంది. కాగా ఈ పథకం కింద డెలివరీ సిస్టంలో నాలుగు పంపుల ద్వారా ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోసేందుకు నాలుగు పంపులు సిద్ధంగా ఉండగా, మరో నాలుగు పంపులు కూడా నీటి ఎత్తివేతకు సిద్ధంగా ఉన్నాయి. ప్యాకేజీ -2, 3 సుమారు 8.3 కిలోమీటర్లు, ప్యాకేజి -4 16 కిలోమీటర్ల పొడవు కలిగి ఉంది. ప్యాకేజి -5 లో ఉన్న ఏదుల పంప్ హౌస్ కు నీటిని తరలించేందుకు డిజైన్ చేయడం జరిగింది. నార్లాపూర్ రిజర్వాయర్ నుండి ప్యాకేజీ 2 ,3, 4 ద్వారా ఏదుల పంప్ హౌస్ కు సాగునీటిని పంపించడంలో ఉన్న ఇబ్బందులు, ప్రస్తుత పరిస్థితులను రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు. పూర్తి వివరాలను రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి, అధికారులు రాష్ట్ర ముఖ్యమంత్రికి వివరించారు. తదనంతరం ముఖ్యమంత్రి ఎం జి కే ఎల్ ఐ పంప్ హౌస్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రొహిబిషన్ , ఎక్సైజ్ ,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పాడి పరిశ్రమ, క్రీడల అభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ శాసనసభ్యుడు ఏన్నం శ్రీనివాస్ రెడ్డి ,రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి, ఇరిగేషన్ సెక్రటరీ శ్రీధర్, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్, ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ విజయభాస్కర్ రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

# మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా మారాలి

- పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడమే ఆధారం
- ప్రతిజ్ఞ చేయడం కాదు మొక్కలు నాటడం పాటించి చూపాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్
- సాయిల్ హెల్త్ కార్డులు భూమికి, రైతుకు మేలు చేస్తాయి:ఎంపీ
- పంచభూతాలు పర్యావరణం తో ముడిపడి ఉన్నాయి: కలెక్టర్



**సిద్ధిపేట,జూన్ 5 మనం ప్రతినిధి:** ప్రపంచమే ఓ కుగ్రామంగా మారుతున్న ప్రస్తుత సమయంలో పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యతగా స్వీకరించాలని రాష్ట్ర రవాణ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మొక్కలు నాటడం ప్రతి వ్యక్తి సామాజిక బాధ్యతగా మారాలని సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా సిద్దిపేట జిల్లా కొండపాక మండలం మర్పడగ ఆక్సిజన్ పార్కులు మొక్కలు నాటిన అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి తోపాటు ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ కే హైమావతి, సి పి సాధన రష్మీ పెరుమాళ్ పాల్గొన్నారు. గతంలో బహిరంగ ప్రదేశాలలో వివిధ పండ్ల చెట్లు ఉండేవని అవి పూర్తిగా అంతరించిపోవడంతో కోతులు గ్రామాల్లోకి వచ్చి ఇబ్బంది పెడుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఎక్కడ ప్రభుత్వ స్థలం ఉన్నా ఆ స్థలంలో మొక్కలు నాటి సంరక్షించే చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలు నాటి వదిలేయకుండా వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టాలన్నారు. గీత కార్మికుల కోసం కాటమయ్య రక్షణ కవచనాలు ఇచ్చేటప్పుడు తాటి చెట్లు ఈత చెట్లను నాటిస్తున్నట్లు పేర్కొన్నారు. పర్యావరణాన్ని కాపాడడం, ప్రకృతి రక్షణ ప్రతి వ్యక్తి పనిగా, బాధ్యతగా సేకరించాలన్నారు. ప్రతిజ్ఞలకే పరిమితం కాకుండా మొక్కలు నాటి సంరక్షించడం పాటించి చూపాలని మంత్రి పేర్కొన్నారు. గ్రామాలలో మొక్కలు నాటడం ఓ కాంపిటీషన్ గా క్రియేట్ చేసి ముందు వరుసలో ఉన్న వారిని అభినందించాలన్నారు. రాష్ట్రంలో 4 లక్షల ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం అవుతున్నాయని ప్రతి ఇంట్లో మొక్కలు నాటాలని మంత్రి పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో ఐదుగురు సభ్యులతో మొక్కలు నాటే కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఢిల్లీలో కాలుష్యంతో నివసించే పరిస్థితి లేదని అలాంటి పరిస్థితి తెలంగాణకు రాకముందే అప్రమత్తం కావాలని సూచించారు. కాలుష్య నివారణలో భాగంగా దేశంలో ఎక్కడలేని విధంగా 0 టాక్స్ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం లో 280 మహిళా సంఘాలకు 13 రకాల వస్తువులు గవర్నర్ గారి చేతుల మీదుగా స్టీల్ బ్యాంక్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. 500 హోటల్స్ కు గ్లాసులు పంపిణీ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. ₹ప్లాస్టిక్ పూర్తిగా నిషేదించాలి₹ ప్రతి ఇంటి నుండి ప్లాస్టిక్ నిషేధం 100% అమలు కావాలని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడడం వల్ల క్యాన్సర్ లాంటి వ్యాధులు వస్తున్నాయని పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా పచ్చదనం కూడా పెరగాలన్నారు. సాయిల్ హెల్త్ కార్డు వలన భూసారాన్ని పరిరక్షించి భూములకు మేలు చేసే చర్యలు తీసుకోవచ్చు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సాయిల్ హెల్త్ కార్డులు రైతులందరికీ అందాలన్నారు. పంట మార్పిడి చేపట్టాలని మిల్లెట్స్, పప్పు, నూనె దినుసులు సాగు చేయాలన్నారు. మెదక్ నుండి ఎలుకతుర్తి జాతీయ రహదారిపై లక్ష మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ₹17 లక్షల మొక్కలు నాటే లక్ష్యం₹ కలెక్టర్ హైమావతి పంచభూతాలు పర్యావరణంతో ముడిపడి ఉంటాయని పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా 33 శాతం పచ్చదనాన్ని పునరుద్ధరించవలసిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ హైమావతి పేర్కొన్నారు. గత సంవత్సరం జిల్లాలో 20 లక్షల మొక్కలు నాటగా ఈ సంవత్సరం 17 లక్షల మొక్కలు నాటేందుకు నర్సరీ లలో సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. అంతకుముందు మంత్రి పొన్నం మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షించడానికి చెట్టు విలువ తెలుసా అనే పోస్టర్ ను ఆవిష్కరించారు.

ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి, అదనపు డిసిపి సుభాష్ చంద్రబోస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రం, స్థానిక సర్పంచ్ బాలరాజ్, రవీందర్ సిబ్బంది పాల్గొన్నారు.

# నీటి నిల్వ చెరువును ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**కామారెడ్డి, జూన్ 5 ( మనం ప్రతినిధి):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా ఐడిఓసీ ప్రాంగణంలో డియంయఫ్సి (టీ) నిధుల ద్వారా నిర్మించిన నీటి నిల్వ చెరువును జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు , పర్యావరణ పరిరక్షణకు నీటి నిల్వ చెరువులు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో వర్షపు నీటిని సద్వినియోగం చేసేందుకు ఇటువంటి చర్యలు చేపట్టడం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. డియంయఫ్సి (టీ) నిధుల నుంచి రూ.6.55 లక్షల వ్యయంతో ఈ నీటి నిల్వ చెరువును నిర్మించినట్లు తెలిపారు. వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాల మట్టాన్ని పెంచడంతో పాటు పర్యావరణ సమతుల్యతకు ఇది ఉపయోగపడుతుందని కలెక్టర్ వివరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ నీటి నిల్వ చెరువు పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చెరువు చుట్టూ పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. పరిసరాలను పచ్చదనంతో అభివృద్ధి చేయడం ద్వారా కలెక్టరేట్కు వచ్చే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. నీటి నిల్వ చెరువు పరిసర ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దితే భవిష్యత్తులో బతుకమ్మ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, వేడుకలను కూడా ఇక్కడ నిర్వహించుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జి అదనపు కలెక్టర్ ఎన్వి గిరి, డిఆర్డివో దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నష్టం జరగకుండా తడిసిన వరిని వెంటనే తరలించాలి



- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి, జూన్ 5 ( మనంప్రతినిధి):** అకాల వర్షాల కారణంగా ఈ నెల 5వ తేదీ వరకు పూర్తికావలసిన కొనుగోలు ప్రక్రియ 10వ తేదీలోగా కొనుగోలు ప్రక్రియను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కామారెడ్డి డివిజన్లో గురువారం కురిసిన భారీ వర్షాల కారణంగా సుమారు 800 మెట్రిక్ టన్నుల వరి తడిసిపోవడంతో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం అదనపు కలెక్టర్ విక్టర్ తో కలిసి రామేశ్వర్పల్లి ప్యాడీ పర్చేజ్ సెంటర్ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన కలెక్టర్, రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా తడిసిన వరిని వెంటనే తరలించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ధాన్యం తరలింపులో జాప్యం జరగకుండా తగిన సంఖ్యలో వాహనాలను ఏర్పాటు చేసి తడిసిన వరిని అత్యవసరంగా రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా మేనేజర్ శ్రీకాంత్ , జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, డీసీవో రామ్మోహన్ రావు, సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం సిద్ధిరామేశ్వర రైస్ మిల్లులో ఆరు పారా బాయిల్ రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. తడిసిన వరిని వెంటనే అన్లోడ్ చేసి స్వీకరించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పూర్తి సహకారం అందించాలని సూచించారు. తమ సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యాన్ని అన్లోడ్ చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన 14 మంది రైస్ మిల్లర్ల పై జిల్లా కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియకు సహకరించని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోందని, ప్రస్తుత తేదీ నాటికి జిల్లాలో మొత్తం 4,19,000 మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం వారి ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసి సకాలంలో తరలించేందుకు అన్ని చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# వేగంగా ధాన్యం కొనుగోలు జరగాలి



- పక్కగా జనగణన జరగాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**హైదరాబాద్, జూన్ 5(మనంన్యూస్):** వేగంగా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నర్సింగ్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని , జన గణనను డిఎంసిఎస్, డిఎస్ఓ, ఆర్డిఓ, తాహాసిల్దార్, జన గణన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. అత్యంత వేగంగా ధాన్యం కొనుగోలు జరగాలని, ధాన్యం పూర్తి అయిన కేంద్రాల్లోని సిబ్బంది, వాహనాలు , వస్తు సామాగ్రిని, హమాలిలను ధాన్యం నిలువ ఉన్న కేంద్రాల్లో పని చేయించాలన్నారు. మిల్లులో అతి త్వరగా ధాన్యం అన్లోడింగ్ జరగాలని అధికారులను ఆదేశించారు. జన గణన పక్కగా చేయాలన్నారు. జన గణన లో ప్రజల యొక్క సమాచారం పక్కగా నమోదు చేసి ఆన్లైన్ ఆప్ లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# మాన్సూన్ సీజన్కు పోలీస్ శాఖ అప్రమత్తం

- ప్రకృతి వైపరీత్యాల సమయంలో వేగంగా స్పందించాలి
- పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య



**నిజామాబాద్, జూన్ 5 (మనం బ్యూరో):** రాబోయే మాన్సూన్ సీజన్ను దృష్టిలో ఉంచుకుని భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, చెరువులు, వాగులు పొంగిపొర్లడం, రహదారులు దెబ్బతినడం, చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడం వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో పోలీస్ శాఖ చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించాల్సిన విధానంపై శుక్రవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య మాట్లాడుతూ., ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వరదలకు గురయ్యే లోతట్టు ప్రాంతాలు, ప్రమాదకర వంతెనలు, వాగులు, చెరువులు, కాలువలు, జలాశయాలు, శిథిలావస్థలో ఉన్న పాత భవనాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల సమయంలో ట్రాఫిక్ అంతరాయం కలిగే ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించాలని, వరద నీటిలో ప్రజలు, వాహనాలు ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు ప్రతి పోలీస్ స్టేషన్లో ప్రత్యేక రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచాలని, లైఫ్ జాకెట్లు, రోపులు, టార్చిలైట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్, కమ్యూనికేషన్ పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. అలాగే రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక, వైద్య, విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు, భద్రతా సూచనలు అందించాలని, తప్పుడు ప్రచారాలు, వదంతులను వెంటనే ఖండిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేస్తూ అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 24 గంటల పాటు అందుబాటులో ఉండాలని, అత్యవసర సమాచారం అందిన వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్ ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి, మల్లేష్, సీసీఆర్బీ ఇన్స్పెక్టర్ అంజయ్య, పీసీఆర్ ఇన్స్పెక్టర్ వీరయ్య, సీఐలు, ఎస్హెచ్వోలు, ఐటీ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలానికి ముందే జాతీయ రహదారి-65పై పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి, జూన్ 5 మనం ప్రతినిధి:** జాతీయ రహదారి-65పై సంగారెడ్డి నుండి పటాన్‌చెరు వరకు కొనసాగుతున్న రోడ్డు విస్తరణ, నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులు, వాటర్ లాగింగ్ పాయింట్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ స్తంభాల తరలింపు, నీటి పైప్లైన్ల షిఫ్టింగ్, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గత ఏడాది ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న బ్లాక్ స్పాట్ల వద్ద తాత్కాలిక భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు, రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీలపై స్లాబులు ఏర్పాటు చేసి మూసివేయాలని చెప్పారు. అవసరమైన చోట వాటర్ పైప్లైన్లను వెంటనే షిఫ్ట్ చేయడంతో పాటు ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని జాతీయ రహదారి అధికారులకు సూచించారు. రోడ్డు విస్తరణ పనులకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తక్షణమే తరలించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించిన కలెక్టర్, యుటిలిటీల షిఫ్టింగ్ పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. అలాగే రోడ్డు విస్తరణకు ప్రభావితమవుతున్న నివాస భవనాల యజమానులకు పరిహారం చెల్లించి తొలగింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, రహదారికి ఇరువైపులా ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా మున్సిపల్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సౌకర్యం, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెద్దాపూర్ పట్నం డాబా ఎదురుగా ఉన్న కల్వర్టును పరిశీలించిన కలెక్టర్, వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా కల్వర్టు వెంట్లను ముందుగానే శుభ్రపరిచి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీలు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ రఘువీర్, ఆర్ అండ్ బీ అధికారులు, జాతీయ రహదారుల డీఈఈ రామకృష్ణ, ఈఈ శ్రవణ్ ప్రకాష్, జీఎం రమేష్, ఆర్కేసీపీఎల్ కాంట్రాక్టర్ జయప్రకాష్, సంగారెడ్డి, ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్లు, డీఎస్పీలు, ఆర్డీఓ,తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# సగం సన్న రకం సాగు జరగాల్సిందే



- వరి సాగు పై జిల్లా యంత్రాంగం కసరత్తు
- రైతుల్లో సన్న రకాల సాగుపై అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు

**సిద్దిపేట, జూన్ 5 (మనం ప్రతినిధి):** వానకాలం సీజన్లో వరి సాగు విస్తీర్ణంలో సగ భాగం సన్నారకాల వరి రకాలు సాగు జరగడానికి రైతుల్లో అవగాహన కోసం జిల్లా యంత్రాంగం ముమ్మరంగా చర్యలు చేపట్టింది. యాసంగిలో దొడ్డు రకాల కొనుగోళ్లలో ఏర్పడిన సందిగ్ధత పునరావృతం కాకుండా రైతులను సన్న రకాల సాగుపై దృష్టిసారించేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులకు సూచనలు చేస్తూ వరి విత్తనాల అమ్మకాల కేంద్రాల్లో 50% సన్న వడ్ల రకాలు అమ్మేలాగా చూడాలని సిద్దిపేట కలెక్టర్ హేమావతి సూచనలు చేశారు. గ్రామ, రైతుసభలు నిర్వహించి సన్న రకాల సాగుకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు. వరి సాగు పదేపదే చేపట్టడంతో భూసారం తగ్గుతుందని పంట మార్పిడి వైపు రైతులను ప్రోత్సహించాలన్నారు. ముఖ్యంగా వాణిజ్య పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ ఫామ్ సాగుపై రైతులు దృష్టి పెట్టే విధంగా చూడాలన్నారు. వానకాలం సన్న రకాలపై రైతులు ఆసక్తి చూపుతున్నప్పటికీ మరింత సాగు విస్తీర్ణం పెరిగే విధంగా ప్రభుత్వం రైతుల్లో అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తుంది.


## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 05 (మనంప్రతినిధి):** అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చుంచుపల్లి మండలం రుద్రంపూర్ వి. కే. సి. ఏం ప్రాంతంలో మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని అన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే పచ్చద నాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్ష ణపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, జిల్లా అటవీ అధికారి కృష్ణ గౌడ్ తదితరులు కలెక్టర్తో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సింగరేణిలో పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత

## సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ




**కొత్తగూడెం సింగరేణి, జూన్ 5(మనం న్యూస్):** సింగరేణి సంస్థ దేశ ఇంధన అవసరాలను తీర్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్)ఎల్.వి.సూర్యనారాయణ అన్నారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ సింగరేణిలో విస్తృత స్థాయిలో హరితీకరణ చేపట్టడం జరుగుతుందన్నారు. మైనింగ్ కార్యకలాపాల వల్ల గాలి నీరు భూ వనరులపై ప్రభావాలను పర్యవేక్షించి ఆధునాతన సాంకేతికతల ద్వారా వివిధ కాలుష్య నియంత్రణ చర్యలను అమలుపరచడం జరుగుతోందని తెలిపారు. గనుల మూసివేత సమయంలో గని ప్రరిసర ప్రాంతాలలో ఓబి డంపులపై మొక్కలను నాటుతున్నామని పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఇప్పటి వరకు 16,790 హెక్టార్ల ప్రాంతంలో 6.68 కోట్ల మొక్కలు నాటడం అలాగే సమీప గ్రామస్తులకు 2.32 కోట్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేయటం జరిగిందని తెలిపారు. నీటి సంరక్షణ ప్రయత్నాలలో భాగంగా నీటిపారుదల గృహ వినియోగం కోసం గని నుండి బయటకు తీసిన నీటిని శుద్ధి చేసి అందించడం జరుగుతోందని అన్నారు. పర్యావరణ బాధ్యతతో చుట్టుపక్కల గ్రామాలలో వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతల నిర్మాణాలు 25కి పైగా చేయడం జరిగిందన్నారు. సాగు నీటి చెరువులలో పూడికతీత చెక్ డ్యామ్ ల నిర్మాణం అర్బన్ పార్కుల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. దీంతో పాటుగా భూగర్భ జలాలను మెరుగుపరచడానికి గనుల ఆవరణలో సుమారుగా 62 నీటి ట్యాంకులు తవ్వడం జరిగిందని తెలిపారు. డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్)కే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మానవ ఉనికిని కాపాడటానికి ప్రతి ఒక్కరూ విధిగా చెట్లను పెంచి పర్యావరణం కాపాడటం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. డైరెక్టర్(ఈ అండ్ఎం) ఎం.తిరుమలరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. ఇప్పటివరకు 245.50 ఎండబ్ల్యూ సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కొరకు సింగిల్ యుజ్డ్ ప్లాస్టిక్ ల వాడకాన్ని నివారించటానికి జ్యూట్ బ్యాగులను అందించారు. వన మహోత్సవం కార్యక్రమాలలో భాగంగా ఎన్విరాన్మెంట్ అండ్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ కొత్తగూడెం బంగ్లాస్ లో ఏర్పాటు చేసిన మొక్కలను నాటే కార్యక్రమంలో డైరెక్టర్లు పాల్గొన్నారు. జీఎం(ఎన్విరాన్మెంట్ అండ్ ఫారెస్ట్) బి.సైదులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జీఎం(సిపిపి)ఏ.మనోహర్, అడ్వైసరీ(ఫారెస్ట్)ఎం.సి. ఎం.సి.పార్థిన్, గుర్తింపు సంఘం(ఏఐటియూసి) సెంట్రల్ సెక్రటరీ వంగా వెంకటేశ్వర్లు, ప్రాతినిధ్య సంఘం(ఐఎన్టియూసి )సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సి.త్యాగరాజన్, కార్పొరేట్ కార్పొరేట్ సిఎంఓఏఐ ఉపాధ్యక్షుడు కేశవ రావు, కార్పొరేట్ పరిధిలోని వివిధ శాఖల జనరల్ మేనేజర్లు, వివిధ శాఖల అధిపతులు, యూనియన్ నాయకులు, ఎన్విరాన్మెంట్ అండ్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు ఉద్యోగులు, ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలపై మౌనం ఎందుకు..?

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: బీఎస్పీ జోన్ ఇన్చార్జ్ తాండ్ర వెంకటేశ్వర్లు





**చుంచుపల్లి, జూన్ 5(మనం న్యూస్):** చుంచుపల్లి మండలంలో ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా రైతులపై జరుగుతున్న అన్యాయాలపై జిల్లా సహకార అధికారి మౌనం వహించడం పట్ల బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) జోన్ ఇన్చార్జ్ తాండ్ర వెంకటేశ్వర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి వెన్నుముక రైతన్న' అని చెప్పుకునే పరిస్థితులు ఉన్నప్పటికీ, చుంచుపల్లి మండలంలో రైతుల పట్ల వ్యవహరిస్తున్న తీరు ఆ నానుడికి విరుద్ధంగా ఉందని ఆయన విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ప్రభుత్వం చెల్లిస్తున్నప్పటికీ, రైతుల వద్ద నుంచి వివిధ పేర్లతో డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోళ్లలో క్వింటాకు 8 కిలోల చొప్పున తరుగు పేరుతో డబ్బులు వసూలు చేయడం, ఇతర పరికరాల ఖర్చుల పేరుతో ఫోన్పే ద్వారా నగదు తీసుకోవడం, అలాగే ప్రభుత్వం హమాలీలకు చెల్లించే కూలీ ఉన్నప్పటికీ రైతుల వద్ద నుంచి క్వింటాకు రూ.80 చొప్పున అదనంగా వసూలు చేయడం వంటి ఆరోపణలపై వెంటనే సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.రైతుల నుంచి తరుగు, హమాలీ మరియు ఇతర పేర్లతో వసూలు చేసిన మొత్తాన్ని వెంటనే తిరిగి చెల్లించాలని, ఈ వ్యవహారంలో బాధ్యులైన అధికారులపై, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సంబంధిత ఘటనపై జిల్లా యంత్రాంగం, సహకార శాఖ అధికారులు క్షుణ్ణంగా విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని, లేకపోతే సహకార సంఘం సొసైటీ కార్యాలయం ఎదుట బీఎస్పీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ధర్నా, దీక్షలు చేపడతామని తాండ్ర వెంకటేశ్వర్లు హెచ్చరించారు.

# పరిశ్రమల అభివృద్ధికి మార్గదర్శకులుగా వ్యవహరించాలి

## అధికారులతో కలెక్టర్ అంకిత్ సమీక్ష



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 05 (మనంప్రతినిధి):** జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం, ఉపాధి అవకాశాల పెంపు లక్ష్యంగా జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాల అమలు, ఉపాధి కల్పన కార్యక్రమాల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి అధికారులు మార్గదర్శకులుగా వ్యవహరించాలని సూచించారు. యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన సలహాలు, సహాయ సహకారాలు అందించి కొత్త పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం కల్పించాలని అన్నారు. పరిశ్రమల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ సబ్సిడీలు, ప్రోత్సాహక పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల అభివృద్ధి కోసం వైటీసీ, పాలిటెక్నిక్ మరియు ఇతర సాంకేతిక విద్యా కోర్సులపై విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నూతన కోర్సుల వివరాలతో కూడిన కరపత్రాలను అందుబాటులో ఉంచి విద్యార్థులను ప్రోత్సహించాలని అన్నారు. సమావేశంలో భాగంగా టీజీఐపాస్(టిజిఐ పాస్) ద్వారా పరిశ్రమల స్థాపనకు అందిన దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. మొత్తం 50 దరఖాస్తులు అందగా, వాటిలో 39 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసినట్లు అధికారులు కలెక్టర్కు వివరించారు. ఒక దరఖాస్తు తిరస్కరించగా, మిగిలిన దరఖాస్తులు వివిధ దశల్లో పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల సేవా రంగ సంస్థలకు పెట్టుబడి రాయితీ పథకం అమలు, దరఖాస్తుల స్థితిగతులపై కూడా చర్చించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. క్లస్టర్ అభివృద్ధి, స్థానిక వనరుల ఆధారిత పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాల పురోగతిపై కూడా సమీక్ష నిర్వహించారు. యువతకు మరింత ఉపాధి అవకాశాలు కల్పించేలా ఉద్యోగ మేళాలను విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. పరిశ్రమల సంఖ్యను పెంచి జిల్లాను పారిశ్రామికంగా మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. సమావేశంలో డేవిడ్ రాజు ఏపీఓ జనరల్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ఎల్ డి ఎం రామిరెడ్డి, మెప్మా పీడీ రాజేష్, జిల్లా క్రీడా శాఖ అధికారి పరంగామ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి!!

**దమ్మపేట, జూన్ 05 (మనం న్యూస్):** దమ్మపేట కోర్టు ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణంలో దమ్మపేట జడ్జి బొమ్మతి భవాని ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మొక్కల వల్ల మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని, అలాగే ఆక్సిజన్ ఇవ్వడంలో మొక్కలు ప్రధాన పాత్ర పోషిసాయని, ప్రతి ఒక్కరూ నాటాలని,ప్రతి వారు పర్యావరణ పరిరక్షణకై కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడైన గొంది మురళీమోహన్, న్యాయవాదులు మారం సతీష్ కుమార్, నల్లపు ఉదయ్ కుమార్, కాలం సంధ్యారాణి, గోళ్ళ భవాని కృష్ణ యాదవ్, టీ అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.


# ఖమ్మం రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనుల్లో జాప్యం

### ఎంపీ రఘురాం రెడ్డి అసంతృప్తి

### యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

### స్టేషన్ ఆవరణలో పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన రామసహాయం



**ఖమ్మం, జూన్ 5(మనం బ్యూరో):** జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనుల తీరుపై ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. అనుకున్న స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదని, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం రైల్వే స్టేషన్కు చేరుకున్న ఎంపీ.. సుమారు గంటన్నర పాటు స్టేషన్ ఆవరణలో జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించారు.

**క్షేత్రస్థాయిలో తనిఖీ..**

ఎస్కలేటర్ను ఆన్ చేయించి రెండో ప్లాట్ఫామ్కు చేరుకొని దాని పనితీరును గమనించారు. అక్కడ జరుగుతున్న నిర్మాణాలను చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ మేనేజర్ కార్యాలయానికి వెళ్లి, నిర్మాణాలకు సంబంధించిన మ్యాప్లను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..ఆధునీకీకరణ పనులు ఆశించిన వేగంతో జరగడం లేదని అన్నారు. పెండింగ్లో ఉన్న పనులను వెంటనే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**ప్రయాణికులకు ఇబ్బందులు రానీయొద్దు..**

వర్షాకాలం సమీపిస్తుండటంతో అసంపూర్తిగా ఉన్న పనుల వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రణాళికాబద్ధంగా పనులను పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షులు దీపక్ చౌదరి, నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టీపీసీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ బాయ్, సత్యనారాయణ రెడ్డి, చల్లా రామకృష్ణారెడ్డి, మొగిలిచర్ల సైదులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## నేడు బూర్గుపేటలో ప్రజా దర్బార్ కార్యక్రమం

### జిల్లా కలెక్టర్ బోర్డడే హేమంత్ సహదేవరావు



**ములుగు, జూన్ 5, మనం ప్రతినిధి:** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను స్థానికంగానే తెలుసుకొని పరిష్కరించే విధంగా గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్డడే హేమంత్ సహదేవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటాపూర్ మండలం బూర్గుపేట గ్రామంలో ఆశ్రమ పాఠశాలలో శనివారం ఉదయం 8:30 గంటలకు,రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సమక్షంలో వెంకటాపూర్ మండలంలోని బూర్గుపేట గ్రామంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, రెండు గ్రామాల పరిధిలోని ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ, డీఎఫ్ఓ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్డీఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖల ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సేవలు మెరుగుపడాలి

- **టీపీసీ సమావేశంలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి**



**ఖమ్మం, జూన్ 5(మనం బ్యూరో):** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ (ఆఖ్రిఖె) తన సేవలను మరింత వేగవంతం చేయాలని, ముఖ్యంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం అంతరాయం లేని సిగ్నల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ భవన్లో ఏర్పాటు చేసిన టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రతో కలిసి ఆయన సమీక్షించారు.

**సేవల్లో నాణ్యత పెరగాలి..**

ఈ సందర్భంగా మాట్లాడుతూ...మారుతున్న కాలానికి అనుగుణంగా బీఎస్ఎన్ఎల్ సాంకేతికతను అప్గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. 'ప్రభుత్వ రంగ సంస్థగా సామాన్యులకు భరోసానిచ్చే సేవలను అందించడం మన బాధ్యత. బ్రాడ్బ్యాండ్ సేవలను మారుమూల గ్రామాలకు విస్తరించడంతో పాటు, వినియోగదారుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా వ్యవస్థను బలోపేతం చేయాలి' అని సూచించారు.

**సమస్యల పరిష్కారమే లక్ష్యం**

టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుల నుంచి పలు సూచనలను స్వీకరించాక సిగ్నల్ సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, యుద్ధప్రాతిపదికన కొత్త టవర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నెట్వర్క్ విస్తరణలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించేందుకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

**సంస్థ బలోపేతం అందరి బాధ్యత**

బీఎస్ఎన్ఎల్ పునరుజ్జీవనానికి అధికారులు మరింత అంకితభావంతో పనిచేసి కస్టమర్ల నమ్మకాన్ని గెలవాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ సంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా, అత్యంత తక్కువ ధరలో నాణ్యమైన సేవలను ప్రజలకు అందించడమే మన ముందున్న ప్రధాన లక్ష్యం కావాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, యాసా వెంకటేశ్వర్లు, ఇమామ్ బాయ్, సత్యనారాయణ రెడ్డి, రంజిత్ నాయక్, కనకరాజు, మచ్చా రామారావు, రామ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలి

### కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశంలో

### ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న



**దమ్మపేట, జూన్ 05 (మనం న్యూస్) :** అశ్వారావుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని అశ్వారావు పేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న పేర్కొన్నారు. సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్లు గ్రామ పంచాయతీ కోఆర్డినేటర్లు సోషల్ మీడియా ప్రతినిధులతో దమ్మపేట మండలం పట్వారిగూడెం గ్రామంలోని చెలికాని ఆదెమ్మ ఫంక్షన్ హాల్ నందు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వారితో పాటు ముఖ్య అతిథులుగా ఆత్మకమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు,సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్, ట్రాన్స్పోర్ట్ అథారిటీ కమిటీ మెంబర్ పెట్టం నవీన్,సోషల్ మీడియా స్టేట్ సెక్రటరీ కంటోన్మెంట్ హనుమాన్ టెంపుల్ డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, మహబూబాబాద్ కౌన్సిలర్ అంబాల శివకుమార్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి ఖమ్మం పార్లమెంట్ ఇన్చార్జ్ వీరాపురం రామలక్ష్మణ్, హాజరై పార్టీ బలోపేతానికి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధించిన రోజువారీ స్థానిక అంశాలు ప్రజా సమస్యలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి పనులను ప్రజలకు సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా చేరవేయాలని సూచించారు. అలాగే టీపీసీసీ, ఏఐసీసీ కార్యక్రమాలు స్థానిక నాయకుల పర్యటనలు ప్రజా సమావేశాలు పార్టీ కార్యకలాపాలను ప్రజలకు చేరేలా రీల్స్ వీడియోలు గ్రాఫిక్స్ ల ద్వారా ప్రజల అభిప్రాయాలతో కూడిన కంటెంట్ను నిరంతరం రూపొందించి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. వాట్సాప్ నెట్వర్కును మరింత బలోపేతం చేయడంలో భాగంగా మండలాల వారీగా బూత్ స్థాయిలో కమ్యూనికేషన్ గ్రూపులను ఏర్పాటు చేసి ప్రతి రోజూ పార్టీ సమాచారాన్ని క్రమబద్ధంగా ప్రజలకు చేరవేయాలని సూచించారు. ప్రతి సందేశం వాస్తవాల ఆధారంగా ఉండాలని విశ్వసనీయతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. తప్పుడు ప్రచారాలు దుష్ప్రచారాలను వెంటనే గుర్తించి వాస్తవ నిర్ధారణ చేసి ప్రజలకు సరైన సమాచారం అందించాలని నాయకులు సూచించారు. ముఖ్యమైన అంశాలపై వెంటనే ఉన్నత స్థాయి నాయకత్వానికి సమాచారం అందించే విధానాన్ని పాటించాలని తెలిపారు.

సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు. అలాగే సోషల్ మీడియా ప్రతినిధులకు ప్రభావవంతమైన పోస్టుల తయారీ వీడియో ఎడిటింగ్ గ్రాఫిక్ డిజైన్ సోషల్ మీడియా చేరిక పెంపు కృత్రిమ మేధస్సు (ఏ ఐ) ఆధారిత కంటెంట్ తయారీ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాబోయే 30 రోజులలో అశ్వారావుపేట నియోజకవర్గ సోషల్ మీడియా నెట్వర్కును విస్తరించడం మండల,బూత్ స్థాయి బృందాలను మరింత బలోపేతం చేయడం సోషల్ మీడియా ఫాలోవర్ల సంఖ్య ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం ప్రతిరోజూ కంటెంట్ పోస్టింగ్ నివేదికల సమర్పణను కచ్చితంగా అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు ప్రజాసమస్యల పరిష్కారం ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషించాలని నాయకులు పిలుపునిచ్చారు. సోషల్ మీడియాకు సంబంధించిన అధికారిక అన్ని వెబ్సైట్లను సమర్థవంతంగా నిర్వహించాలని కోఆర్డినేటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఐదు మండలాల అధ్యక్షులు మహిళా అధ్యక్షులు సర్పంచులు ప్రజాప్రతినిధులు అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా

కరీంనగర్ జూన్ 5 (మనం బ్యూరో): స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ చిత్రమిశ్రా అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదామును శుక్రవారం జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఎలక్షన్ సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా మాట్లాడుతూ ఈవియం గోదాం వద్ద అప్రమత్తంగా ఉండాలనీ సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గనిర్ధేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోడౌన్ లను క్షుణ్ణంగా తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం ల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోడౌన్ వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈవియం గదులను వి వి ప్యాట్ స్టోరేజీ విధానాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ అదరపు కలెక్టర్ డి శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎన్, వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మడుపు మోహన్ ,బిఆర్ ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్ , సిపియం పార్టీ ప్రతినిధి డి, నరేష్ పటేల్, ఏఐఎంఐఎం పార్టీ ప్రతినిధులు సయ్యద్ ఇబ్రహీం, మాజిద్ హుస్సేన్, బిజెపి పార్టీ ప్రతినిధి బి సాయికృష్ణ ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## గోదావరి ముంపుతో ప్రమాదం



- గోదావరి ముంపుతో ప్రమాదం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు

ములుగు,జూన్ 5మనం ప్రతినిధి : ఏటూరునాగారం (రాంనగర్ బ్రిడ్జి)గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ అత్యంత నాణ్యతతో నిర్మించిన రాంనగర్ బ్రిడ్జి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అశాస్త్రీయంగా చేపడుతోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ఉల్లంఘన మూడేళ్ల క్రితం కేసీఆర్ నిర్మించిన ఈ బ్రిడ్జికి, మురుము పోయాల్సిన సరైన ప్రదేశంలో కాకుండా అడ్డగోలుగా మట్టి పోస్తూ నాణ్యతను దెబ్బతీస్తున్నారు. దీనివల్ల బ్రిడ్జి కుంగిపోయే ప్రమాదం ఉంది. గోదావరి ముంపు ముప్పు ఈ ప్రాంతం గోదావరి ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. వరదలు వచ్చినప్పుడు ఈ మట్టి కొట్టుకుపోయి బ్రిడ్జి పునాదులు బలహీనపడతాయి. మంత్రి సీతక్క అశాస్త్రీయ పనులపై ఎందుకు మౌనంగా ఉంటున్నారో, ప్రజాధనం వృధా అవుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదో సమాధానం చెప్పాలి. రైతుల ఆవేదన ఒకపక్క బ్రిడ్జి పనుల్లో లోపాలు ఉంటే, మరోపక్క కొనుగోలు కేంద్రాల్లో రైతులు పోసిన ధాన్యం సకాలంలో కొనకపోవడం వల్ల వర్షానికి తడిసిపోతోంది. కనీస రక్షణ చర్యలు లేక అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి వద్ద అడ్డగోలుగా మట్టి పోసే పనులను తక్షణమే నిలిపివేసి, శాస్త్రీయంగా పనులు చేయాలి. తదితర కొనుగోలు కేంద్రాల్లో తడిసిపోతున్న ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే తూకం వేసి రైతులను ఆదుకోవాలి.లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజలు, రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# వట్టెం పంప్ హౌస్ మూడో లిఫ్ట్‌ను సందర్శించిన సీఎం

### 2023 నుంచి నేటి వరకు రూ.800 కోట్లు ప్రాజెక్టుల పని కోసం కేటాయింపు

### గత రెండు రోజులపాటు సీఎం ఉమ్మడి జిల్లాలో సుదీర్ఘ పర్యటన



ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 05 (మనం బ్యూరో): ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను రెండు రోజులపాటు పరిశీలించేందుకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లాలోని కుమ్మెర గ్రామం వద్ద ఉన్న వట్టెం పంపు హౌస్ మూడో లిఫ్టును సందర్శించారు. ఎస్ జె ఆర్ పిఆర్ఎల్ఐఎస్ ( పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్) లో భాగంగా చేపట్టిన ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

2020- 2023 సంవత్సరం నాటికి రూ. 3300 కోట్లు ప్రాజెక్టుకు ఖర్చు చేయగా, 2023వ. సంవత్సరం నుంచి ఇప్పటివరకు రూ. 800 కోట్లను ఖర్చుచేసి ప్రాజెక్ట్ పనులను కొనసాగించడం జరిగిందన్నారు. పెండింగ్ లో ఉన్న మిగతా సివిల్ పనులను రూ.90 కోట్లతో వచ్చే మూడు నెలల్లో పూర్తి చేయనున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఇక్కడ మొత్తం 10 పంపులు ఉండగా 5 పంపులను ఫిట్ చేసి ట్రయల్ రన్ ను విజయవంతంగా నిర్వహించామన్నారు. వర్షాకాలంలో నీళ్లు రాగానే వెంకటాద్రి రిజర్వాయర్ కు ఎత్తిపోతల ద్వారా నీటిని తరలిస్తామన్నారు. ఈ రిజర్వాయర్ సామర్థ్యం మొత్తం 16.74 టీఎంసీలు కాగా స్టాండర్డ్ ఆపరేషన్ సిస్టం ద్వారా విడతల వారీగా రిజర్వాయర్ ను నింపడం జరుగుతుందన్నారు. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా మొత్తం 12 లక్షల ముప్పై వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. అలాగే మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ప్రజలకు తాగునీటికి, పరిశ్రమలకు కూడా నీళ్లు అందుతాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తి అయితే ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి త్రాగునీటి రంగంలో ముందంజలో ఉంటుందని సీఎం అన్నారు.

## కరీంనగర్ జిల్లాలో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం

### రైతులు ఆందోళన చెందవద్దు . ప్రతి గింజ కొనుగోలు చేస్తాం

### జిల్లా కలెక్టర్,సివిల్ సప్లయ్ కమిషనర్‌తో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్ జూన్ 5(మనం బ్యూరో): కరీంనగర్ జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పురోగతిపై తడిసిన ధాన్యం కొనుగోలు అంశాలపై కలెక్టర్ చిత్రా మిశ్రా మరియు సివిల్ సప్లయ్స్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలతో మంత్రి ఫోన్లో సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 317 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు 261 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయని, మిగిలిన కేంద్రాల్లో ఉన్న సుమారు 9,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలోని 16 మండలాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో 8 మండలాల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన మండలాల్లో కూడా వేగవంతంగా కొనుగోళ్లు పూర్తి చేయాలని సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోనకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని మంత్రి పేర్కొన్నారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, తడిసిన ధాన్యం విషయంలో కూడా రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. 'ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం' అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులకు ఖండన

- నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాపేటలో నిరసన

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. 2వ రోజు పాలమూరు ప్రాంత పర్యటనకు ముందే నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాపేటలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకబడిన పాలమూరు జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ సందర్భంగా నిరసనకారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి, 'సీఎం డౌన్ డౌన్' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సీఎం పర్యటనకు ముందే బీఆర్ఎస్ ముఖ్య నేతలను పోలీసులు అక్రమంగా ముందస్తు అరెస్టులు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. వేలాది మంది పోలీసుల రక్షణ నడుమ, భారీ బందోబస్తు మధ్య ముఖ్యమంత్రి పాలమూరు ప్రాజెక్టులను సందర్శించాల్సి రావడం సిగ్గుచేటని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు విమర్శించారు. 'ప్రభుత్వానికి పాలమూరు అభివృద్ధిపై నిజంగానే చిత్తశుద్ధి ఉంటే... ఇక్కడి పెండింగ్ ప్రాజెక్టులకు ఎంత బడ్జెట్ కేటాయిస్తున్నారో ముందుగా ప్రకటించాలి. ఆ తర్వాతే సీఎం నాగర్‌కర్నూల్ జిల్లాలో అడుగుపెట్టాలి' అని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేసిందని, రైతుబంధు వంటి పథకాలను నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రేవంత్ రెడ్డి.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టులకే మళ్లీ కొబ్బరికాయలు కొడుతూ, శంకుస్థాపనలు చేయడం మినహా ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వ్యయాన్ని పెంచి, కమీషన్లు దండుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రాజెక్టును ఆలస్యం చేస్తోందని ఆరోపించారు. ఈ పెండింగ్ ప్రాజెక్టుల సమస్యలపై త్వరలోనే ఒక భారీ పాదయాత్రకు ప్లాన్ చేస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు ప్రకటించారు. నిరసనల నేపథ్యంలో పోలీసులు పలువురు బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకోవడంపై పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇది ప్రజాస్వామ్య హక్కులపై జరిగిన దాడిగా అభివర్ణించాయి.



## అడవుల పరిరక్షణతోనే పర్యావరణ సమతుల్యత



- పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలి
- ఫోర్-ఇన్-వన్ పర్యాటక ప్రాంతాలు కలిగిన అరుదైన ప్రాంతం ములుగు జిల్లా
- భక్తిభావం ఉట్టిపడేలా మేడారాన్ని పచ్చగా తీర్చిదిద్దాలి
- నియోజకవర్గంలో 77 శాతం, జిల్లాలో 64 శాతం అడవులు
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క

ములుగు, జూన్ 5 ,మనం ప్రతినిధి,: అడవుల పరిరక్షణతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, సరస్సు, అటవీ, ఆధ్యాత్మిక, పర్వత పర్యాటక ప్రాంతాలు ఒకేచోట ఉన్న అరుదైన జిల్లాగా ములుగు ప్రత్యేక గుర్తింపు పొందిందని, రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన జిల్లా, నియోజకవర్గంగా ములుగు అగ్రస్థానంలో ఉందని, నియోజకవర్గంలో 77 శాతం, జిల్లాలో 64 శాతం అడవులు ఉన్నాయని తెలిపారు. మేడారాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్ది, అటవీ సంపదను భావితరాలకు అందించేందుకు సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ములుగు జిల్లా ఇంచర్ల ఏకో పార్కో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ముఖ్య అటవీ సంరక్షణాధికారి కాళేశ్వరం జోన్ బి. ప్రభాకర్ ఐఎఫ్ఎస్తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, సీసీఎఫ్ ప్రభాకర్, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్, ఇంచర్ల సర్పంచ్ కుమార్ గౌడ్ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు. రాష్ట్ర గేయాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అటవీ శాఖ ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను సందర్శించి, అటవీ సంపద సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, వన్యప్రాణుల రక్షణకు సంబంధించిన చిత్రాలను వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, అడవుల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. అటవీ సంరక్షణపై గ్రామస్థాయిలో ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వన సంరక్షణ కమిటీల తరహాలో గ్రామ సర్పంచ్లు, ప్రజాప్రతినిధులు, స్థానిక యువతతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి అడవుల రక్షణ బాధ్యతలను అప్పగిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఇప్ప పువ్వుతో తయారయ్యే ఉత్పత్తులకు మంచి గుర్తింపు ఉందని, కంక వనాలు, ఇప్ప చెట్ల పెంపకంపై గిరిజనులకు శిక్షణలు అందిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన జిల్లాగా ములుగు జిల్లా నిలిచిందని, ములుగు నియోజకవర్గంలో సుమారు 77 శాతం అటవీ విస్తీర్ణం ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో సుమారు 64 శాతం అటవీ విస్తీర్ణంతో ములుగు రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని తెలిపారు. ఈ అటవీ సంపదను భావితరాలకు అందించేందుకు మరింత శ్రద్ధతో సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన గాలి, తగిన వర్షపాతం, ఆరోగ్యకరమైన జీవన వాతావరణం అందాలంటే అడవుల పెంపకం, పరిరక్షణ అత్యంత అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, ఇంచర్ల ఉప సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అటవీ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్కు భరోసా

- పర్యావరణ దినోత్సవ ర్యాలీలో కలెక్టర్ సత్య శారద పిలుపు




వరంగల్, జూన్ 5(మనంన్యూస్): ప్రకృతి సమస్త జీవరాశులకు జీవనాధారమని, ప్రకృతిని కాపాడితేనే అది మనలను కాపాడుతుందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా 10 వ థీమ్ లో శుక్రవారం 5 వ రోజు న పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఓ సిటీ నుండి జిల్లా అధికారులు స్వచ్ఛంద సంస్థల చే ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది పర్యావరణ దినోత్సవ థీమ్ అయిన 'ప్రకృతి నుండి ప్రేరణ' సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిర్వహించిన ర్యాలీ అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత వస్తువులను ఉపయోగించాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా రోజుకు లక్షల మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరణ జరుగు, దీని ప్రభావంతో వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. సునామీలు, క్లౌడ్బర్స్టు, ఇతర విపత్తులు ప్రకృతిపై మానవ జోక్యం వల్లే ఎక్కువవుతున్నాయని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి సంప్రదాయ ఇంధనాలపై ఆధారపడకుండా గ్రీన్ హైడ్రోజన్ వంటి పర్యావరణహిత ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. పూర్వం మన పూర్వీకుల జీవన విధానం లా మట్టి కుండలు, మట్టి పాత్రలు వంటి ప్రకృతి అనుకూల వస్తువులను మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించేందుకు అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు.

పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించి జెండా ఊపి ర్యాలీని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ పురుషోత్తం గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటి నుంచి స్టీల్ బాటిల్స్ వెంట తీసుకురావడం వల్ల ప్లాస్టిక్ వాడకం తగ్గుతుందని ప్లాస్టిక్లు నియంత్రించడంలో ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని వారు అన్నారు. అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి మాట్లాడుతూ మొక్కలు నాటి కాలుష్యాన్ని నియంత్రించాలని వారు పేర్కొన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇ ఇ సునీత పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ ర్యాలీలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇ ఇ సునీత, రిటైర్డ్ డిఎఫ్ఓ పురుషోత్తం, సంబంధిత శాఖల జిల్లా అధికారులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక కె. పురుషోత్తం, టి. శ్రవణ్ కుమార్, ఎ. సంపత్ కుమార్, వి. శ్రీనివాస్, రాధ మేడం, భగవాన్, వెంకన్న సింగర్ యం.పరుషరాములు, రాజాగోవిందు, దామోదర్, డాక్టర్ సాంబమూర్తి, ఫైజుల్ రెహమాన్ లతో,,పాటు పలు స్వచ్ఛంద సంస్థలు, వాకర్స్, యోగ అసోసియేషన్ ప్రతినిధులు, అటవీశాఖ, హార్టికల్చర్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు





మంగపేట,జూన్ 5మనం ప్రతినిధి : టిఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని విఆర్ఎస్ మండలా ద్యక్షుడు కాకుల మరి లక్ష్మణ్ బాబు అన్నారు. శుక్రవారం మండల పర్యటనలో భాగంగా జరిగిన పరామర్శ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ఎల్లప్పుడూ కష్టపడి పనిచేసే నాయకులను, నిరంతరం ప్రజలకు మరియు కార్యకర్తలకు అండగా ఉండే వారినే గుర్తిస్తారని, వారికే రాబోయే రోజుల్లో ఉన్నత స్థాయి పదవులను ఇస్తారని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమలోని ప్రతిభను, పనితనాన్ని నిరూపించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రూపు రాజకీయాలకు తావులేదు పార్టీలో ఎలాంటి గ్రూపులు ఉండవని, ఉండకూడదని లక్ష్మణ్ బాబు కరాఖండిగా చెప్పారు. మనది ఒకటే గ్రూప్.. అది బిఆర్ఎస్ పార్టీ గ్రూప్, కేసీఆర్ గ్రూప్. అందరం కలిసికట్టుగా ఒకే తాటిపై నడవాలని ఆయన స్పష్టం చేశారు. అధినాయకత్వ నిర్ణయానికి కట్టుబడాలి కేసీఆర్ ఎవరికి టికెట్ కేటాయించినా, వ్యక్తిగత పట్టింపులు పక్కనపెట్టి, తలవంచి పార్టీ అభ్యర్థి విజయం కోసం సైనికుల్లా పనిచేయడమే మన అందరి ఏకైక లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. త్వరలోనే సభ్యత్వ నమోదు ప్రారంభం పార్టీని కింది స్థాయి నుండి మరింత బలంగా నిర్మించుకోవడానికి త్వరలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కాబోతుందని లక్ష్మణ్ బాబు ప్రకటించారు. కేసీఆర్ మాటను తూచా తప్పకుండా పాటిస్తూ, ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా విజయవంతం చేయాలని కోరారు. కింది స్థాయి వరకు పార్టీ సిద్ధాంతాలు, వివరణలు స్పష్టంగా వెళ్ళినప్పుడే సంస్థాగతంగా పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముఖ్య నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం



కరీంనగర్ జూన్ 5 (మనం బ్యూరో): నగర ప్రజలకు మరిన్ని ఆధునిక వసతులు కల్పించడంలో భాగంగా కరీంనగర్ నగరంలో నూతనంగా అధునీకరించిన ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. కరీంనగర్ నగరపాలక సంస్థకు చెందిన కాంప్లెక్స్ భవనాన్ని శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ సుడా కు చెందిన 79 లక్షల నిధులతో 48 షాపులుగా అధునీకరించిన ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ ను శుక్రవారం రోజు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు వడ్లూరు లక్ష్మణ్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, స్థానిక శాసనసభ్యులు గంగుల కమలాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ నరెంధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ అశ్వనీ తానాజీ వాకడే, నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ప్రారంభం చేశారు.

అనంతరం సుడాకు చెందిన 1.28 కోట్ల రూపాయల నిధులతో నైట్ ఫుడ్ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం కు శంఖు స్థాపన చేశారు. నైట్ ఫుడ్ కోర్ట్ కాంప్లెక్స్ స్టాల్స్ నిర్మాణంతో పాటు పార్కింగ్ స్థలం, బెంచెస్ ఏర్పాటు, పిల్లల ఆట పరికరాలు, వాటర్ ఫౌంటెన్ లాంటి వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేషం, మున్నూరు కాపు కార్పోరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, స్థానిక కార్పొరేటర్ వంగల పవన్, (మాజీ మేయర్) కార్పోరేటర్ రవీంధర్ సింగ్, కార్పోరేటర్లు వైద్యుల అంజన్ కుమార్, వరాల నర్సింగం చాడగొండ కవిత బుచ్చిరెడ్డి, సరిల్ల రాజకుమారి ప్రసాద్, అలీ, మల్లేషం, నగరపాలక సంస్థ, సుడా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రజనీకాంత్ తనతో చేతులు కలపమన్నారు

## అన్నామలై వెల్లడి



**చెన్నై, జూన్ 5:** తమిళనాడు రాజకీయాల్లో కొంతకాలంగా ఆసక్తి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇంతకాలం సీఎం విజయ్‌పై ఉన్న దృష్టి.. ఇప్పుడు అన్నామలై వైపు మళ్లింది. ఆయన ఇప్పటికే బీజేపీని వీడగా.. తన రాజకీయ భవిష్యత్తు గురించి తాజాగా మీడియాతో మాట్లాడారు. ఈసందర్భంగా ప్రముఖ నటుడు రజనీకాంత్ ప్రస్తావన తెచ్చారు. తనతో చేతులు కలపమని గతంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ అడిగారన్నారు. ''2024లో నేను బీజేపీలో చేరడానికి ఒకరోజు ముందు రజనీకాంత్ నాకు ఫోన్ చేశారు. ఆయన నేతృత్వం వహిస్తున్న రాజకీయ ఉద్యమంలోకి రావాలని ఆహ్వానించారు. కానీ, నేను అప్పటికే బీజేపీ సీనియర్ నేత బీఎల్ సంతోష్‌కు మాటిచ్చా. అందుకే రజనీకాంత్ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించా. నేను రాజకీయాల్లోకి రావడానికి కారణం బీఎల్ సంతోష్ ఇచ్చిన హామీనే. నా రాజకీయ ప్రవేశంపై ఉన్న ఊహాగానాలకు ముగింపు పలికేందుకు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాను. అయితే తమిళనాడు విషయంలో నా అభిప్రాయాలు.. బీజేపీ నాయకత్వం అభిప్రాయాలతో సరిపోలలేదు. ఈ విభేదాలను పరిష్కరించుకునేందుకు పార్టీ అగ్రనాయకత్వంతో 18 నెలలుగా ఎన్నో చర్చలు జరిపాను. ఇంక బీజేపీకి భారంగా ఉండకూడదని అనుకున్నాను'' అని అన్నామలై వివరించారు. ఇకపై స్వతంత్ర రాజకీయ మార్గంలో ముందుకువెళ్తానని, తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త బాటలు వేసేందుకు పోరాడతానని తెలిపారు.

గత ఏడాది డిసెంబర్‌లోనే నా రాజీనామా గురించి చెప్పాను. అయితే పార్టీ పెద్దలు నన్ను ఆపారు. ఎన్నికల బాధ్యతలు నిర్వహించమని సూచించారు. ఇప్పుడు నా రాజకీయాలు సామాన్యుడి లక్ష్యంగా ఉంటాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సొంతంగా పోటీ చేస్తాను. అప్పటివరకు అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తాను. ప్రధాని మోడీపె నాకు అపారగౌరవం ఉంది. బీజేపీ ఇప్పటివరకు నాపై ఉంచిన నమ్మకానికి, ఇచ్చిన అవకాశాలకు కృతజ్ఞతలు'' అని అన్నామలై వెల్లడించారు. అలాగే అన్నామలై మక్కల్ ఇయక్కమ్ పేరిట రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించారు. దానికి భారీ స్పందన వస్తోందని చెప్పారు. కాగా...అన్నామలై వెళ్లిపోవడం వల్ల పార్టీకి ఎలాంటి నష్టం లేదని బీజేపీ తమిళనాడు చీఫ్ నైనార్ నాగేంద్రన్ వెల్లడించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు.

# ఒమన్ చమురు టర్మినల్లో పేలుళ్లు

## ఇరాన్ డ్రోన్ దాడి కారణంగానే..



**మస్కట్, జూన్ 5:** గల్ఫ్ దేశాలపై ఇరాన్ యుద్ధ విమానాలు, క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతోంది. ఈక్రమంలో ఒమన్‌లోని మినా అల్ ఫహల్ ఆయిల్ టెర్మినల్లో భారీ పేలుడు సంభవించింది. పెద్దఎత్తున అగ్నికీలలు చెలరేగడంతో అప్రమత్తమైన అధికారులు ఫైరింజన్ సహాయంతో మంటలు ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు. ఇరాన్ డ్రోన్ దాడి కారణంగానే పేలుడు సంభవించినట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. దీంతో టర్మినల్లో చమురు లోడింగ్ నిలిపివేశారు. చమురు కోసం వచ్చిన పలు సూపర్ ట్యాంకర్లు అక్కడే చిక్కుకుపోయాయి. మళ్లీ చమురు కార్యకలాపాలు ప్రారంభమయ్యే వరకు అవి అక్కడే వేచి ఉండనున్నట్లు తెలుస్తోంది.

మరోవైపు తమ నౌకాదళం ఒమన్ సముద్రంలోని అమెరికా సైనిక నౌకను లక్ష్యంగా చేసుకుందని ఇరాన్ ప్రభుత్వ మీడియా ప్రకటించింది. తమ దేశ జలాల్లోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తుండగా దానిపై దాడి చేసినట్లు తెలిపింది. కాగా టెహ్రాన్ ప్రకటనను అమెరికా సెంట్రల్ కమాండ్ ఖండించింది. ఒమన్ సముద్ర జలాల్లోని అమెరికా సైనిక ఆస్తులు సురక్షితంగా ఉన్నాయని.. ఏ నౌకపై ఎలాంటి దాడి జరగలేదని స్పష్టంచేసింది.

ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణుల వల్లే కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయం తీవ్రంగా దెబ్బతిందని అమెరికా దేశ అధికారులు వెల్లడించారు. దీనిపై ఐఆర్జీసీ స్పందిస్తూ.. విమానాశ్రయ టెర్మినల్లో జరిగిన నష్టానికి తాము బాధ్యులం కామని పేర్కొంది. అమెరికా తయారుచేసిన పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థలో సాంకేతిక లోపం వల్ల ఈ విధ్వంసం జరిగిందని తెలిపింది. కాగా ఐఆర్జీసీ ఆరోపణలను అమెరికా సైన్యం తిప్పికొట్టింది. ఇరాన్ ఉద్దేశపూర్వకంగా డ్రోన్లతో పౌర విమానాశ్రయంపై దాడి చేసిందని పేర్కొంది. ఈ ఘటనపై అంతర్జాతీయంగా విమర్శలు ఎదురవుతుండడంతో తప్పును కప్పిపుచ్చుకునేందుకు తమపై ఆరోపణలు చేస్తోందని మండిపడింది.

# వీగన్ ఆహారాల గుర్తింపునకు వేగన్

**ఢిల్లీ, జూన్ 5:** ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) కీలక ప్రకటన చేసింది. మార్కెట్లో వీగన్ ఆహార పదార్థాలను గుర్తించడం సులభతరం చేసేలా లోగో(వీగన్)ను ప్రవేశపెట్టింది. ఆమోదం లభించిన అన్ని వీగన్ ఆహార పదార్థాల ప్యాకేజీలపై వీగన్ లోగో తప్పనిసరిగా ఉండాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. వచ్చే ఏడాది జులై 1 నుంచి ఇది అమల్లోకి రానున్నట్లు తెలిపింది. ఆహార పదార్థాలపై పారదర్శకత, వినియోగదారుల విశ్వాసాన్ని బలోపేతం చేయడం, లేబులింగ్ ప్రమాణాలను మరింత మెరుగ్గా పాటించేలా చూడటమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. వీగన్ ఆహార ఉత్పత్తులకు మాత్రమే ఆకుపచ్చ రంగులో ఉండే 'వీ' అనే అక్షరంతో కూడిన లోగోను వినియోగించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ స్పష్టం చేసింది.

# ఆ ఎంపీల గురించి నాకు తెలియదు: రితబ్రత బెనర్జీ



**కోల్‌కతా, జూన్ 5:** పశ్చిమ బెంగాల్లో కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌లో తీవ్ర సంక్షోభం కొనసాగుతున్న నేపథ్యంలో అసమ్మతి ఎమ్మెల్యేలతో ఆ పార్టీ ఎంపీలు టచ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ప్రచారాన్ని రెబల్ నేత రితబ్రత బెనర్జీ తోసిపుచ్చారు. గత ఏడు రోజులుగా తనతో ఏ ఎంపీలూ టచ్‌లోలేరని.. అసలు వారేం చేస్తున్నారు? ఎటువంటి నిర్ణయం తీసుకోబోతున్నారనే విషయంపైనా తనకు స్పష్టత లేదన్నారు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో ఓపికతో చూడడం తప్ప ఏమీ చేయలేమని వ్యాఖ్యానించారు. అయితే రాష్ట్ర రాజకీయాల్లో కీలకమైన పరిణామాలు చోటుచేసుకొనే అవకాశం మాత్రం ఉందన్నారు. కాగా, దాదాపు 20 మంది టీఎంసీ ఎంపీలు బీజేపీతో టచ్‌లో ఉన్నారని, వారు పార్టీ మారే ఆలోచనలో ఉన్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. టీఎంసీకి చెందిన 15 మంది ఎంపీలు తనను సంప్రదించారని బెంగాల్ బీజేపీ నేత దిబ్యేందు అధికారి ఇటీవల వ్యాఖ్యానించారు. అయితే వారు బీజేపీతో చేరుతారా లేదా రెబల్ ఎమ్మెల్యేలతో కలుస్తారా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. దీంతో తృణమూల్ కాంగ్రెస్ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

ప్రస్తుతం పార్లమెంటు ఉభయ సభల్లో టీఎంసీకి మొత్తం 41 మంది (లోక్‌సభ - 28, రాజ్యసభ- 13) ఎంపీలు ఉన్నారు. బెంగాల్ శాసనసభలో ఇప్పటికే టీఎంసీ ఎమ్మెల్యేలు రెండుగా చీలిపోయారు. రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని 58 మందికి పైగా తిరుగుబాటు ఎమ్మెల్యేల బృందం తామే నిజమైన తృణమూల్ వర్గం అని ప్రకటించుకుంది. రాబోయే రోజుల్లో లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు కూడా విడిపోతే తిరుగుబాటు వర్గం మరింత బలంగా మారే అవకాశం ఉంది.

**మేయర్ పదవి నుంచి తప్పుకున్న ఫిర్హాద్ హాకీం..**

టీఎంసీ సీనియర్ నేత, మమతా బెనర్జీకి నమ్మిన బంటుగా ఉన్న ఫిర్హాద్ హాకీం కోల్‌కతా మేయర్ పదవి నుంచి వైదొలిగారు. ఈ పదవి నుంచి వైదొలగాలన్న తన అభ్యర్థనను పార్టీ అధినేత్రి మమత అంగీకరించడంతో శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు.

# శ్రీలంక వృద్ధుల సంరక్షణ కేంద్రంలో అగ్నిప్రమాదం

## 12 మంది మృతి



**కొలంబో, జూన్ 5 :** శ్రీలంక వాణిజ్య రాజధాని నగరమైన కొలంబోకు 65 కి.మీ.ల దూరాన ఉన్న అంగురువాథోటు పట్టణంలో గల వృద్ధుల సంరక్షణ కేంద్రంలో అగ్నిప్రమాదం జరిగి 12 మంది మృతిచెందగా, ఏడుగురు గాయపడినట్లు పోలీసులు వెల్లడించారు. బుధవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో 10 మంది అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. గ్యాస్ సిలిండరు పేలి మంటలు వేగంగా వ్యాపించి ఉండవచ్చని ప్రాథమిక సమాచారం. ప్రైవేటుగా నిర్వహిస్తున్న ఈ కేంద్రంలో ప్రమాద సమయంలో 70 మందికి పైగా వృద్ధులు ఉన్నారు. ఇందులో 51 మందిని రక్షించి, సమీపంలోని పాఠశాలలో తాత్కాలిక వసతి సదుపాయం కల్పించారు. ప్రమాదం అనంతరం సంరక్షణ కేంద్ర యజమానిని పోలీసులు అరెస్టు చేశారు.

# వివక్ష.. వేధింపులను ఏమాత్రం సహించం

## విప్రో హెచ్చరికలు



**పూణె, జూన్ 5 :** మతం మారాలని తనను కొందరు సీనియర్ మేనేజర్లు, టీం లీడర్లు బలవంతం చేశారని పుణెలోని విప్రో కార్యాలయంలో పనిచేసిన ఓ మాజీ మహిళా ఉద్యోగిని చేసిన ఆరోపణలపై విప్రో స్పందించింది. తమ కార్యాలయాల్లో వివక్ష.. వేధింపులను ఏమాత్రం సహించబోమని పేర్కొంది. నేరం రుజువైతే సదరు ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఉద్యోగుల సంక్షేమం, గౌరవం, స్వేచ్ఛకు భంగం కలిగించకుండా.. సురక్షితమైన పని పరిస్థితులు కల్పించే విషయంలో నిబద్ధతతో ఉంటామని పేర్కొంది. మాజీ ఉద్యోగి చేసిన ఆరోపణలపై పుణెలో అధికారులు చేస్తున్న విచారణకు తమ సంస్థ పూర్తి సహకారం అందిస్తున్నట్లు వెల్లడించింది. కేసు దర్యాప్తు కోసం పోలీసులు అడిగిన పలు పత్రాలను సమర్పించినట్లు తెలిపింది. ఇస్లాంలోకి మారతావా... లేక రాజీనామా చేస్తావా అంటూ తనను మానసిక ఒత్తిడికి గురిచేశారని పుణెలోని విప్రో కార్యాలయంలో పనిచేసిన ఓ మాజీ మహిళా ఉద్యోగిని హింజవాడి పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కార్యాలయ యంత్రాంగానికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని, అందువల్ల తాను ఉద్యోగం కోల్పోవాల్సి వచ్చిందని బెంగళూరులో నివసిస్తున్న తన మాజీ మహిళా సహోద్యోగినిపై ఆమె రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ ఘటనపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతుండడంతో విప్రో స్పందించింది.

# మేం అధికారంలో ఉన్నప్పుడు పేపర్ లీకులు జరగలేదే?

## మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్



**ఢిల్లీ, జూన్ 5 :** దేశంలో తరచూ తలెత్తుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారాలపై ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మరోసారి మండిపడ్డారు. ప్రశ్నాపత్రాల లీక్ వెనుక బిలియన్ల విలువ చేసే వ్యాపారాలు నడుస్తున్నాయని.. ఇందులో చాలా పెద్ద వ్యక్తుల హస్తం ఉందని ఆరోపించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే ప్రతి మూడేళ్లకు ఒకసారి పేపర్ లీక్‌లు ఎందుకు అవుతున్నాయని ప్రశ్నించారు. పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లైనా ఒక్క లీక్ కూడా జరగలేదన్నారు. తమ పార్టీ ఢిల్లీలో అధికారంలో ఉన్న పదేళ్లపాటు అక్కడ కూడా ఎటువంటి లీక్‌లు చోటుచేసుకోలేదని తెలిపారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఈ లీక్‌లు మొదలయ్యాయని ఆక్షేపించారు. పరీక్షల్లో అవకతవకల నేపథ్యంలో గతంలో తెలంగాణలో బ్యాన్ చేసిన కోఎంప్ట్ (గ్లోబరీనా) కంపెనీకే కేంద్రం సీబీఎస్ఈ 12వ తరగతి ఆన్-స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానాన్ని కాంట్రాక్ట్ ఇచ్చిందని కేజ్రీవాల్ మండిపడ్డారు. ఆ కంపెనీ తెలంగాణలో సృష్టించిన సమస్యల వల్ల 20 మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. అటువంటి కంపెనీకి ఇంత పెద్ద సీబీఎస్ఈ కాంట్రాక్ట్‌ను ఇవ్వడం వెనుక ఏదో కుట్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ చర్య వల్ల దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరిగినా ఆ కంపెనీపై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఇటువంటి అక్రమాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టాలని దేశ యువతకు కేజ్రీవాల్ పిలుపునిచ్చారు. పేపర్ లీక్‌లను అరికట్టడానికి నిర్ణయాత్మక చర్యలు తీసుకునేలా విద్యార్థులు, పౌరులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానంత వరకు ఈ సమస్య కొనసాగుతూనే ఉంటుందన్నారు. రేపటి తరం భవిష్యత్తు కోసం ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి రావాలని విజ్ఞప్తి చేశారు. నీట్, సీబీఎస్ఈ పేపర్ వివాదాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# నోయిడాలోని 28 అంతస్తుల భవనంలో అగ్నిప్రమాదం



**నోయిడా, జూన్ 5:** ఉత్తరప్రదేశ్ నోయిడాలోని 28 అంతస్తుల భవనంలో అగ్నిప్రమాదం జరిగింది. ఐవీ కౌంటీ అపార్ట్మెంట్ సముదాయంలోని 12వ అంతస్తులో ఉన్న ఒక ఫ్లాట్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు తీవ్రరూపం దాల్చడంతో పరిసర ప్రాంతాలను దట్టమైన పొగ కమ్మేసింది. సమాచారం అందుకున్న రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ముందు జాగ్రత్తగా భవనంలోని నివాసితులను ఖాళీ చేయించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని, ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# మహిళలకు ప్రభుత్వ గ్రీన్ గిఫ్ట్

- **డ్వాక్రా సభ్యులకు పార్కుల నిర్వహణ బాధ్యతలు**
- **కాంట్రాక్టర్లకు బదులు మహిళలు.. పార్కుల నిర్వహణలో కొత్త అధ్యాయం**

**హైదరాబాద్, జూన్ 5 :** మహిళల ఆర్థిక స్థితిని మరింత బలోపేతం చేయడం, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించడం లక్ష్యంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకోని మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ పార్కుల నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక సంఘాలమహిళలకు అప్పగించే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా ఎంఎంసి పరిధిలోని ప్రతి జోన్లో కనీసం రెండు పార్కులను స్వయం సహాయక సంఘం మహిళలకు నిర్వహణ కోసం కేటాయించడం జరిగింది. ఈ నేపథ్యంలో ఎల్బీ నగర్ జోన్ పరిధిలోని రెండు పార్కులను స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు.

**ఎల్ బి నగర్ జోన్ లో...**

సర్కిల్-12, సరూర్నగర్ పరిధిలోని హుడా సి-టైప్ పార్క్ నిర్వహణను జన్మభూమి ఎంపీఎస్ స్వయం సహాయక సంఘానికి అప్పగించారు. అదేవిధంగా సర్కిల్-14, హయత్నగర్ పరిధిలోని యశోద ఎన్క్లేవ్ కాలనీ పార్క్ నిర్వహణను ఆదర్శ ఎంపీఎస్ స్వయం సహాయక సంఘానికి అప్పగించారు.

**ఉప్పల్ జోన్ లో...**

ఉప్పల్ సర్కిల్ చిలుకనగర్ వార్డు లోని బ్యాంక్ కాలనీ పార్కు వేంకటేశ్వర స్వామి ఎస్ హెచ్ జి, జీవన జ్యోతి ఎస్ హెచ్ జి, సైలాన్ బాబా ఎస్ హెచ్ జి లకు అప్పగించారు.నాచారం సర్కిల్ శక్తి సాయి నగర్ లోని గోకుల్ నగర్ కాలనీ పార్కు మునీర ఎస్ హెచ్ జి కు అప్పగించారు.

**మల్కాజ్ గిరి జోన్ లో...**

కీసర సర్కిల్ లోని ప్రశాంత్ విహార్ కాలనీ పార్క్ మల్లన్న స్వయం సహాయక సంఘానికి, సాయి కృష్ణా ఎన్ క్లేవ్ పార్కు వారాహి స్వయం సహాయక సంఘానికి అప్పగించారు. అదే విధంగా అల్వాల్ సర్కిల్ లోని భూదేవి నగర్ పార్కు విజయ గణపతి స్వయం సహాయక సంఘానికి, బోయిన్ పల్లి సర్కిల్ లోని నెహ్రూ నగర్ పార్కు నాగ శ్రీ స్వయం సహాయక సంఘానికి అప్పగించారు. పార్కుల నిర్వహణలో భాగంగా పరిశుభ్రత, మొక్కల సంరక్షణ, నీటి సరఫరా, ఉద్యానవన నిర్వహణ తదితర రోజువారీ పనులను ఆయా ఖీఏఎ మహిళలే నిర్వహించనున్నారు. ఈ పనులు యుబీడీ సిబ్బంది సాంకేతిక మార్గదర్శకత్వంలో కొనసాగుతాయి. ఈ పైలట్ ప్రాజెక్టులో మహిళల పనితీరు సంతృప్తికరంగా ఉంటే, ప్రస్తుతం కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇతర పార్కులను కూడా దశలవారీగా స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ప్రాజెక్ట్ డైరెక్టర్, అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్, డీపీఓలు తరచూ పార్కులను సందర్శించి పనితీరును పర్యవేక్షించనున్నారు. మహిళలను ప్రోత్సహించేందుకు ఈ పైలట్ ప్రాజెక్టులో పాల్గొనే స్వయం సహాయక సంఘాలకు ఈఎండీ, జీఎస్టీ, లేబర్ లైసెన్స్ తదితర రుసుముల నుంచి ప్రభుత్వం మినహాయింపు కల్పించింది.

# జపాన్-తెలంగాణ సహకారానికి కొత్త దిశ

## ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై చర్చలు

**హైదరాబాద్, జూన్ 5:** జపాన్లోని హిరోషిమా ప్రిఫెక్చర్కు చెందిన ప్రతినిధి బృందం శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో సమావేశమైంది. ఈ సమావేశాన్ని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్పవర్ కంపెనీ (టామ్కామ్) సమన్వయం చేసింది. తెలంగాణ-జపాన్ మధ్య నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ ఉపాధి అవకాశాల విస్తరణ, శిక్షణ పొందిన మానవ వనరుల అభివృద్ధి వంటి అంశాలపై పరస్పర సహకార అవకాశాలపై చర్చలు జరిగాయి.

హైదరాబాద్తో జపాన్ నగరాల అనుబంధానికి రెండు దశాబ్దాల చరిత్ర ఉందని, ప్రస్తుతం ఆ భాగస్వామ్యం 20వ సంవత్సరాన్ని జరుపుకుంటోందని ప్రతినిధి బృందం పేర్కొంది. ఈ సందర్భంగా మంత్రి డా. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతను ప్రభుత్వం సిద్ధం చేస్తోందన్నారు. రాష్ట్ర యువతకు విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో, వారి ఉపాధి సామర్థ్యాలను పెంపొందించడంలో టామ్కామ్ అత్యంత వృత్తిపరమైన, లక్ష్యబద్ధమైన కృషి చేస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో లేబర్ ఎంప్లాయ్మెంట్ ట్రైనింగ్ అండ్ ఫ్యాక్టరీస్ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన గారు తెలంగాణ అభివృద్ధి అవకాశాలపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఉద్యోగ నైపుణ్యాల పెంపు, అంతర్జాతీయ ప్లేస్మెంట్ అవకాశాల గురించి వివరించారు. అలాగే తెలంగాణ-హిరోషిమా ప్రిఫెక్చర్ మధ్య సహకారం, ఉపాధి అవకాశాలను మరింత విస్తరించేందుకు సంయుక్త కార్యాచరణ బృందం (జాయింట్ వర్కింగ్ గ్రూప్) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

# పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన అధికారులు

**హైదరాబాద్, జూన్ 5 :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా 92వ రోజు సందర్భంగా శుక్రవారం రోజున ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భారీ స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు మరియు మొక్కల నాటే కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టి రహదారులు, కాలనీలు, పార్కులు, బహిరంగ ప్రదేశాలను శుభ్రపరిచారు.

అదేవిధంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎం ఎం సి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించేందుకు ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని అధికారులు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమాలు నగర పరిశుభ్రతతో పాటు పచ్చదనం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని యుబిడి డైరెక్టర్ సునంద తెలిపారు.

# డీకేకు 'శాఖల' తలనొప్పి..

## శాఖ నచ్చలేదంటూ ఒకరు రాజీనామా

## అలకబూనిన మరొక మంత్రి




**బెంగళూరు, జూన్ 5:** కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన డీకే శివకుమార్‌కు సొంత నేతల నుంచే తలనొప్పులు ఎదురయ్యాయి. ఇప్పటికే శాఖ నచ్చలేదంటూ మంత్రి రామలింగారెడ్డి రాజీనామా చేయగా.. తాజాగా మరో మంత్రి కూడా కేటాయింపుల తీరుపై అలక ప్రదర్శించారు. మంత్రిత్వ శాఖల అప్పగింత సమయంలో సీనియార్టీని పరిగణనలోకి తీసుకోలేదని మంత్రి కేహెచ్ మునియప్ప బహిరంగంగానే తన అసంతృప్తి వ్యక్తం చేశారు.

తాజా కేబినెట్ విస్తరణలో మునియప్పకు ఆహార, ప్రజా పంపిణీ శాఖను కేటాయించారు. కానీ, ఆయన మాత్రం సామాజిక సంక్షేమం లేదా వ్యవసాయ శాఖ కోరుకున్నారు. రామలింగారెడ్డి రాజీనామా నేపథ్యంలో మునియప్ప మీడియాతో మాట్లాడుతూ డీకే సర్కారుపై విమర్శలు గుప్పించారు. ''మంత్రిత్వశాఖ కేటాయింపుల్లో సీనియార్టీని పట్టించుకోలేదు. రామలింగారెడ్డి, నేను ఎనిమిది సార్లు గెలిచాం. ఐదు కంటే ఎక్కువసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నేతలూ ఉన్నారు. మాలాంటి వారికి సమన్యాయం జరగలేదు. అనుభవమున్న నేతలను సమానంగా చూడాలని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేను కోరుతున్నా'' అని మునియప్ప తెలిపారు.

''రాహుల్ గాంధీ ఇటీవల రాష్ట్రానికి వచ్చినప్పుడు ఆయనకు నేనో అభ్యర్థన చేశా. సామాజిక సంక్షేమశాఖ ఇస్తే ప్రజలకు మరింత సేవ చేయగలనని, వ్యవసాయం ఇస్తే రైతుల ప్రయోజనాల కోసం పనిచేయగలనని చెప్పా. ఇరిగేషన్ ఇచ్చినా రైతులకు సేవ చేసే అవకాశం లభిస్తుందన్నా. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలోపెట్టుకుని శాఖల కేటాయింపుల్లో సీనియార్టీని పరిగణనలోకి తీసుకోవాలని హైకమాండ్‌ను కోరుతున్నా. మంత్రివర్గ విస్తరణను మరోసారి సమీక్షించాలి'' అని మునియప్ప డిమాండ్ చేశారు. ఈ ఉదయం రామలింగారెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేశారు. నగరాభివృద్ధి శాఖ ఇవ్వాలని విన్నవించినా తనకు అవగాహన లేని నీటిపారుదల శాఖ ఇచ్చారని ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈయన రాజీనామాపై సీఎం డీకే స్పందించారు. ఈ సమస్యను తాము మాట్లాడుకుని పరిష్కరించుకుంటామని తెలిపారు.

## గాంజా నిర్మలపై పోలీస్ ప్రత్యేక తనిఖీలు



**సూర్యాపేట, జూన్ 05 (మనం ప్రతినిధి):** జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది శుక్రవారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు అని ఎస్త్రు తెలిపారు. ఈ సందర్భంగా గంజాయి లాంటి మాదకద్రవ్యాల నిర్మూలన, గుర్తింపు లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తో పట్టణ కేంద్రంలో హోటల్స్, టీ దుకాణాలు, జాతీయ రహదారి వెంట హోటల్స్ దాబాలు, పాన్ డబ్బాలు, బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు, సోదాలు నిర్వహించామని స్పష్టం చేశారు. ప్రస్తుత సమాజంలో గాంజాయి లాంటి మాదకద్రవ్యం మన యువతని సమాజాన్ని పట్టిపీడిస్తుందని దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉండాలని అన్నారు. దీనిలో భాగంగానే విస్తృత తనిఖీలు నిర్వహించామని. డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం పోలీసు వారికి ఇవ్వాలని సూచించారు. ఎవరైనా గంజాయి ఉపయోగించేవారు ఉన్నా, సరఫరా చేసేవారు ఉన్నా అలాంటి వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

## పర్యావరణ పనితీరుపై ఉత్తమ పురస్కారం




**సూర్యాపేట, జూన్ 5 (మనం ప్రతినిధి):** వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణలో విశేష కృషి చేస్తున్న సూర్యాపేట మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది. ఈ నేపథ్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ప్రదానం చేసే ఉత్తమ పర్యావరణ పనితీరు పురస్కారంకు సూర్యాపేట మున్సిపాలిటీ ఎంపికైంది.ఈ పురస్కారాన్ని శుక్రవారం హైదరాబాద్లోని టీజీపీసీబీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో దేవాదాయ, అటవీ శాఖ ఎన్విరాన్ మెంట్ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి, మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి అందుకున్నారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ... పట్టణంలో వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వ్యర్థాల పునర్వినియోగం, పారిశుధ్య కార్యక్రమాల అమలు, పర్యావరణ పరిరక్షణ చర్యల్లో సూర్యాపేట మున్సిపాలిటీ కనబరిచిన ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వాటిని రీసైక్లింగ్ చేయడం, పర్యావరణ హిత కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా అమలు చేయడం మున్సిపాలిటీకి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయి అని స్పష్టం చేశారు .సూర్యాపేట మున్సిపాలిటీకి లభించిన ఈ పురస్కారం పట్టణ ప్రజలు, పారిశుధ్య కార్మికులు, అధికారులు, ప్రజా ప్రతినిధుల సమిష్టి కృషికి నిదర్శనమని అన్నారు. భవిష్యత్తులో కూడా పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి సూర్యాపేటను రాష్ట్రంలో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణలో సూర్యాపేట అమలు చేస్తున్న వినూత్న విధానాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు రావడం ఆనందంగా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు చర్యలు కొనసాగిస్తామని చెప్పారు. ఈ అవార్డుతో సూర్యాపేట మున్సిపాలిటీ రాష్ట్రంలో పర్యావ రణహిత పట్టణాల జాబితాలో మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య




**తిరుమలగిరి, జూన్ 5 (మనం న్యూస్):** ప్రభుత్వ పాఠశాలలోని నాణ్యమైన విద్యా అందుతుందని తిరుమలగిరి ఎంపిపి ఎస్ ప్రధానోపాధ్యాయులు కసిరెడ్డి అశోక్ రెడ్డి చెప్పారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని తిరుమలగిరిలోని గాంధీనగర్, బొడ్రాయి బజార్ శివాలయం బజార్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుండి ప్రీ ప్రైమరి తరగతుల నిర్వహణ కొరకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతులు మంజూరు చేసిందని , అందమైన బొమ్మలతో కూడిన తరగతి గదిని సిద్ధం చేస్తున్నామని తెలిపారు. 4 సం ల నుండి 10 సం ల లోపు బాల, బాలికలను ఎంపీపీ ఎస్ తిరుమలగిరి పాఠశాలలో చేర్పించాలని కోరారు. గత 3 రోజులలో 40మంది నూతనంగా పాఠశాలలో నమోదు అయినారని తెలిపారు. పాఠశాలలో అన్ని రకాల వసతులు కల్పిస్తామని , ఉచిత పాఠ్యపుస్తకాలు , నోట్ బుక్స్ , అల్పాహారం , 22రకాల వస్తువుల కిట్ తో కూడిన స్కూల్ బ్యాగ్ అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సి హెచ్. కవిత , కె. సత్యనారాయణ రెడ్డి , ఎన్. వెంకట్రామనర్సయ్య , బి. సౌమ్యాబాయి , టి. రవీందర్ , టి. గిరి తదితరులు పాల్గొన్నారు..

## ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి

### క్లీన్ హోం గ్రీన్ హోం ప్రోగ్రాం ఆర్గనైజర్ మణిరాజు



**నల్లగొండ,జూన్ 5 (మనం న్యూస్):** ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని క్లీన్ గ్రీన్ హోమ్ ఆర్గనైజర్ ఆదిమల్ల మణిరాజు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా క్లీన్ హోమ్ గ్రీన్ హోమ్ ప్రోగ్రాం ఆర్గనైజర్ ఆదిమల్ల మణిరాజు ఆధ్వర్యంలో నాగార్జున డిగ్రీ కళాశాల మైదాన వాకర్స్ అసోసియేషన్ సభ్యుల తో కలిసి శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆదిమల్ల మణిరాజు మాట్లాడుతూ భూగోళం విపరీతంగా వేడెక్కడానికి ప్రధాన కారణం తరిగిపోతున్న వృక్ష సంపద ఇది ఇలాగే కొనసాగితే ఎన్నో విపత్కర పరిస్థితులు ఎదురై అతివృష్టి అనావృష్టి పరిస్థితులు ఏర్పడి జీవిస్తున్న జీవులు యొక్క జీవితాలు అతలాకు తలమయితాయన్నారు. అందుకే ప్రతి ఒక్కరము కనీసం ఒక చెట్టైనా నాటి సంరక్షించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరినారు అలాగే డాక్టర్ పుల్లారావు మాట్లాడుతూ ఎలినినో ప్రభావం చేత పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలకు తగ్గిపోతున్న వనాలే కారణమని అందుకే మనందరం ముందుకొచ్చి ప్రతి ఒక్కరము విరివిగా మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యాత ను కాపాడి జీవకోటి మనగడకు బాటలు వేద్దాం అని పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బండారు ప్రసాద్ బి శ్రీనివాసరావు వంగాల అనిల్ రెడ్డి డాక్టర్ సుబ్బారావు జెల్ల దశరథ చింతపల్లి వెంకన్న పోతపాక లింగస్వామి గుర్రం వెంకన్న రావిరాల వెంకన్న మిర్యాల యాదగిరి విజయ భాస్కర్ రెడ్డి నిఖిల్ మొదలగు వారు పాల్గొన్నారు.


## అక్రమ రిజిస్ట్రేషన్‌ను అడ్డుకుంటాం



- బహిరంగ చర్చకు సిద్ధం
- నా సవాలును స్వీకరించాలి
- టిఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్

**సూర్యాపేట టౌన్, జూన్ 05, మనం న్యూస్:** సూర్యాపేట పట్టణంలోని అంజనపురీ కాలనీ నందు గల వజ్ర టౌన్ షిప్ లో బలహీన వర్గాలు, ఉద్యోగులు, వ్యాపారస్తులు తాము కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేసిన ఇళ్ళను అక్రమంగా వేరొకరికి రిజిస్ట్రేషన్ చేస్తున్నారని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం వజ్ర టౌన్ షిప్ లో ప్లాట్ల యజమాని మరొకసారి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసేందుకు నల్లు ఉమా జ్యోతి రెడ్డి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వస్తున్నారని, ఈ నేపథ్యంలో ఆ రిజిస్ట్రేషన్ ను అడ్డుకునేందుకు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించిన వారితో కలిసి కార్యాలయం వచ్చారు. ఈ క్రమంలో ఇది లా అండ్ ఆర్డర్ కు భంగం కలిగించేలా ఉందని పట్టణ సిఐ వెంకటయ్య వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా వట్టే జానయ్య యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ..... మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిల ప్రోత్సాహంతోనే అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని, గతంలో రూరల్ పోలీస్ స్టేషన్ లో అక్రమ రిజిస్ట్రేషన్ పై కేసులు నమోదు చేశామని, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదనన్నారు. అగ్రకులాల పార్టీ నాయకులు అక్రమ రిజిస్ట్రేషన్ ను అధికారులు, పోలీసుల అండతో ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఈతంగానికి పూనుకోవటం హేయమైన చర్య అన్నారు. శుక్రవారం (ఈరోజు) మరోసారి తప్పుడు కాగితాలతో మరొకరికి చేసేందుకు వస్తే పట్టణ పోలీసులు తమపై దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గతంలో చట్టబద్ధంగా అనుమతులు తీసుకుని నిర్మాణ పనులు చేపడుతున్న బడుగు బలహీన వర్గాల ప్రజలను కొందరు కావాలనే ఇబ్బందులకు గురిచేశారని, నిర్మాణ పనులకు ఉపయోగిస్తున్న ఇనుప సామగ్రి, రాడ్లు వంచే యంత్రాలను మున్సిపల్ సిబ్బందితో బలవంతంగా తీసుకెళ్లారని ఆరోపించారు. ఈ విషయంలో సూర్యాపేట రూరల్ పోలీసులు సివిల్కు సంబంధించిన వ్యవహారాల్లో పోలీసులు జోక్యం చేసుకోవద్దు. ఇదే విధంగా వ్యవహరిస్తే తదుపరి పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. పేదలు, భాదితులు పక్షాన పోలీసులు నిలవాలన్నారు. బలహీనవర్గాలు ఇల్లు నిర్మాణం చేపట్ట వద్దా, రాజకీయంగా ఎదగొద్దా మీడియా వాళ్ల సమక్షంలో బహిరంగంగా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. తమ కష్టార్జితాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. అధికార పార్టీ నేతలకు పోలీసులు కొమ్ము కాయడం సరికాద న్నారు. ఉదయం నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద జరుగుతున్న ఉద్రిక్తతల నడుమ పోలీసులు వట్టే జానయ్య యాదవ్‌ను చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు.

## డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలి



- అధికారులు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలి
- క్రీడామైదానం ఏర్పాటు చేయాలి
- జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**నల్గొండ, జూన్ 5( మనం ప్రతినిధి):** డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మిగిలి ఉన్న అన్ని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి లబ్ధిదారులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకు రావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఆయన నల్గొండ లోని గొల్లగూడ డబుల్ బెడ్రూమ్ గృహ సముదాయాన్ని పరిశీలించారు . గొల్లగూడ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో అద్దాలు, ఎలక్ట్రికల్ వైరింగ్, విండోలు, వాటర్ ట్యాంకులు, నీటి ట్యాపులు, లైటింగ్, తలుపులు, బాత్రూములు, టాయిలెట్లు, కిచెన్ గదులు, తదితర పనులను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే గృహ సముదాయం మొత్తాన్ని శుభ్రపరచి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని , జిమ్, పార్కులు, బస్తీ దవాఖాన, అంగన్వాడీ కేంద్రం, జిరాక్స్ సెంటర్, మీ సేవా కేంద్రం, మెడికల్ షాప్, కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీ రాజ్ కుమార్ ఆదేశించారు. అదేవిధంగా లే అవుట్ బోర్డులు, దిశా నిర్దేశక సైన్బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. గృహ సముదాయం పరిసర ప్రాంతాల్లో సీసీ రోడ్లు, అంతర్గత రహదారులు, వైకుంఠధామం, క్రీడా మైదానం వంటి మౌలిక వసతుల అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణం మాత్రమే కాకుండా, నివాసితులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఒకేచోట అందుబాటులో ఉండేలా సమగ్ర ప్రణాళికతో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. జిల్లా గృహ నిర్మాణ పీడి రాజ్ కుమార్ ,పంచాయతీరాజ్ ఈ ఈ గిరిధర్,కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్ర, కాంట్రాక్టర్ సైదిరెడ్డి, సంబంధిత అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు .

## పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం




**నారాయణఖేడ్, జూన్ 5 మనంప్రతినిధి:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) సంగారెడ్డి ప్రాంతీయ కార్యాలయ సంయుక్తంగా నారాయణఖేడ్లో పర్యావరణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వృక్షారోపణను ప్రోత్సహించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా నిర్వహించబడింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ ఉమాహారతి మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించాలని సూచించారు. ప్రజలు ఎకో పార్కును సద్వినియోగం చేసుకోవడంతో పాటు పచ్చదనాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. జిల్లా అటవీ అధికారి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, అటవీ సంపద పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. వృక్షారోపణ కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్కు బదులుగా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రదర్శన స్టాల్ను ఏర్పాటు చేశారు. ఇందులో కాగితంతో తయారైన ఉత్పత్తులు, పునర్వినియోగ పదార్థాలు, స్టీల్ వాటర్ బాటిళ్లు, లంచ్ బాక్సులు, పేపర్, క్లాత్, జనపనార (జూట్) సంచులు, చెక్కతో తయారైన స్పూన్లు వంటి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రదర్శించారు. రోజువారీ జీవితంలో వీటి వినియోగం ద్వారా ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు.అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞను అధికారులు, ప్రజలతో చేయించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించడం, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం, పరిశుభ్రమైన వాతావరణం కోసం కృషి చేయడం వంటి అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు. ప్రపంచపర్యావరణ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లాలోని వరుణ్ బేవరేజెస్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎద్దుమైలారం ఓడీఎఫ్ స్థలం, పాశమైలారం జేకే ఫెన్నర్ సంస్థలలో నిర్వహించిన వృక్షారోపణ కార్యక్రమాల్లో కూడా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలను సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే స్థిరమైన జీవన విధానాలను అలవరచుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో ఫీజు రాయితి ఇవ్వాలి

**నల్లగొండ,జూన్ 5 (మనం ప్రతినిధి ):** నల్గొండ జిల్లాలో వివిధ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న జర్నలిస్టు పిల్లలకు ఫీజుల్లో రాయితీ ఇవ్వాలని టి యు డబ్ల్యూ జె ( ఐ జె యూ ) ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్రావు రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేయుచున్న జర్నలిస్టు పిల్లలు వివిధ ప్రవేట్ పాఠశాలలో చదువుతున్నారని అన్నారు. ప్రవేటు పాఠశాలలో వేలాది రూపాయలు ఫీజులు చెల్లించాల్సి ఉండటంతో ఆ ఫీజులను చెల్లించలేక చాలా ఇబ్బందులు పడుచున్నారు. పాఠశాల మేనేజ్మెంటు వారు ఫీజులు చెల్లించాలని వత్తిడి చేయడంతో కొందరు విద్యార్థిని విద్యార్థులు ఫీజులు చెల్లించలేక మధ్యలోనే విద్యను నిలుపుదల చేయుచున్నారు.జర్నలిస్టు కుటుంబంలోని ఒకరికి పూర్తి రాయితిని, ఇంకొకరికి 50%, మరొకరి 30% రాయితీని ఇతర జిల్లాలో కల్పించడం జరుగుచున్నది.కావున మన నల్లగొండ జిల్లాలోని జర్నలిస్టు పిల్లలకు 75% ఫీజు రాయితీని కల్పించగలరని అదేవిధంగా వెంటనే తగిన ఉత్తర్వులు జారీ చేయగలరని కోరుచున్నాము. వినతి పత్రం అందజేసిన వాళ్ళు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు పరమేష్ , సంఘం నాయకులు మాదరి యాదగిరి, ఎర్రెడ్ల చంద్రశేఖర్ రెడ్డి, చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షులు అబ్బోజు మదనాచారి, ఉపాధ్యక్షులు గంగాధర వెంకటేశ్వర్లు, జర్నలిస్టులు వంగాల శ్రీనివాసరెడ్డి ,ఎండి సయ్యద్ , పిట్టల రామకృష్ణ , ,దశరథ ఉయ్యాల లింగయ్య డిఎస్ యాదవ్, దొటి శ్రీనివాస్, సోమచంద్రశేఖర్ , పి అశోక్ కుమార్ ,వుర రమేష్ , ఎస్ రాంప్రసాద్ , టి శంకర్ పాల్గొన్నారు.

## చినుకు పడితే 'చిత్తడే'..

- పాలకవర్గం, అధికారులది 'మొద్దునిద్రే'!



**భిక్కనూర్, జూన్ 05 ( మనం న్యూస్ ):** అది నిత్యం ప్రజలు ప్రయాణికులు, స్థానికులతో రద్దీగా ఉండే ప్రాంతం. పైగా.. ప్రజా సమస్యలను తీర్చాల్సిన గ్రామపంచాయతీ కార్యాలయానికి 'కూతవేటు' దూరం. కానీ, అక్కడ పాలకుల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనత రోడ్లపై మురుగునీరై పారుతోంది. కొద్దిపాటి వర్షం పడితే చాలు.. భిక్కనూర్ బస్టాండ్ ముందరి ప్రాంతం నరకకూపాన్ని తలపిస్తోంది.

**డ్రైనేజీ లేని బస్టాండ్.. నరకం చూస్తున్న జనాలు.**

బస్టాండ్ ముందర సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో, కురిసిన కొద్దిపాటి వర్షానికే మురుగునీరంతా రోడ్లపైకి చేరుతోంది. ఆ నిల్వ ఉన్న మురికినీరు కాస్తా కుళ్ళిపోయి, అక్కడి వ్యాపారులకు, ప్రయాణికులకు తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతోంది. బస్టాండ్కు వచ్చే ప్రయాణికులు ముక్కులు మూసుకుని ప్రయాణించాల్సిన దయనీయ స్థితి దాపురించింది. ఈ మురికి కూపంలోనే ఈగలు, దోమలు చేరి రోగాలు వ్యాపించే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కళ్ళున్నా చూడని అధికారులు.. కదిలని పాలకవర్గం.**

కంటి ముందే ఇంత ఘోరం జరుగుతున్నా, ముక్కుపుటాలదిరిపోయేలా వాసన వస్తున్నా.. పంచాయతీ అధికారులు, పాలకవర్గం మాత్రం 'మాకేమీ పట్టనట్టు' మొద్దునిద్ర నటిస్తుండటంపై స్థానికులు నిప్పులు చెరుగుతున్నారు. కార్యాలయానికి ఇంత దగ్గరగా ఉన్న సమస్యే కనిపించనప్పుడు, ఇక గ్రామాల్లోని అంతర్గత సమస్యలను వీరు ఏం పరిష్కరిస్తారని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. వర్షాకాలం ముంచుకొస్తున్న తరుణంలో ఇప్పటికైనా అధికారులు తమ 'కంటితుడుపు' చర్యలు పక్కనబెట్టి, శాశ్వతంగా డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలని భిక్కనూర్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో రోగాల బారిన పడక ముందే ప్రజా ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- మొక్కలను నాటడమే కాదు సంరక్షించడం మనందరి బాధ్యత
- మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు



**కోదాడ, జూన్ 05(మనం న్యూస్):** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోదాడ మున్సిపల్ చైర్పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై డివైడర్ల మధ్య ఉన్న మొక్కలను కాపాడుకునేందుకు మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు, సిబ్బందితో కలిసి చైర్ పర్సన్ స్వయంగా చెట్లకు పాదులు చేసి, ఎరువులు వేసి, నీళ్లు పోశారు.ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ కేవలం మొక్కలను నాటడమే కాకుండా, వాటిని వృక్షాలుగా మార్చే వరకు సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. పచ్చని చెట్లతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని పేర్కొంటూ పట్టణ ప్రజలందరికీ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరి, కమిషనర్ రమాదేవి, డి ఈ సాయి లక్ష్మి, కౌన్సిలర్లు ఎలమందల నరసయ్య, గంధం పాండు, మాజీ కౌన్సిలర్ కాజా మొయినుద్దీన్, కాంగ్రెస్ నాయకులు రావెళ్ళ కృష్ణారావు, మైలారి శెట్టి భాస్కర్, ధన మూర్తి, క్షత్రయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహాదేవపూర్ గ్రామసభ



**మహాదేవపూర్, జూన్ 5మనం న్యూస్:** మహదేవ్‌పూర్ మండలంలోని గ్రామపంచాయతీల నందు గ్రామసభ నిర్వహించడంజరిగింది గ్రామసభలకు సర్పంచ్హసీనాఅక్బర్ ఖాన్‌అధ్యక్షులుగాపాల్గొనడంజరిగిం సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామపంచాయతీలలో తీసుకోవాల్సిన చర్యలపైమాట్లాడుతూ గ్రామపంచాయతీలలో ప్రతిరోజు పారిశుద్ధ్యం నిర్వహించాలని, అదేవిధంగాకాలువల పూడికతీత మరియు ముళ్ళ పొదల తొలగింపు మరియు వీధి దీపాలలో చెడిపోయినబల్బులను తొలగించి నూతన బల్బులను ఏర్పాటుచేయాలని గ్రామంలో అందరికీత్రాగునీటిసౌకర్యంకల్పించాలని సర్పంచ్ తెలపడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీజ సంతోష్ గ్రామ కార్యదర్శి కల్పన గ్రామపంచాయతీ పాలకవర్గం, ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు తమ ప్రజలు మరియు గ్రామపంచాయతీ సిబ్బదితో పాటు తదితరులుపాల్గొన్నారు.

# ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్‌కు భరోసా

## పర్యావరణ దినోత్సవ ర్యాలీలో కలెక్టర్ సత్య శారద పిలుపు

**హనుమకొండ జూన్ 05(మనం ప్రతినిధి ):** ప్రకృతి సమస్త జీవరాశులకు జీవనాధారమని, ప్రకృతిని కాపాడితేనే అది మనలను కాపాడుతుందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా 10 వ థీమ్ లో శుక్రవారం 5 వ రోజు న పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఓ సిటీ నుండి జిల్లా అధికారులు స్వచ్ఛంద సంస్థల చే ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది పర్యావరణ దినోత్సవ థీమ్ అయిన 'ప్రకృతి నుండి ప్రేరణ' సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిర్వహించిన ర్యాలీ అభినందనీయం అన్నారు ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత వస్తువులను ఉపయోగించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా రోజుకు లక్షల మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరణ జరుగు, దీని ప్రభావంతో వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. సునామీలు, క్లౌడ్బర్స్టు, ఇతర విపత్తులు ప్రకృతిపై



మానవ జోక్యం వల్లే ఎక్కువవుతున్నాయని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి సంప్రదాయ ఇంధనాలపై ఆధారపడకుండా గ్రీన్ హైడ్రోజన్ వంటి పర్యావరణహిత ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. పూర్వం మన పూర్వీకుల జీవన విధానం లా మట్టి కుండలు, మట్టి పాత్రలు వంటి ప్రకృతి అనుకూల వస్తువులను మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించేందుకు అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించి జెండా ఊపి ర్యాలీని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ పురుషోత్తం గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటి నుంచి స్టీల్ బాటిల్స్ వెంట తీసుకురావడం వల్ల ప్లాస్టిక్ వాడకం తగ్గుతుందని ప్లాస్టిక్లు నియంత్రించడంలో ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని వారు అన్నారు. అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి మాట్లాడుతూ మొక్కలు నాటి కాలుష్యాన్ని నియంత్రించాలని వారు పేర్కొన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇ ఇ సునీత పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ ర్యాలీలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇ ఇ సునీత, రిటైర్డ్ డిఎఫ్ఓ పురుషోత్తం, సంబంధిత శాఖల జిల్లా అధికారులు ర్యాలీలో పాల్గొన్నారు.

## సర్టిఫికెట్లు అందజేసిన ఎమ్మెల్యే నాయిని



**హనుమకొండ జూన్ 05( మనం ప్రతినిధి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐలో స్వల్పకాలిక కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి కోర్సులు పూర్తి చేసిన సుమారు 1,500 మంది విద్యార్థినీ, విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక అడ్వాన్స్డ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించి, ఖీక్షిక్షద్వారా విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. రాష్ట్రంలోని బహుళజాతి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకొని విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ ఐటీఐ భవనాన్ని ఆధునీకరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లు విజయ సురేందర్,బోడ డిన్న ,డివిజన్ అధ్యక్షులు సంగీత్,నాయకులు వరంగల్ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం. చందర్, ఖాజీపేట ఐటీఐ ప్రిన్సిపాల్ పి. వేణు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**హనుమకొండ, జూన్ 05 (మనం ప్రతినిధి):** భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్రీ సన్ ప్రీత్ సింగ్, ఐపీఎస్ గారు పేర్కొన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అధికారులు, సిబ్బందితో కలిసి పండ్ల మొక్కలను నాటారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా అటవీ సంపద క్రమంగా తగ్గిపోతుండటం, పచ్చదనం స్థానంలో కాంక్రీట్ నిర్మాణాలు పెరుగుతుండటం, వాహనాలు మరియు పారిశ్రామిక ప్రాంతాల నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా పర్యావరణ సమతుల్య దెబ్బతింటోందన్నారు. దీనివల్ల వాతావరణ పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని, సమయానికి వర్షాలు కురవకపోవడం, అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం వంటి పరిణామాలు ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు ఈ పరిస్థితులకు ప్రధాన కారణం పచ్చదనం తగ్గిపోవడమేనని పేర్కొన్న ఆయన, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. విస్తృత స్థాయిలో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం ద్వారా రాబోయే తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు అంకిత్ కుమార్, దారా కవిత, అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు శ్రీ నర్సింహారావు, నాగయ్య, అంతయ్య, సురేంద్ర, ఆర్ఐలు సతీష్, శ్రీనివాస్, చంద్రశేఖర్, శ్రీధర్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం



- విద్యార్థుల నినాదాలతో మార్మోగిన పురవీధులు

**మహాదేవపూర్ జూన్ 05మనం న్యూస్:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాదేవపూర్ గ్రామంలో ఎన్.జి.సి. ఉపాధ్యాయులై నబిప్రభాకర్ రెడ్డి, మడక మధునేతృత్వంలోభారీపర్యావరణపరిరక్షణర్యాలీకిఅధి కారులనుండి మరియు గ్రామస్తుల నుండి విశేష స్పందన లభించింది.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ప్రారంభమైనర్యాలీలోవిద్యార్థులు, యువత,ప్రజాప్రతినిధులుచెట్లనుపెంచుదాంప్రాణవా యువునుకాపాడుదాంప్లాస్టిక్ వద్దుపర్యావరణం ముద్దునీరు పొదుపు చేయండి భవిష్యత్తును కాపాడండిఅంటూ నినాదాలు చేస్తూ గ్రామ ప్రధాన వీధుల గుండా సాగిబస్టాండ్ కూడలిలో ముగిసింది. పర్యావరణ పరిరక్షణ ర్యాలీని ఉద్దేశించిమండల విద్యాధికారిపురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ప్రోగ్రాముల వల్లసమాజం జాగృతంఅవుతుందని దీనికి ముందుండి నడిపించిన ఎన్ జి సీ ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి మరియు మధులను అభినందించారు.ప్రతీ ఒక్కరు తమవంతుగా పర్యావరణం పట్ల బాధ్యతగా ఉంటేపకృతి పవిత్రంగా ఉంటుందనిగ్రామ సర్పంచ్ హసీనాబానుఅన్నారు. మహాదేపూర్ ఫారెస్ట్ డివిజన్అధికారిసందీప్ రెడ్డిమాట్లాడుతూ అడవులు ఎంత బాగా పెంచగలిగితే వాతావరణం కూడా అంతేచల్లగామారుతుందని అందుకే ప్రతీ మనిషి పర్యావరణ రక్షణలో భాగంకావాలనిఅన్నారు. అడవులు రక్షణ పొందితే పకృతి రక్షణ పర్యావరణ పరిరక్షణ జరిగినట్టేనని ఫారెస్ట్ రేంజ్ఆఫీసర్ రవి అన్నారు.బయాలజికల్ సైన్స్ ఫోరమ్ జిల్లా ప్రసిడెంట్ ప్రభాకర్ రెడ్డిమాట్లాడుతూమొక్కలు నాటడం మన సంస్కృతి, వాటిని కాపాడడం మన బాధ్యత. ఒక్కవిద్యార్థి ఒక్క మొక్క నాటి, సంరక్షి స్తేమ హాదేవపూర్నుహరిత వనంగా మార్చవచ్చు. పంట వ్యర్థం కాల్చకుండా రైతులకు అవగాహన కల్పించి భూమిని కాపాడాలని అన్నారు.నీరు,గాలి, నేలఈ మూడింటిని కలుషితం చేయకుండా భావితరాలకుఅందిస్తేనే మనం నిజమైన విద్యావంతులం. ఈ ర్యాలీతో గ్రామంలో పర్యావరణ చైతన్యం మొదలైంది. ఇది ఇక్కడితో ఆగదు. ప్రతి నెలా మేము హరిత కార్యక్రమాలు చేపడతాం.అని అన్నారు. ఎన్.జి.సికోఆర్డినేటర్ మడక మధు మాట్లాడుతూపర్యావరణ పరిరక్షణ అనేది ఒకరోజు కార్యక్రమం కాదు, ప్రతి ఒక్కరి జీవన విధానం కావాలి. ఈరోజు మనవిద్యార్థులు వేసిన ప్రతిఅడుగు రేపటితరానికి ఆక్సిజన్ను అందస్తుంది. బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్అనే ఈ ఏడాది థీమ్ను మనం గ్రామంలో ప్రతి ఇంటికి తీసుకెళ్లాలి. ప్లాస్టిక్కు తరిమి కొడదాంమన భూమి తల్లిని కాపాడుకుందాం. విద్యార్థుల్లో ఈస్ప్ృహకల్పిం చడమే మా ప్రధాన లక్ష్యం.అని అన్నారు. ఈ ర్యాలీలో బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్, బాలికల పాఠశాల ఇంచార్జి శ్రీమతి సరిత, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అడప రాజయ్య, గ్రామ కార్యదర్శి కల్పన ,వార్డుసభ్యులు, ఉపాధ్యాయులు రిటైర్డ్ ఉద్యోగులు హాజరై ర్యాలీని విజయవంతం చేశారు.

## ఘనంగా పర్యావరణ దినోత్సవం



**భీమదేవరపల్లి, జూన్ 5 మనం న్యూస్:** భీమదేవరపల్లిలో ఘనంగా పర్యావరణ దినోత్సవం జరిపారు. శుక్రవారం రోజున భీమదేవరపల్లి గ్రామపంచాయతీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి ముక్క నాటిన అనంతరం వారు మాట్లాడుతూ అడవుల నరికివేత వలన వాతావరణంలో కార్బన్డయాక్సైడ్ పెరిగి వాతావరణం వేడెక్కడానికి కారణమవుతుందని ప్రతి ఒక్కరూ విధిగా తమ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు కాపాడుకోవడానికి ప్రభుత్వంతో పాటు ప్రజలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శనిగరం ఐలయ్య వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడీ లబ్ధిదారులకు నాణ్యమైన పోషకాహారమే లక్ష్యం

- ఆహార భద్రత ప్రమాణాల అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక దృష్టి
- మంత్రి సీతక్క ఆదేశాలతో జూన్ 7న రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

**ములుగు, జూన్ 5 ,మనం ప్రతినిధి,:** అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందించే పోషకాహార సేవలను మరింత నాణ్యంగా, సురక్షితంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అంగన్వాడీ సేవల బలోపేతం, ఆహార భద్రత ప్రమాణాల కచ్చితమైన అమలుపై మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క నిరంతరం ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందించే ఆహారం నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలు, పంపిణీ వ్యవస్థ తదితర అంశాలపై మంత్రి సీతక్క స్వయంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారులతో (ృగిలు) తరచూ వీడియో కాన్ఫరెన్సు నిర్వహిస్తూ సమీక్షలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆహార భద్రతపై అంగన్వాడీ సిబ్బందికి మరింత అవగాహన కల్పించేందుకు ఈ ఆదివారం నాడు (జూన్ 7) వరల్ ఫుడ్ సేఫ్టీ డే ను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ శిక్షణలో అంగన్వాడీ కేంద్రాల్లో ఆహార పదార్థాల సేకరణ, నిల్వ, వంట ప్రక్రియ, పరిశుభ్రత ప్రమాణాలు, నాణ్యత నియంత్రణ, లబ్ధిదారులకు సురక్షితమైన పోషకాహారం అందించే విధానాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం కోసం జిల్లాల వారీగా ఫుడ్ సేఫ్టీ అధికారులను మాస్టర్ ట్రైనర్లుగా నియమించారు. వారు అంగన్వాడీ సిబ్బందికి ఆహార భద్రత, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలపై ప్రత్యక్ష శిక్షణ అందించనున్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండరడ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఊఖిఖిఅఐ) మార్గదర్శకాల ప్రకారం శిక్షణ ఇస్తారు. అంగన్వాడీ కేంద్రాలు భవిష్యత్ తరాల ఆరోగ్యానికి పునాది. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందించే ప్రతి ఆహార పదార్థం నాణ్యంగా, సురక్షితంగా ఉండేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. వరల్ ఫుడ్ సేఫ్టీ డే స్ఫూర్తితో ఆహార భద్రత ప్రమాణాలను మరింత పటిష్ఠం చేయడానికి ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందని మంత్రి సీతక్క ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్వాడీ వ్యవస్థ ద్వారా అందించే సేవల నాణ్యతను మరింత పెంచడం, పోషకాహార లోపాలను తగ్గించడం, లబ్ధిదారుల ఆరోగ్యాన్ని పరిరక్షించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు ఆహార భద్రత ప్రమాణాలను పూర్తిస్థాయిలో అమలు చేసేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని వెల్లడించారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**హనుమకొండ జూన్ 05(మనం ప్రతినిధి):** వరంగల్ ఆఫీసర్స్ క్లబ్లో చేపట్టనున్న పలు నూతన అభివృద్ధి పనులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఈ రోజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, ఆఫీసర్స్ క్లబ్ను మరింత ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి సభ్యులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. క్లబ్ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని పేర్కొన్నారు. క్లబ్ అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం సభ్యులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# మహిళల ఆర్థిక పురోగతికి కొత్త అవకాశాలు కల్పిస్తాం

- మంత్రి సీతక్క



**తాడ్వాయి, జూన్ 5, మనం ప్రతినిధి:** ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని, మహిళల ఆర్థిక పురోగతికి కొత్త అవకాశాలు సృష్టిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం పోచాపూర్ గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో బిట్టుపల్లి,బంధాల, పోచాపూర్, నర్సాపూర్ పి.ఎల్., బొల్లెపల్లి గ్రామాల ప్రజల నుంచి, లింగాల గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఒడ్డుగూడెం, లింగాల, బోటి లింగాల, లవ్వాల, కోడిశాల గ్రామాల ప్రజల నుంచి మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పోచాపూర్-నర్సాపూర్-అల్లిగూడెం రహదారి అభివృద్ధితో పాటు పలు అంతర్గత రహదారుల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడేలా చెక్డ్యామ్లు, రహదారులు, వంతెనల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. గతంలో అటవీ అనుమతుల కారణంగా పెండింగ్లో ఉన్న రహదారి పనులకు అవసరమైన అన్ని అనుమతులు సాధించి పనులను వేగవంతం చేసినట్లు తెలిపారు. రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో వాగులు, చెరువుల అభివృద్ధికి సుమారు రూ.70 నుంచి రూ.80 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి లింగాల ప్రాంతంలో నూతన సబ్‌స్టేషన్ మంజూరు చేసి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ప్రజా దర్బార్లో అందిన ప్రతి దరఖాస్తును పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, మూడు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన ఈ ప్రాంతంలో మహిళా సంఘాలకు ఉపాధి కల్పించే కేంద్రాల ఏర్పాటు అవకాశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఆర్ఓఎఫ్ఆర్ భూముల విషయంలో అర్హులైన రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని, అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. గిరిజన, గ్రామీణ ప్రాంతాల మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మహిళా సంఘాల ద్వారా చేపలు, పచ్చళ్లు తదితర ఉత్పత్తుల విక్రయాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం, శిక్షణ అందిస్తోందని తెలిపారు. అడవి ప్రాంతాల్లో లభించే వనరులను ఆదాయ మార్గాలుగా మలచుకుని కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ములుగు నియోజకవర్గంలో ఇప్పటికే 5 వేలకుపైగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, రెండో విడతలో మరో 2 వేల ఇళ్లను కూడా ప్రభుత్వం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో గృహ అవసరాలు అధికంగా ఉన్నందున ఐటీడీఏ పరిధిలో మరిన్ని ఇళ్లు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు కలిగిన రైతులకు సాగునీటి అవసరాల కోసం బోర్లకు అనుమతులు కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు సర్పంచులకు తగిన అధికారాలు కల్పించామని అన్నారు. గతంలో రవాణా సౌకర్యాలు లేని గ్రామాలకు ప్రస్తుతం మెరుగైన రహదారి సదుపాయాలు కల్పిస్తున్నామని, పోచాపూర్-అల్లిగూడెం-నర్సాపూర్ మార్గంలో చేపట్టిన రహదారి అభివృద్ధి పనులు ఇందుకు నిదర్శనమని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ప్రతి సోమవారం కలెక్టరేట్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి దూర ప్రాంతాల ప్రజలు రావాల్సి వస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలకు చేరువగా ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండు లేదా మూడు గ్రామపంచాయతీలను సమూహంగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా ప్రజలకు మరింత సౌలభ్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలు, వినతులను అధికారులకు తెలియజేసి దరఖాస్తులు సమర్పించాలని, వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిబంధనల ప్రకారం మొత్తం నిధుల్లో 60 శాతం కూలీల వేతనాలకు, 40 శాతం నిర్మాణ సామాగ్రికి కేటాయించబడతాయని తెలిపారు. గ్రామాల్లో కూలీలు ఉపాధి హామీ పనుల్లో అధికంగా పాల్గొని లేబర్ కాంపోనెంట్ శాతాన్ని పెంచితేనే మెటీరియల్ కాంపోనెంట్ కింద అదనపు నిధులు మంజూరవుతాయని పేర్కొన్నారు. ఈ అదనపు నిధుల ద్వారా గ్రామాల్లో శాశ్వత మౌలిక వసతుల అభివృద్ధికి ఉపయోగపడే సీసీ రోడ్లు, గ్రామపంచాయతీ భవనాలు, వీఓ భవనాలు తదితర నిర్మాణాలను చేపట్టేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. గ్రామస్థులు తమకు ఉన్న సమస్యలు, ఫిర్యాదులను లిఖితపూర్వకంగా అందజేస్తే ఐటీడీఏ పరిధిలో సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అంతకుముందు తాడ్వాయి మండలం బందాల గ్రామంలో రూ.10 లక్షల నిధులతో నిర్మించిన అంతర్గత రహదారిని, రూ.20 లక్షల నిధులతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని, బొల్లెపల్లి నుంచి పోచాపూర్ వరకు రూ.5 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన బీటీ రహదారి నిర్మాణ 2 పనులను, పోచాపూర్ గ్రామం నుంచి అల్లిగూడెం వయా నర్సాపూర్ వరకు రూ.6 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన బీటీ రహదారి నిర్మాణ 3 పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం తాడ్వాయి మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు 20 కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్, డీఎఫ్ఓ వికాస్ మీనా,అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి.,సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం



**మహాదేవపూర్ జూన్ 05మనం న్యూస్:** మహాదేవపూర్ మండల కేంద్రంలోస్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని గరిగె రిఖిత పదవ తరగతి పరీక్షల్లో 561/600 మార్కులు సాధించి, బాసర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు ఆమెను శాలువాతో సన్మానించిఘనంగాఅభినందించారు.రిఖితప్రతిభ నుకొనియాడుతూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు చేరాలని ఆకాంక్షించారు.




# ఈతలో మేటి అనిరుధ్

## రాష్ట్ర సీనియర్ జట్టుకు ఎంపిక

హైదరాబాద్, జూన్ 5(మనం,ప్రత్యేక ప్రతినిధి) : కొల్లూరు లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ లో ఇంటర్ చదువుతున్న ఎల్. అనిరుధ్ తెలంగాణ రాష్ట్ర వాటర్ పోలో జట్టుకు ఎంపికయ్యారు. నగరంలోని అంబర్‌పేట జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్లో గత నెల 24 న 11వ రాష్ట్ర సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ నిర్వహించారు. ఈ క్రమంలో వచ్చే నెల 7 నుంచి 12 వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం ఐఎస్టి, కట్టాంకులతూర్‌లోని డా. టీ.కే. పారివేదర్ ఆక్వాటిక్ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న 79వ సీనియర్ నేషనల్ ఆక్వాటిక్ ఛాంపియన్షిప్‌లో తెలంగాణ రాష్ట్ర వాటర్ పోలో జట్టు తరుపున అనిరుధ్ ఆడనున్నారు. స్విమ్మింగ్‌లో ప్రతిభ చూపుతూ ముందుకు సాగుతూ రాష్ట్ర జట్టుకు ఎంపికైన అనిరుధ్‌కు స్ట్రోక్స్ స్విమ్మింగ్ స్కూల్ యజమాని చెరుకూరి భరత్, వినయ్, ఇన్చార్జ్ ప్రసాద్, స్ట్రోక్స్ హెడ్ కోచ్ మేనేజర్ ముక్తార్ అహ్మద్, గచ్చిబౌలి ఆక్వాటిక్ స్టేడియం స్విమ్మింగ్ కోచ్ పి .తిరుపతి యాదవ్ , ఇంచార్జి ఆయుష్ యాదవ్‌లు అభినందించారు.

# 'స్పిన్'పై బీసీసీఐ స్పెషల్ ఫోకస్!

***గింగిరాలు తిరిగే బంతి వస్తే.. దానికి బౌండరీ లైన్ చూపించేంత నైపుణ్యం కలిగిన బ్యాటర్లు మన సొంతం..***

***షేన్ వార్న్, ముత్తయ్య మురళీధరన్ వంటి హేమాహేమీల బౌలింగ్ ను ఎదుర్కోవడానికి మిగతా జట్ల బ్యాటర్లు ఇబ్బంది పడితే.. టీమ్ఇండియా స్టార్లు మాత్రం చెలరేగిపోయారు.***

***అయితే, ఆ పరిస్థితి గతం..***

***ఇప్పుడు పార్ట్ టైమ్ స్పిన్నర్లకూ తమ వికెట్లు ఇచ్చేస్తున్నారు భారత బ్యాటర్లు.***

***కాసేపు క్రీజ్ లో ఉండాలంటేనే చెమటలు పట్టేస్తున్నాయి యువ క్రికెటర్లకు..***

***దాన్నుంచి జట్టును బయట పడేసేందుకే బీసీసీఐ కీలక నిర్ణయంతో అందర్నీ ఆశ్చర్యపరిచింది.***

అవును.. టీమ్ఇండియాకు కొత్తగా స్పిన్ కోచ్ వచ్చాడు. అదేంటీ! ఇప్పటివరకు మనకు స్పిన్ కోచ్ లేడా? అనే అనుమానం రాకమానదు. భారత జట్టుకు ప్రత్యేకించి స్పిన్ కోచ్ అంటూ ఇప్పటివరకు లేడు. తొలిసారి సాయిరాజ్ బహుతులే అనే మాజీ స్పిన్నర్ ను బీసీసీఐ నియమించింది. ఇప్పుడిది హాట్ టాపిక్ గా మారిపోయింది. భారత క్రికెట్ బోర్డు ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకుంది? గత పరాభవాలు పునరావృతం కాకూడదనేదే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందనేది విశ్లేషకుల మాట.

**ఘోర పరాభవం..**

భారత జట్టుకు ప్రధాన కోచ్ గా గౌతమ్ గంభీర్ వచ్చిన కొత్తలో.. స్వదేశంలో జరిగిన న్యూజిలాండ్ టెస్టు సిరీస్ ను టీమ్ఇండియా కోల్పోయింది. అదీనూ 0-3 తేడాతో క్లీన్ స్వీప్ కావడంతో సర్వత్రా విమర్శలు ఎదురయ్యాయి. ఆ టెస్టుల్లో భారత్ విఫలం కావడానికి ప్రధాన కారణం స్పిన్ పిచ్ లే. ప్రత్యర్థిని బుట్టలో వేద్దామని భావిస్తే.. చివరికి కివీస్ స్పిన్నర్ల దెబ్బకు మన బ్యాటర్లే బోల్తా పడ్డారు. దీంతో భారత్ ఘోర పరాభవం చూవిచూసింది. మన బ్యాటర్లు స్పిన్ ను ఎదుర్కోవడంలో తెగ ఇబ్బంది పడ్డారు. అటు మన స్పిన్నర్లూ ప్రభావం చూపించలేదు. ఆ తర్వాత దక్షిణాఫ్రికా చేతిలోనూ మనకు ఓటమి తప్పలేదు.



**ఇప్పుడు అత్యంత కీలకం..**

మొన్నటి వరకూ ఆడిన విరాట్ కోహ్లీ, ఛెతేశ్వర్ పుజారా, రహానే వంటి బ్యాటర్లు స్పిన్ ను కాచుకుని భారీగా పరుగులు రాబట్టారు. అంతకుముందు సచిన్, ద్రవిడ్, గంభీర్, ధోని, గంగూలీ, లక్ష్మణ్ కూ ప్రత్యేకంగా స్పిన్ పాఠాలు నేర్పాల్సిన అవసరం రాలేదు. కానీ, ప్రస్తుతం టీమ్ఇండియాలో ఉన్న బ్యాటర్లంతా టీ20 క్రికెట్ కు బాగా అలవాటు పడిపోయినవారే. క్రీజ్ లో కాసేపు కుదురుకుని పరుగులు రాబడితే టెస్టుల్లో మనుగడ సాధ్యం. కట్టుదిట్టమైన ఫీల్డింగ్ సెటప్ పెట్టి.. రెండు వైపులా స్పిన్ ను సంధిస్తే ఎలా ఆడాలనేది చాలా మంది యువ క్రికెటర్లకు తెలియట్లేదు. సింపుల్ గా వికెట్లు సమర్పించేసి పెవిలియన్ కు చేరతారు. ఇలాంటి పరిస్థితి కొనసాగితే టీమ్ఇండియా టెస్టు భవితవ్యం మరింత ప్రశ్నార్థకంగా మారడం ఖాయం.



**కుర్రాళ్ల కోసం..**

అఫ్గానిస్థాన్ తో స్వదేశంలో శనివారం నుంచి టీమ్ఇండియా ఏకైక టెస్టు ఆడనుంది. రషీద్ ఖాన్, నూర్ అహ్మద్ వంటి స్పిన్నర్లను సుదీర్ఘ ఫార్మాట్లో ఎదుర్కోవడం తేలికైన విషయం కాదు. అసలు ఇప్పుడు మన క్రికెటర్లు టీ20 మూడ్ నుంచి బయటకు రావాల్సి ఉంది. ఇప్పుడు సాయిరాజ్ ను నియమించడం వల్ల యువ బ్యాటర్లకు అతడు స్పిన్ ను ఎదుర్కొనేందుకు చిట్కాలు ఇస్తాడనేది బీసీసీఐ ఆలోచన. ఇక కొత్త బౌలర్లు మానవ్ సుతార్, హర్ష్ దూబేను భవిష్యత్తు అవసరాల కోసం సిద్ధం చేయాల్సి ఉంది.

**ఇప్పుడు కీలకం.. బహుతులే ఎందుకంటే?**

అఫ్గాన్ తో టెస్టు తర్వాత.. సుదీర్ఘ ఫార్మాట్ మ్యాచుల కోసం టీమ్ఇండియా రాబోయే మూడు నెలల్లో శ్రీలంక, న్యూజిలాండ్ లో పర్యటించనుంది. అక్కడి పిచ్ లు కూడా స్పిన్ కు అనుకూలంగా ఉంటాయి. ఇక్కడ అన్నింట్లోనూ గెలిస్తేనే ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్ రేసులో టీమ్ఇండియా నిలిచేందుకు అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో ఉంది. టాప్ -2లోకి రావాలంటే ఈ 'స్పిన్' అడ్డంకిని అధిగమించాలి.

అందుకు సాయిరాజ్ బహుతులేను నియమించడం వెనుక కూడా ఓ కారణం ఉంది. అతడికి ఫస్ట్ క్లాస్ క్రికెట్ లో 630 వికెట్లు తీసిన అనుభవం ఉంది. పలు రాష్ట్రాల క్రికెట్ జట్లకు కోచింగ్ కూడా ఇచ్చాడు. ఐపీఎల్ లోనూ అతడి సేవలను పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ వినియోగించుకోవడం గమనార్హం.



# గ్లామర్ సులువే.. కామెడీయే కష్టం

ఇతరులను నవ్వించడం గ్లామర్ పాత్రల్లో నటించడం కంటే ఎక్కువ శ్రమతో కూడుకున్నదని అంటోంది అందాల తార పూజా హెగ్డే. ఒకప్పుడు వరుస విజయాలతో దక్షిణాది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న కథానాయికీమె. కొన్నాళ్లుగా తన ఖాతాలో సరైన హిట్ లు లేకపోయినా.. అవకాశాలను మాత్రం అందుకుంటూనే ఉంది. ఆమె, మృణాల్ ఠాకూర్, వరుణ్ ధావన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హై జవానీ తో ఇష్క్ హోనా హై'. ఈ సినిమా శుక్రవారం థియేటర్లలోకి రాబోతుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న పూజ.. కొన్ని ఆసక్తికర కబుర్లతో ప్రేక్షకుల ముందుకొచ్చింది.

''నాకు సినిమాల్లో గ్లామర్ గా కనిపించడమే అత్యంత కష్టమైన అంశమని చాలా మంది ప్రేక్షకులు భావిస్తుంటారు. కానీ అసలైన సవాలు కామెడీని పండించడంలోనే ఉంది. దీంతో పాటు ఈ రోజుల్లో సోషల్ మీడియా వల్ల ప్రేక్షకులకు ఎన్నో రకాలుగా వినోదాలు అందుబాటులో ఉన్నాయి. మరోవైపు సినిమాల్లో నటీమణులకు కామెడీ పాత్రలు పోషించడం ఛాలెంజింగ్ గా ఉంటుంది. పరిశ్రమలో ఎంతో మంది విజయవంతమైన మహిళా హాస్య నటులు ఉన్నప్పటికీ.. నటీమణులు కామెడీ చిత్రాలతో ఇబ్బంది పడతారనే అభిప్రాయం ఇప్పటికీ ఉంది. రొమాంటిక్ పాత్రలతో పాటు కామెడీపై పట్టు సాధించడం ఒక నటిగా నా ఎదుగుదలకు అత్యంత అవసరం''.

రోజుల్లో ఓ చిత్రం భావోద్వేగపరంగా కనెక్ట్ అవుతుందో లేదో ప్రేక్షకులు ముందుగానే తెలుసుకుంటున్నారు. థియేటర్లలో ఏ సినిమా చూడాలి అనే విషయంలో వారు చాలా జాగ్రత్తగా ఉంటున్నారు. ఈ కాలంలో సినీప్రియులకు మొబైల్ ఫోన్లలోనే సినిమాలు చూసేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. అందుకే మీరు ఇకపై నకిలీ వినోదాన్ని సృష్టించలేరు. ఒకవేళ సృష్టించినా అది పనిచేయదు''.

''నా సినీ కెరీర్ మొదలైనప్పటి నుంచి పలు పరిశ్రమల నుంచి అవకాశాలు అందుకుంటూనే ఉన్నా. ప్రతి పరిశ్రమకు ఒక విభిన్నమైన వాతావరణం ఉంటుంది. తెలుగు సినిమా ప్రేక్షకుల్లో నాకు గొప్ప స్థానాన్ని ఇచ్చింది. తమిళ పరిశ్రమ కొన్ని విషయాలలో సంయమనం పాటించడం నేర్పింది. హిందీ సినిమాకు ప్రత్యేక అంచనాలు ఉన్నాయి. ఒక నటిగా మిమ్మల్ని మీరు కోల్పోకుండా పరిస్థితులకు అనుగుణంగా మారుతూ.. అన్ని ఇండస్ట్రీల స్టైల్ ను అలవాటు చేసుకోవాలి''.

''ప్రస్తుతం పాన్ ఇండియా సినిమా అనే భావనలో చిత్ర పరిశ్రమ మునిగిపోయింది. కానీ ప్రేక్షకులు భావోద్వేగాలకే స్పందిస్తారు. నిజాయతీకి మాత్రమే కనెక్ట్ అవుతారు. అది మాస్, రొమాన్స్, యాక్షన్.. ఇలా ఏ జానర్ అయినా.. ప్రేక్షకులు అందులో ఏదో ఒక నిజమైన అనుభూతిని పొందాలనుకుంటారు. కమర్షియల్ సినిమాల్లో నటించేటప్పుడు గ్లామర్, ఎమోషన్, కామెడీ, డ్యాన్స్, నటన.. ఇలా అన్నింటినీ ఒకేసారి పర్ఫెక్ట్ గా డెలివరీ చేయడం నటీమణులకు పెద్ద సవాల్. ప్రస్తుతం థియేటర్లలో సినిమాలు చూసే ప్రేక్షకులు తగ్గుతున్నప్పటికీ.. అందరితో కలిసి థియేటర్లలో కూర్చుని సినిమా చూడటంలో ఉన్న మజానే వేరు. అందరూ కలిసి నవ్వడం, చప్పట్లు కొట్టడం, డ్యాన్స్ చేయడం.. ఆ అనుభవాన్ని ఏదీ భర్తీ చేయలేదు. అందుకే వాణిజ్య సినిమాలకు ఎప్పటికీ క్రేజ్ తగ్గదు''.



# నెక్ట్స్ ప్రాజెక్ట్ ఓకే చేసిన వైష్ణవ్ తేజ్..



'ఉప్పెన' సినిమాతో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చిన మెగా హీరో వైష్ణవ్ తేజ్, ఆ తర్వాత వచ్చిన 'కొండపొలం', 'రంగ రంగ వైభవంగా', 'ఆదికేశవ' చిత్రాలతో ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయాడు. దీంతో కథల ఎంపికలో చాలా జాగ్రత్త పడుతున్న ఆయన, గత మూడేళ్లలో దాదాపు 100కు పైగా స్క్రిప్ట్ లను తిరస్కరించినట్లు తెలుస్తోంది. టాప్ నిర్మాతలు సంప్రదించినా సరైన కథ కోసం వేచి చూసిన వైష్ణవ్, ఎట్టకేలకు తన నెక్ట్స్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. గతంలో సుధీర్ బాబుతో 'హంట్' అనే సినిమాను తెరకెక్కించిన దర్శకుడు మహేష్.ఎస్ ఈ సినిమాను డైరెక్ట్ చేయనున్నట్లు తెలుస్తోంది. మహేష్ చెప్పిన నరేషన్ వైష్ణవ్ కు బాగా నచ్చడంతో ఈ ప్రాజెక్ట్ ఓకే అయింది. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై అనిల్ సుంకర ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించేందుకు రెడీ అవుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే నెలలోనే ఈ క్రేజీ ప్రాజెక్ట్ పై అధికారిక ప్రకటన రానుంది. ఆ వెంటనే షూటింగ్ కూడా ప్రారంభించి, ఈ సినిమాతో వైష్ణవ్ తేజ్ మళ్లీ సాలిడ్ కంబ్యాక్ ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నాడు.

# నిర్మాతగా నాగచైతన్య తొలి అడుగు




**'దూత' సీక్వెల్ ప్రారంభం**

'దూత' వెబ్ సిరీస్ తో తొలి ప్రయత్నంలోనే విజయాన్ని అందుకున్నారు నటుడు నాగచైతన్య. ఇప్పుడు ఈ హిట్ సిరీస్ కు సీక్వెల్ సిద్ధమవుతోంది. నేడు పూజా కార్యక్రమాలు జరగ్గా.. నాగార్జున క్లాప్ కొట్టి దీన్ని ప్రారంభించారు. ఈ సీక్వెల్ కు నాగచైతన్య నిర్మాతగా వ్యవహరించనుండటం విశేషం. 'దూత సెకండ్ చాప్టర్ లో నిర్మాతగా నా తొలి అడుగు' అంటూ నాగచైతన్య ఫొటోలు పంచుకున్నారు. మరోసారి మ్యాజిక్ చూడడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. విక్రమ్ కె. కుమార్ దర్శకత్వంలో రూపొందిన 'దూత'.. 2023 డిసెంబరు 1న 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో విడుదలై పలు రికార్డులు సొంతం చేసుకుంది. ఈ హారర్ మిస్టరీ థ్రిల్లర్ లో జర్నలిస్టు సాగర్ వర్మ అవధూరిగా నాగచైతన్య ఆకట్టుకున్నారు.

# దర్శకులు అలాంటి పాత్రలే ఇస్తున్నారు.. - హృతిక్ రోషన్




బాలీవుడ్ అగ్ర కథానాయకుడు హృతిక్ రోషన్ తాను ఇప్పటివరకూ చేసిన పాత్రలను కాకుండా కొత్తగా ప్రయత్నించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దర్శకులు తనను కేవలం పాజిటివ్ రోల్స్ కోసమే సంప్రదించడం కొంత నిరాశ కలిగిస్తోందన్నారు. ప్రస్తుతం ప్యారిస్ పర్యటనలో ఉన్న హృతిక్ ఈఫిల్ టవర్ దగ్గర దిగిన సెల్ఫీని పంచుకున్నారు. దీనికి ఆసక్తికరమైన క్యాప్షన్ పెట్టారు. ''ఎలాంటి పాత్రలు చేయాలనుకుంటున్నారని కొంతమంది నన్ను అడిగారు. దానికి అనుకోకుండా నా మనసులో నుంచి ఓ సమాధానం వచ్చింది. 'లక్ బై ఛాన్స్' సినిమాలో నేను చేసిన 'జాఫర్' పాత్ర లాంటివి చేయాలనుందని చెప్పా. సరిగ్గా అలాంటి పాత్రే కావాలి. కథ దొరికితే నేను అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నాను. కానీ, దర్శకులు నన్ను కేవలం మంచివాడిగా నటించే హీరో పాత్రలకే పరిమితం చేస్తున్నారు'' అని పేర్కొన్నారు. ఇక ఈ పోస్ట్ కు ఆ చిత్ర దర్శకుడు జోయా అక్తర్ రిప్లై పెట్టారు. త్వరలోనే దీని గురించి మాట్లాడుకుందామన్నారు.

2009లో విడుదలైన 'లక్ బై ఛాన్స్'లో హృతిక్ జాఫర్ అనే పాత్రలో నటించారు. అది నెగెటివ్ షేడ్స్ ఉన్న రోల్ కావడంతో ఆయన విలన్ పాత్రల్లో నటించాలని అనుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం హృతిక్ 'క్రిష్ 4' సినిమాతో త్వరలోనే దర్శకుడిగా కూడా పరిచయం కానున్న విషయం తెలిసిందే.

# ఈ వరక్స్‌లో బిజీగా 'ఆదర్శ కుటుంబం'.. కానీ

ఇప్పుడు మన టాలీవుడ్ సీనియర్ హీరోస్ లో వెంకీ మామ కూడా వరుస బ్లాక్ బస్టర్ హిట్స్ తో ఫుల్ ఫామ్ లో ఉన్న సంగతి తెలిసిందే. తన బ్యాక్ టు బ్యాక్ హిట్స్ తర్వాత మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తో ఆదర్శ కుటుంబం అనే ఫ్యామిలీ యాక్షన్ డ్రామా తను చేస్తున్నారు. అయితే ఈ సినిమాకి సంగీత దర్శకుడు థమన్ మధ్యలో యాడ్ అయ్యిన సంగతి తెలిసిందే. ఇప్పుడు థమన్ ఈ సినిమా మ్యూజిక్ పనుల్లోనే బిజీగా ఉన్నట్టు అప్డేట్ అందించాడు. కానీ అభిమానులు మాత్రం అంత పాజిటివ్ గా అయితే లేరు. సినిమాని ఈ ఏడాది వేసవి రిలీజ్ కి ప్రామిస్ చేశారు. కానీ విడుదల చేయలేదు. దీనితో ఈ అప్డేట్స్ కాదు రిలీజ్ ఎప్పుడు అని ఎదురు చూస్తున్నారు. సో దీనిపై ఏమన్నా క్లారిటీ ఇస్తారేమో చూడాలి. ఇక ఈ సినిమాని సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.